

'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 257

గురువారం 1-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'విచారణ కొనసాగుతోంది'

బ్రిజ్‌భూషణ్ కేసుపై త్వరలోనే కోర్టుకు నివేదిక ఇస్తామని పోలీసుల వెల్లడి -12లో



భారత్‌లో ఎంతో మార్పు

అంతర్జాతీయంగా స్థానం బలోపేతం మోర్గాన్ స్టాన్లీ నివేదిక - 13లో



కార్మికులను అగౌరవపరిచారు

దేశ మనోభావాలను కాంగ్రెస్ కించపరిచి, 60వేల మంది కార్మికుల కఠోర శ్రమను అగౌరవపర్చిందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఓటీటీలోనూ 'పొగాకు' హెచ్చరిక

ఓవర్ ది టాప్ (ఓటీటీ) ప్లాట్‌ఫారమ్‌ల్లో పొగాకు వ్యతిరేక హెచ్చరికలు, ప్రకటనల ప్రసారాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది.

వివరాలు 6లో ▸



మూడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

పీఎఫ్ఐ కుట్రలపై దర్యాప్తులో భాగంగా బిహార్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని 25 ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు.

వివరాలు 6లో ▸



పాతికసార్లు పొడిచి మరీ...

పెళ్లి విషయంలో ఓ ఇంట్లో ఘర్షణ జరిగి ఆ కోపంతో తన కుమార్తెను తండ్రి 25 సార్లు కత్తితో పొడిచి హతమార్చాడు.

వివరాలు 6లో ▸

చెప్పుడు మాటలతో దర్యాప్తా?

ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రమేయంపై ఆధారాలేవి?

రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నారు... ఇంకా ఆరోపణలేనా?

సీబీఐ దర్యాప్తు తీరుపై తెలంగాణ హైకోర్టు ప్రశ్నల వర్షం

- ఎవరో ఏదో అనుకుంటున్నారని... అదే సాక్ష్యమంటే ఎలా?
- అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఏం చెప్పారో.. అదే దర్యాప్తా?
- మీ దర్యాప్తు మొత్తం సాక్షుల స్టేట్‌మెంట్లతోనే జరుగుతోంది!
- హత్య వెనక రాజకీయ కోణం ఉందనటానికి ఆధారాలేవి?
- అవినాశ్ పాత్ర ఉందంటూ... రెండేళ్లుగా ఎందుకు విచారించలేదు?
- హంతకుడు వాడిన గొడ్డలిని రికవరీ చేయలేదెందుకు?
- నిందితులకు ఇచ్చిన డబ్బుల్ని కూడా రికవరీ చేయలేదుగా?
- దస్తగిరి అనుచరుడు మున్నాను విచారించలేదెందుకు?
- ఎర్ర గంగిరెడ్డితో మిగతా ముగ్గురికీ ఎలాంటి సంబంధాలున్నాయి?
- వాటిపై మీ దర్యాప్తులో ఎందుకు దృష్టిపెట్టలేదు?
- సాక్ష్యాల ధ్వంసంలో అవినాశ్ పాత్ర ఉందని ఎలా చెబుతారు?
- ఆయన విచారణకు హాజరవుతూనే ఉన్నారుగా? కస్టడీ ఎందుకు?
- అవినాశ్ రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరం లేదని స్పష్టీకరణ
- షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై ఆరోపణలు మినహా ఎలాంటి ఆధారాలు లేవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఎవరో అన్నవి, విన్నవి మినహా సాక్ష్యాలేవని ప్రశ్నించింది. కేవలం చెప్పుడు మాటలు, ఊహాజనిత సాక్ష్యాల ఆధారంగా సీబీఐ తప్పుదారిలో దర్యాప్తు కొనసాగిస్తోందని తప్పుబట్టింది. ఈ కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరం లేదని పేర్కొంటూ ఐదు షరతులతో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్ల రాదని, సాక్షులను ప్రభావితం చేయరాదని, జూన్ చివరి వరకు దర్యాప్తునకు సహకరించాలని, ప్రతి శని వారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ ఎదుట హాజరు కావాలని తెలిపింది. ఒకవేళ అవినాశ్‌ను అరెస్టు చేస్తే రూ.5 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు మరో ఇద్దరి ష్యూరిటీ తీసుకుని

మిగతా 2వ పేజీలో ▶

ఇది మొత్తం న్యాయ వ్యవస్థను

దెబ్బతీసే కుట్ర

ఆ చానెళ్ల కామెంట్లతో కలత చెందా

ఏబీఎన్, మహాటీవీ వీడియోలను సేకరించండి

- తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌కు జస్టిస్ లక్ష్మణ్ ఆదేశం
- చర్యలపై తెలంగాణ హైకోర్టు సీజే నిర్ణయిస్తారన్న న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: తనపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి, మహా టీవీ చానెళ్లలో ప్రసారమైన వీడియోలను డౌన్‌లోడ్ చేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అందజేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ అనంతరం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ ఎం.లక్ష్మణ్ బుధవారం తీర్పునిచ్చారు. ఈ నేపథ్యంలో తన ప్రతిష్టకు భంగం కలిగేలా రెండు టీవీ చానెళ్లు చేసిన ప్రసారాలను న్యాయమూర్తి తప్పుబట్టారు. 'ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్న మీడియాపై నాకు గౌరవం ఉంది. మీడియా స్వేచ్ఛకు నేను అడ్డంకి కాదు. వారికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. అయితే అది

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ తరగతులు



ఏపీలో ఇంటర్ కాలేజీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. యూనిట్-1 పరీక్షలు జూలైలో, యూనిట్-2 పరీక్షలు ఆగస్టులో జరుగుతాయి. అలాగే పరీక్షలు, సెలవుల వివరాలను జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు సమాచారమిచ్చింది.

వివరాలు 3లో ▸

6న శైలజాకిరణ్‌ను విచారించనున్న సీఐడీ



మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ-2గా ఉన్న ఆ సంస్థ ఎండీ చెరుకూరి శైలజాకిరణ్‌కు సీఐడీ మరోసారి నోటీసులిచ్చింది. దీనిపై ఇప్పటివరకు ఆమెగానీ ఆమె తరఫు న్యాయవాదులుగానీ సీఐడీకి ఎలాంటి సమాచారమివ్వలేదు.

వివరాలు 14లో ▸

తిరుపతి జూ పార్కులో పులి కూన మృతి



రెండు నెలల కిందట నంద్యాల జిల్లా నల్లమల నుంచి తిరుపతి జూకి తీసుకొచ్చిన నాలుగు పులి కూనల్లో ఒకటి సోమవారం మృతి చెందింది. కిడ్నీ, ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా అది మరణించినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు.

వివరాలు 5లో ▸

63.14 లక్షల మందికి రూ. 1,739.75 కోట్లు



రాష్ట్ర వ్యాప్తంగా 63,14,192 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గురువారం నుంచి 1739.75 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం పింఛన్ల రూపంలో ప్రభుత్వం గురువారం నుంచి పంపిణీ చేయనుంది.

వివరాలు 2లో ▸

వరుసగా ఐదో ఏడాదీ వైఎస్సార్ రైతు భరోసా

నేడు అన్నదాతలకు పెట్టుబడి సాయం పంపిణీ

- 52.31 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.3923.22 కోట్లు
- 51 వేల మందికి రూ.53.62 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కూడా
- కర్నూలు జిల్లా పత్తికొండలో బటన్ నొక్కి జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పంట నష్టపోతే సీజన్ ముగియక ముందే పరిహారం పంపిణీ



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా తొలి విడత పెట్టుబడి సాయంతో పాటు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు సీజన్ ముగియక ముందే పంట నష్ట పరిహారం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2023–24 సీజన్‌కు సంబంధించి 52.31 లక్షల రైతు కుటుంబాలకు తొలివిడతగా రూ.7,500 చొప్పున మొత్తం రూ.3,923.22 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన 51 వేల మంది రైతులకు రూ.53.62 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించే కార్యక్రమంలో

మిగతా 2వ పేజీలో ▶

3 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- 10 వరకు నిర్వహణ
- 11 పరీక్ష కేంద్రాల ఏర్పాటు.. హాజరు కానున్న 6,455 మంది అభ్యర్థులు.. 111 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ
- జూలైలో ఇంటర్వ్యూలు, ఆగస్టు 15కి నియామక ప్రక్రియ పూర్తి
- అతి త్వరలో 1,962 పోస్టుల భర్తీకి 18 నోటిఫికేషన్లు
- ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్



3 లో

సూక్ష్మ సేద్యంలో ఏపీకి జాతీయ పురస్కారం

- అత్యుత్తమ యాజమాన్య విధానాలకు గుర్తింపు
- పులివెందుల మండలం ఈ.కొత్తపల్లికి అవార్డు
- నూరు శాతం బోర్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల సదుపాయం
- గ్రామంలో రైతులందరికీ సబ్సిడీపై పరికరాలు
- సూక్ష్మ సేద్యంలో ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్


5 లో

పునరావాసం కల్పించాకే..

పోలవరంలో నీటి నిల్వ

- స్పష్టం చేసిన కేంద్ర కమిటీ
- పునరావాసం కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ప్రశంసలు
- కేంద్రం నిధులిస్తే త్వరగా పునరావాసం కల్పిస్తామన్న రాష్ట్ర అధికారులు

14 లో



గాండ్రింం'పులులు'

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 8–10 మధ్య పులులు
- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- ఎఫ్‌డీపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన పులుల గణన
- వివిధ రేంజిలలో 376 కెమెరాలు ఏర్పాటు



రాజంపేట: శ్రీశైలం నుంచి శేషాచలం వరకు విస్తరించి ఉన్న అభయారణ్యంలో పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. వైఎస్సార్, అన్నమయ్య, గిద్దలూరు, తిరుపతిలో టైగర్ కారిడార్ కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌లోని శ్రీశైలంలో టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలో గుండ్ల బ్రహ్మేశ్వర వైల్డ్‌లైఫ్ అభయారణ్యం నుంచి టైగర్ కారిడార్ ప్రారంభమైంది.

పులుల గణన...

అటవీ శాఖ ఆధ్వర్యంలో పులుల గణన చేపడుతున్నారు. పులుల గణన రెండు బ్లాకులలో జరుగుతుంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్-3లోకి వస్తుండగా, ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్-4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్-4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి అటవీశాఖాధికారుల గణన ప్రక్రియ ప్రారంభమైంది.

పెరుగుతున్న పులుల సంఖ్య..

2021లో ఆరు పులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్ధవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి.

ఎక్కడెక్కడ..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్దేలు, సిద్దవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి, బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లో సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చి సర్వే చేశారు.

డేటాలో చిత్రాలు శ్రీశైలం బయోల్యాబ్‌కు ..

ఆయా రేంజిలలో 188 లోకేషన్లకు గాను మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40 రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొక సారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మార్చినెలాఖరుకు గణన పూర్తి...

రెండవ విడతలో జరిపిన గణన మార్చినెలాఖరు నాటికి పూర్తికావడంతో అన్ని డివిజన్‌లలో అమర్చిన కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పులులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం.

ప్రాథమికంగా 8 నుంచి 10 పులుల సంచారం..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గుర్తించారు. పులుల వార్షిక గణనలో భాగంగా అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు. పలుల గణన ప్రక్రియ ఇటీవల ముగియగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం ఎన్ని పులులు ఉన్నాయో పక్కాగా నిర్ధారించే పరిస్థితులు ఇంకా కనిపించడంలేదు. దానికి శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ చేసి నిర్ధారించనున్నారు.

కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు టైగర్ ల్యాబ్‌కు పంపాం

జిల్లాలోని పలు రేంజ్‌లలో పులుల గణన నిమిత్తం కెమెరాలను ఏర్పాటుచేశాం. టైగర్ జాడ కోసం ఏర్పాటుచేసిన కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపాం. డేటాలోని చిత్రాల పరిశీలన కొనసాగుతోంది. పులుల సంఖ్య త్వరలో వెల్లడవుతుంది.

– పీవీ సందీప్‌రెడ్డి, డీఎఫ్ఓ, కడప


శేషాచలం అటవీ ప్రాంతం



క్లుప్తంగా...

నేడు గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన

- కర్నూలు జిల్లా పత్తికొండలో రైతు భరోసా నగదు జమ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం గుంటూరు జిల్లా మంగళగిరి, కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7.30 గంటలకు సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మంగళగిరి చేరుకుంటారు. అక్కడ సీ కే కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నేత పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోదరుడు పేర్నాటి రామలింగారెడ్డి కుమారుడు కౌశిక్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం అక్కడ నుంచి గన్నవరం చేరుకుని.. కర్నూలు జిల్లాకు బయలుదేరుతారు. పత్తికొండలోని సెయింట్ జోసేఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం వరుసగా ఐదో ఏడాది.. తొలి విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

నలుగురు వాణిజ్యపన్నుల ఉద్యోగుల అరెస్ట్

- అవినీతి, అవకతవకలకు పాల్పడటంతో ఉన్నతాధికారి ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వాణిజ్యపన్నుల కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న నలుగురు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ అధికారులు బి.మెహర్‌కుమార్, కె.సంధ్య, సీనియర్ అధికారి కె.వి.చలపతి, ఆఫీస్ సబార్డినేట్ ఎం.సత్యనారాయణ అవినీతికి పాల్పడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని, వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ మొదటి డివిజన్ రాష్ట్ర పన్నుల కార్యాలయం డిప్యూటీ కమిషనర్ బుధవారం పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. నిందితులు డీలర్లతో చేతులు కలిపి అవినీతికి పాల్పడుతున్నారని, స్వప్రయోజనాల కోసం తనిఖీలు, దాడులు చేస్తూ సమన్ల రూపంలో తప్పుడు రికార్డులు సృష్టించి, పంపిణీ రిజిస్టర్లలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఏపీ జీఎస్టీ చట్టం 2017 ప్రకారం విధులను ఉల్లంఘించడంతో పాటు డీలర్లు, ఏజెన్సీలు, వ్యక్తుల ఆదాయాన్ని తక్కువగా చూపి వారివద్ద తక్కువ జీఎస్టీ వసూలు చేయడం, పన్ను ఎగవేతదారులను బెదిరించి అధికంగా నగదు వసూలు చేయడం, కార్యాలయంలో రికార్డులను మాయం చేసి వాటి స్థానంలో తప్పుడు రికార్డులను సృష్టించడం, ఈఎస్ఐ, నీరు–చెట్టు తదితర కార్యక్రమాలకు సంబంధించిన సమాచార విచారణ కోసం ఆడిటర్లను పిలిచి సదరు ఫైళ్లను మూసివేయడానికి నగదు డిమాండ్ చేయడం, పన్ను ఎగవేతదారుల నుంచి డబ్బులు వసూలు చేసి జరిమానాలు విధించకపోవడం వంటివాటికి పాల్పడ్డారని, డీలర్లు సమర్పించిన డేటా, పంపిణీ రిజిస్టర్ల మధ్య వ్యత్యాసాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఆరోపణలు వచ్చిన అధికారులపై 167, 409, 477(ఏ), 201, 420, 384, 120(బీ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఏసీపీ స్థాయి అధికారితో సమగ్రంగా విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు.

అల్లూరి జయంతి వేడుకలకు రాష్ట్రపతి ముర్ము



సాక్షి, హైదరాబాద్: జూలై 4న హైదరాబాద్‌లో జరిగే అల్లూరి సీతారామరాజు 125 జయంతి ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నారని క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల నాగరాజు, నడింపల్లి నాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.8	30.8
రాజమహేంద్రవరం	41.0	27.0
కర్నూలు	40.6	27.4
గుంటూరు	40.0	28.0
తిరుపతి	39.0	28.0
నెల్లూరు	39.0	27.0
విజయవాడ	38.0	29.0
ఏలూరు	38.0	28.0
శ్రీకాకుళం	38.0	24.0
విశాఖపట్నం	37.2	26.2
కడప	35.3	25.3
తెలంగాణలో..		
నల్లగొండ	41.5	22.4
నిజామాబాద్	40.9	28.3
హైదరాబాద్	38.9	25.4

చెప్పుడు మాటలతో దర్యాప్తా?

▶ మొదటి పేజీ తరువాయి

బెయిల్‌పై విడుదల చేయాలని కూడా సీబీఐని ఆదేశించింది. షరతులను అవినాశ్ ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోసం సీబీఐ కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో శుక్ర, శనివారం సుదీర్ఘ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు మే 31న తుది తీర్పు వెలువరిస్తామని, అప్పటివరకు ఆయన్ను అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అవినాశ్‌రెడ్డికి షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది.

సాక్షులెవరూ ఫిర్యాదు చేయలేదు..

'సుదీర్ఘ కాలం దర్యాప్తు చేసినా అవినాశ్‌కు వ్యతిరేకంగా సీబీఐ ఎలాంటి ఆధారాలను సేకరించలేకపోయింది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితమైంది. హత్య జరిగిన ప్రదేశంలో ఆధారాలను చెరిపివేయడంలోనూ అవినాశ్ ప్రమేయం ఉన్నట్లు తేలలేదు. సాక్షులను అవినాశ్ బెదిరిస్తున్నట్లు ఇప్పటివరకు ఎవరూ దర్యాప్తు అధికారులకు ఫిర్యాదు చేయలేదు. సీబీఐ సేకరించింది హియర్ సే ఎవిడెన్స్ (ఫలానా వ్యక్తి నాకు చెప్పారు అని మరొకరికి చెప్పడం), ఊహాజనిత సాక్ష్యాలు మాత్రమే. ఈ హత్య వెనుక భారీ కుట్ర ఉందనేందుకు అవినాశ్‌కు వ్యతిరేకంగా నేరుగా ఒక్క ఆధారం కూడా లేదు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన సమాచారంపైనే సీబీఐ పూర్తిగా ఆధారపడి దర్యాప్తు సాగిస్తోంది. రాజకీయ కోణం అంటున్నా అందుకు ఆధారాలు లేవు. కోర్టుకు ఆరోపణలు కాదు.. ఆధారాలు కావాలి. ఈ అంశాలన్నింటిని క్షుణ్నంగా పరిశీలించిన తర్వాత కస్టోడియల్ విచారణ అవసరం లేదని ఈ కోర్టు భావిస్తోంది.



అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు పిటిషన్‌ను అనుమతిస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. 'సాక్షుల స్టేట్‌మెంట్లతోనే సీబీఐ దర్యాప్తు చేసింది. రెండేళ్ల క్రితమే అవినాశ్ కుట్ర బయటపడిందని చెప్పిన సీబీఐ అప్పుడే ఎందుకు విచారణ చేయలేదో సమాధానం లేదు. హత్యకు వాడిన గొడ్డలిని సీబీఐ రికవరీ చేయలేదు. ఏ–2 గొడ్డలిని నాలాలో పడేసినట్లు చెప్పాడు. నిందితులకు ఇచ్చిన డబ్బును కూడా రికవరీ చేయలేదు. దస్తగిరి అనుచరుడు మున్నాను ఈ డబ్బుకు సంబంధించి విచారించలేదు. వివేకా అల్లుడు తానే లేఖను దాచిపెట్టానని వాంగ్మూలంలో చెప్పాడు. ఎర్రగంగిరెడ్డితో మిగతా ముగ్గురు నిందితులకు ఉన్న సంబంధాలను సీబీఐ కనుగొనలేదు. వివేకా తలపై గాయాలున్నా హత్య కేసుగా నమోదు కాలేదు. అనుమానాస్పద మృతి కిందే కేసు నమోదు చేయడం నాటి విచారణాధికారి తప్పిదమే. కడప ఎంపీ టికెట్ వివాదంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలూ లేవు. వివేకా హత్య కేసులో, సాక్ష్యాల ధ్వంసంలో అవినాశ్ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లేవు' అని తీర్పు సందర్భంగా న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఎక్కడా అవినాశ్ పాత్ర లేదు: న్యాయవాది

'ఈ హత్య కేసు వెనుక భారీ కుట్ర ఉందంటున్న సీబీఐ, అవినాశ్‌కు వ్యతిరేకంగా ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయింది. విచారణకు అవినాశ్ సహకరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఏడు సార్లు విచారణ జరిగింది. హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించి దాదాపు నాలుగేళ్లు అవుతున్నా సీబీఐ ఆరోపణలు మినహా అవినాశ్‌కు వ్యతిరేకంగా ఆధారాలను చూపడం లేదు. సాక్ష్యాలు లేకుండా ఓ పార్లమెంట్ సభ్యుడి ప్రజా జీవితాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది. వివేకా హత్య జరిగిన రోజు అవినాశ్ అక్కడకు చేరుకునేటప్పటికి అందరూ గుండెపోటు, రక్తపు వాంతులతో చనిపోయారని చెబుతుండటంతో ఆయన కూడా తొలుత అలాగే భావించారు. సాక్ష్యాల ధ్వంసంలోనూ ఆయన పాత్ర లేదు. అప్పటికే పలు ఫోన్లలో వీడియోలు, ఫొటోలు నిక్షిప్తమై ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు విచారించిన నేపథ్యంలో కస్టోడియల్ విచారణ అవసరం లేదు' అని అవినాశ్ న్యాయవాది పేర్కొన్నారు.

బెయిల్ మంజూరుకు కోర్టు పరిగణలోకి తీసుకున్న అంశాలివీ..

తొలి చార్జిషీట్ సమయంలో అవినాశ్‌కు సంబంధం ఉండొచ్చని అనుమానించిన సీబీఐ విచారణ నోటీసులు జారీ చేసేందుకు మాత్రం రెండేళ్లు ఆగింది. జనవరి నుంచి విచారణకు హాజరు కావాలని మాత్రమే నోటీసులు జారీ చేసింది. ఒకవేళ ఆయన్ను అరెస్టు చేసే ఉద్దేశం ఉంటే సీబీఐ ఇన్నేళ్లు ఎందుకు ఆగిందనే దానికి దర్యాప్తు అధికారుల వద్ద సమాధానం లేదు. అవినాశ్ తల్లి మెడికల్ రికార్డులను పరిశీలిస్తే శస్త్రచికిత్స వాస్తవమే అన్నది తెలుస్తోంది. విచారణ సందర్భంగా హైకోర్టు అడిగిన పలు ప్రశ్నలకు సీబీఐ సమాధానం చెప్పలేకపోయింది.

ఇది మొత్తం న్యాయ వ్యవస్థను
దెబ్బతీసే కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా ఉండాలే కానీ నిరాధార ఆరోపణలను ప్రచారం చేయడం సరికాదు. కొందరు వ్యక్తుల నిరాధార ఆరోపణలను కొన్ని చానళ్లు ప్రచారం చేస్తూ ప్రతిష్టను దిగజార్చుకుంటున్నాయి. చర్చల పేరుతో ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదు. ఈ కేసు విచారణ జరుపుతున్న నాపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహా టీవీ చానళ్ల అసత్యాలను ప్రసారం చేసి నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు బెదిరించే యత్నం చేశాయి. ఇది నాపై జరిగిన వ్యక్తిగత దాడి మాత్రమే కాదు.. మొత్తం న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుట్ర. ఈ కేసులో నేను స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోకుండా ప్రభావితం చేసే ప్రయత్నం జరిగింది. ఆ చానెళ్ల చర్చల్లో చేసిన కామెంట్లపై తీవ్రంగా కలత చెందా. ఒక దశలో విచారణ నుంచి తప్పుకోవాలని భావించా. సుప్రీం కోర్టు ఆదేశాలు, పవిత్రమైన న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవంతో విచారణ కొనసాగించా. ఎలాంటి బెదిరింపులు వచ్చినా నా విధులు కొనసాగిస్తానని న్యాయమూర్తిగా చేసిన ప్రమాణాన్ని గుర్తు తెచ్చుకున్నా. ఏబీఎన్, మహాటీవీలో జరిగిన చర్చల వీడియోలను అందచేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తున్నా. హైకోర్టు న్యాయమూర్తికి డబ్బు సంచులు వెళ్లాయంటూ సస్పెండైన ఓ న్యాయాధికారి కామెంట్లు చేస్తారా? మరో వ్యక్తి.. 'చేయండిరా..!' అనే అసభ్య పదజాలాన్ని వినియోగిస్తాడా? ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. కచ్చితంగా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. వారిపై చర్యలు తీసుకోవాలా? వద్దా? అన్నది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. నా వ్యక్తిగత ఇమేజ్ గురించి పెద్దగా కలత చెందడం లేదు. ఎందుకంటే ఎవరో చెరిపేస్తే చెరిగిపోయేది ఇమేజే కాదు. తీర్పు వెల్లడించాల్సిన హైకోర్టు న్యాయమూర్తిపై నేరుగా వ్యాఖ్యలు చేయడం క్షమించరానిది' అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలి

– ఒగ్గు గవాస్కర్, న్యాయవాది

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్‌పై ఆరోపణలు చేసిన వారిపై, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహా న్యూస్ చానెళ్లపై, ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై సెక్షన్ 129, 215 కింద కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని న్యాయవాది ఒగ్గు గవాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఆయన లేఖ రాశారు. 'ఏబీఎన్ యజమాని వేమూరి రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ పర్వతనేని వెంకటకృష్ణపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్స్–1994 రూల్ 6 ప్రకారం తప్పుడు ప్రచారాలపై నిషేధం ఉన్నా నైతిక విలువలను ఉల్లంఘించి ప్రసారాలు చేశారు. ఏబీఎన్ లైవ్ డిబేట్‌లో పాల్గొన్న రామకృష్ణ నేరుగా జస్టిస్ ఎం.లక్ష్మణ్‌పై ఆరోపణలు చేయడం సహించరాని నేరం. కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కొంటానని సవాల్ చేయడం న్యాయ వ్యవస్థను కించపరచటమే' అని లేఖలో పేర్కొన్నారు.

న్యాయం, ధర్మం గెలిచాయి

- ఎంపీ అవినాశ్‌కి ముందస్తు బెయిల్ మంజూరు తీర్పులో నిజాలు నిగ్గుతేలాయి
- వివేకా హత్య కేసులో ఎల్లో మీడియా ఇష్టానుసారం కథనాలు ఇస్తోంది
- బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో మీడియా పరిధి దాటిందన్న న్యాయమూర్తి
- ఒక దశలో విచారణ నుంచి తప్పుకోవాలని అనుకున్నానని తీర్పులో వెల్లడి
- ఎల్లో మీడియా తప్పుడు ప్రచారానికి ఇదే నిదర్శనం
- సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నేతలపై ఎల్లో మీడియా దుష్ప్రచారం
- సీఎం జగన్‌ను ఎదుర్కోలేని చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడమే వారి అజెండా
- వివేకా హత్యలో రాజకీయ కోణం ఎక్కడా లేదు.. ఆస్తి, కుటుంబ వ్యవహారాల కోణాల్లో సీబీఐ దర్యాప్తు చేయడం లేదు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో నిజానిజాలు నిగ్గ తేలాయని, న్యాయం, ధర్మం గెలిచాయని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర



కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. బెయిల్, ముందస్తు బెయిల్ మంజూరు సాధారణమే అయినా.. తెలంగాణ హైకోర్టు తీర్పునకు ప్రత్యేకత ఉందని తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ విచారణ చేపట్టినప్పటి నుంచి ఎల్లో మీడియా (ఈనాడు, ఏబీఎన్, టీవీ 5, మహాన్యూస్) సొంత అజెండాతో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాయని చెప్పారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సత్తా లేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడమే అజెండాగా, సీబీఐ విచారణను ప్రభావితం చేసేలా కట్టుకథలతో దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆ మీడియా (ఏబీఎన్, మహాన్యూస్ ఛానల్) పరిధి దాటి వ్యవహరించిందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి తీర్పులో వెల్లడించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోకుండా ప్రభావితం చేసేందుకు ఆ మీడియా ప్రయత్నించిందని న్యాయమూర్తి పేర్కొన్నారని తెలిపారు.

న్యాయవ్యవస్థను కించపరుస్తారా?

'అవినాశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సమయంలో హైకోర్టు న్యాయమూర్తికి కూడా దురుద్దేశాలను ఆపాదించేలా డబ్బు సంచులు అందాయంటూ సస్పెండైన ఓ జడ్జి ఏబీఎన్, మహా న్యూస్ చానళ్ల చర్చల్లో ఆరోపణలు చేశారు. సస్పెండైన ఆ జడ్జి టీడీపీ ముఠాతో తిరుగుతున్నారనే విషయం అందరికీ తెలుసు. సస్పెండైన ఆ జడ్జి అన్యాయంగా చేసిన ఆరోపణలను హైకోర్టు న్యాయమూర్తి తీర్పులో ప్రస్తావించారు. ఓ దశలో విచారణ నుంచి తప్పుకోవాలని అనుకున్నానని పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే.. ఎల్లో మీడియా గ్యాంగ్ వ్యవస్థలను మేనేజ్, మానిప్యులేట్, థ్రెటెన్, డిఫేమ్ చేయడం ద్వారా చంద్రబాబుకు అజెండాను ఖరారు చేస్తున్నాయన్నది మరోసారి నిరూపితమైంది. ఎల్లో మీడియా చేతిలో చంద్రబాబు ఓ పావు. ఆ మీడియా చెప్పినట్టు చేయడం మినహా టీడీపీకి సొంత అజెండా లేదు. సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ వెళ్తే.. మేనేజ్ చేయడానికి వెళ్లారంటూ న్యాయ వ్యవస్థను కించపరుస్తున్నారు. ఈ మధ్య సీఎం వైఎస్ జగన్ పేరును కూడా సీబీఐ చేర్చిందని ముందురోజే ఆ మీడియాలో వచ్చింది. వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని, ఆ పార్టీ నేతల వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ.. ప్రజలను గందరగోళానికి గురిచేయాలన్న కుట్ర ఇది. ఏది ఏమైనా చివరకు గెలిచేది న్యాయమే అన్నది ఈ తీర్పుతో స్పష్టమైంది. వివేకా హత్యకు బయటకు చెప్పుకోలేని కారణాలూ ఉండొచ్చు. వ్యవస్థలను గౌరవించే మేము వారి తప్పుడు ప్రచారాన్ని భరిస్తూ చేతులు కట్టేసుకోవాల్సి వస్తోంది. ఈ కేసులో సీబీఐ ఒక్క కోణంలోనే దర్యాప్తు చేస్తోంది. వివేకా ఆస్తి, కుటుంబ వ్యవహారాలు వంటి కీలక అంశాలపై విచారణ చేయడం లేదు. సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. ఎల్లో మీడియా తరహాలో చేస్తే దర్యాప్తు జరగదు' అని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు.

రాజకీయ కోణం లేనే లేదు

'వైఎస్ జగన్ చెమటోడ్చి నిర్మించుకున్న పార్టీ వైఎస్సార్‌సీపీ. పార్టీ ఆవిర్భవించిన సమయంలో వివేకా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. వైఎస్ విజయమ్మపై పోటీ చేశారు. ఆ తర్వాత వివేకా వైఎస్సార్‌సీపీలోకి వస్తానంటే వైఎస్ జగన్ సాదరంగా ఆహ్వానించి, తగిన గౌరవం ఇచ్చారు. పార్టీలో ఎవరికి టికెట్లు ఇవ్వాలో నిర్ణయించేది వైఎస్ జగన్ మాత్రమే. కడప ఎంపీ సీటును వైఎస్ అవినాశ్‌కు ఇచ్చారు. అప్పటికే ఆయన సిట్టింగ్ ఎంపీ కూడా. ఈ విషయంలో సంబంధం లేని నలుగురు వ్యక్తులు.. కుటుంబ సభ్యులు కావచ్చుగానీ పార్టీ నిర్ణేతలు కాదు. వాళ్లకు వాళ్లే చర్చించుకుంటే సంబంధం ఏముంటుంది? దీన్ని బట్టి చూస్తే వివేకా హత్య కేసులో రాజకీయ కోణం ఎక్కడా లేదన్నది స్పష్టమవుతోంది. ఈ విషయం రాష్ట్రంలో అందరికి తెలుసు. చంద్రబాబు, బీజేపీలోకి ఆయన పంపిన మనుషుల ప్రభావంతో సీబీఐ విచారణ పక్కదారి పట్టింది' అని సజ్జల చెప్పారు.

63.14 లక్షల మందికి రూ.1,739.75 కోట్లు

నేటి నుంచి పింఛన్ల పంపిణీ.. ఒక్క రోజు ముందే సచివాలయాల ఖాతాలో జమ



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 63,14,192 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గురువారం నుంచి 1739.75 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం పింఛన్ల రూపంలో పంపిణీ చేయనుంది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా ఈ డబ్బులను బుధవారమే ఆయా గ్రామ/వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయగా..స్థానిక సిబ్బంది నిధులను డ్రా చేసి, వలంటీర్ల వారీగా పంపిణీ కూడా చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచి తమ పరిధిలోని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. వలంటీర్ల ఆధ్వర్యంలో 5వ తేదీ వరకు లబ్ధిదారుల ఇంటి వద్దనే ఈ పంపిణీ కొనసాగుతుందని.. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పంపిణీ ప్రక్రియ కొనసాగేందుకు 26 జిల్లాల్లో డీఆర్‌డీఏ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లనూ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వరుసగా ఐదో ఏడాదీ
వైఎస్సార్ రైతు భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నాలుగేళ్ల వ్యవధిలో సీఎం జగన్ ప్రభుత్వం రైతన్నలకు వివిధ పథకాల ద్వారా రూ.1,61,236.72 కోట్ల మేర నేరుగా సాయాన్ని అందించడం గమనార్హం.

ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్ ముగియక ముందే..

వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్ ముగియక ముందే పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తూ బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల 78,830 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 51,468 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి రూ.53.62 కోట్ల పంట నష్టపరిహారాన్ని పెట్టుబడి సాయంతో పాటు బుధవారం జమ చేయనున్నారు. ఈ సాయంతో కలిపి 22.73 లక్షల మంది రైతులకు రూ.1,965.41 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేసినట్లవుతుంది.

నాలుగేళ్లలో రూ.30,985.31 కోట్ల పెట్టుబడి సాయం

వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా అర్హులైన భూ యజమానులతో పాటు దేవదాయ, అటవీ (ఆర్‌ఓఎఫ్‌ఆర్) భూముల సాగుదారులతోపాటు సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులకు మే నెలలో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు చొప్పున జమ చేస్తున్నారు. ఇలా 2019–20లో 46,69,375 మందికి రూ.6,173 కోట్లు సాయం అందించారు. 2020–21లో 51,59,045 మందికి రూ.6,928 కోట్ల మేర సాయం అందింది. 2021–22లో 52,38,517 మందికి రూ.7,016.59 కోట్లు, 2022–23లో 51,40,943 మందికి రూ.6944.50 కోట్లు చొప్పున సాయాన్ని ఖాతాల్లో జమ చేశారు. తాజాగా 2023–24కి సంబంధించి 52,30,939 మంది అర్హత పొందగా వీరికి తొలి విడతగా రూ.3923.22 కోట్ల మేర సాయం అందించనున్నారు. ఈ ఏడాది తొలి విడత సాయం కోసం అర్హత పొందిన వారిలో భూ యజమానులు 50,19,187 మంది, అటవీ భూ సాగుదారులు 91,752 మంది ఉండగా, భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులు 1.20 లక్షల మంది ఉన్నారు. 2023–24లో అందించే ఈ తొలివిడత సాయం రూ.3923.22 కోట్లతో కలిపి ఇప్పటివరకు సగటున 52 లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.30,985.31 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లవుతుంది.

బీసీ కుల గణనపై
జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

అధ్యయన కమిటీని నియమించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

- ఏపీలోనే బీసీలకు రాజ్యాధికారంలో 65% వాటా
- సమసమాజ నిర్మాణానికి పని చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలి
- అన్ని రాజకీయ పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి
- జూన్‌లో విజయవాడలో 139 కుల సంఘాలతో కీలక సమావేశం
- జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, అమరావతి/కాచిగూడ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కుల గణనకు అధ్యయన కమిటీని నియమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. 139 బీసీ కులాల గణనను వేగంగా, నిష్పక్షపాతంగా చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అన్ని పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 139 కుల సంఘాల ప్రతినిధులతో జూన్ మొదటి వారంలో విజయవాడలో కీలక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో 54 కుల సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశంలో ఎవరూ చేయని విధంగా సీఎం జగన్ రాజ్యాధికారంలో 65 శాతం పైగా వాటా బీసీలకు కల్పించారన్నారు. సమసమాజ నిర్మాణం కోసం పని చేస్తున్న సీఎం జగన్‌కు అన్ని



వర్గాలు అండగా నిలబడాలని కోరారు. నాలుగేళ్లుగా ఏపీలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నవరత్నాల ద్వారా ఆర్థిక, సుస్థిర ప్రగతి సాధించేలా పాలన సాగుతోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసి పేదరికం లేని సమాజ నిర్మాణానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించుకునేలా బీసీలంతా ఏక తాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీ బిల్లుకు బీజేపీ ఇతర పార్టీల మద్దతు కూడగట్టాలని, లేకుంటే దేశవ్యాప్తంగా బీసీలంతా ఆ పార్టీని బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్ మాట్లాడుతూ.. బీసీలపై పేటెంట్ హక్కు సీఎం జగన్‌కే ఉందని చెప్పారు. చంద్రబాబు దొంగ నాటకాలను నమ్మి మోసపోయే పరిస్థితిలో బీసీలు లేరన్నారు.

పలు తీర్మానాలకు ఆమోదం

ఏపీలో కుల గణన అధ్యయనానికి కమిటీని నియమించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలపడంతో పాటు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బీసీ డిక్లరేషన్ ప్రకటన, జూన్ మొదటి వారంలో విజయవాడలో 139 కుల సంఘాలతో కీలక సమావేశం ఏర్పాటు చేసేందుకు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, అంజి, పి.సుధాకర్, సి.రాజేందర్, రామకృష్ణ, అనంతయ్య, సుశీల, గూడూరి నాని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ దిశగా పయనిస్తున్నాం



అత్యుత్తమ సేవా పతకాలు అందుకున్న వారితో నేవీ చీఫ్ హరికుమార్

- భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్
- విశాఖలో నావికాదళ ప్రతిష్టాపన వేడుక
- 33 మంది నౌకాదళ ధీరులకు అవార్డులు అందజేత

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళం శత శాతం ఆత్మనిర్భర్ భారత్ సాధించేందుకు నిరంతరం శ్రమిస్తోందని భారత నావికాదళాధిపతి (ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్) ఆర్.హరికుమార్ అన్నారు. విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో నావికాదళ ప్రతిష్టాపన వేడుక (నేవల్ ఇన్వెస్టిచర్ సెర్మనీ)–2023కి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళం విశిష్ట సేవలందిస్తోందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతమని కొనియాడారు. నౌకాదళంలో షిప్ బిల్డింగ్, ఇతర సేవలకు సంబంధించి ప్రస్తుతం 62–65 శాతం మూలధన వ్యయం కేటాయించామని, 2035 నాటికి ఇది 80 శాతానికి చేరుకుంటుందని చెప్పారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్టార్టప్స్‌ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 100 స్టార్టప్స్ రాగా.. ఇందులో మూడింటిని నౌకాదళంలో అమలు చేస్తున్నట్టు వివరించారు. ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌకపై ఇటీవలే రాత్రి సమయంలో ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్‌ని విజయవంతంగా నిర్వహించామని, ఈ ఏడాది నవంబర్‌లో తుది దశ రీఫిట్ పనులు పూర్తయిన తర్వాత.. 2024లో విశాఖ కేంద్రంగా సేవలు ప్రారంభించనుందని ప్రకటించారు. ఇప్పటి వరకు అగ్నిపథ్ ద్వారా 280 మంది మహిళలు సహా 2,582 మందిని రిక్రూట్ చేసుకున్నామని చెప్పారు. అనంతరం భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించిన 33 మందికి నేవీ అత్యుత్తమ పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా, నౌకాదళాధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీ హారియర్ మ్యూజియం సందర్శన

బీచ్‌రోడ్డు: ఇటీవల విశాఖ ఆర్కే బీచ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సీ హారియర్ యుద్ధ విమానం మ్యూజియాన్ని భారత నావికాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ బుధవారం సందర్శించారు. ఆయనకు కలెక్టర్ మల్లికార్జున సాదర స్వాగతం పలికారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఇంటర్ తరగతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కాలేజీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మాధ్యమిక విద్యాశాఖ 2023-24 విద్యా సంవత్సరం కేలండర్‌ను ఇప్పటికే విడుదల చేసింది. యూనిట్-1 పరీక్షలు జూలై 26 నుంచి 28 వరకు, యూనిట్-2 పరీక్షలు ఆగస్టు 24 నుంచి నిర్వహించనున్నారు. అలాగే విద్యార్థులకు నిర్వహించే వివిధ పరీక్షలు, సెలవుల వివరాలను పేర్కొంటూ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు మొదటి దశ ప్రవేశాలకు జూన్ 14 వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుత ప్రవేశాలకు ఎస్ఎస్‌సీ ఇంటర్నెట్ మార్కుల మెమో ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని ఆయా కాలేజీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పాలిసెట్ ఆప్షన్ ప్రక్రియ వాయిదా

సాక్షి, అమరావతి: పాలిసెట్-2023లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ జూన్ 1 నుంచి ప్రారంభం కావాల్సి ఉందని, అయితే వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులు చేస్తున్నందున ఆ ప్రక్రియను వాయిదా వేసినట్టు అడ్మిషన్స్ డిప్యూటీ డైరెక్టర్ బి.కళ్యాణ్ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు, కాలేజీల్లో రిపోర్టింగ్ వంటి అంశాలకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపునకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఉందని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు.

ఏపీ పీసెట్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం



ప్రవేశ పరీక్షలో భాగంగా పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పీసెట్-2023లో భాగంగా ప్రవేశ పరీక్షలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రవేశ పరీక్షల ఓఎస్‌డీ డాక్టర్ ఎం.సుధీర్ కుమార్ ప్రవేశ పరీక్షలను ప్రారంభించారు. దేహదారుఢ్యం, క్రీడా నైపుణ్య పరీక్షలను పరిశీలించారు. తొలిరోజు ప్రవేశ పరీక్షలకు 340 మంది హాజరయ్యారని పీసెట్ కన్వీనర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు.

కేజీబీవీల్లో అన్ని పోస్టులకు ఒకే దరఖాస్తు

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న కేజీబీవీల్లో 1,358 పోస్టులకు సంబంధించి అభ్యర్థులు వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఒక అభ్యర్థి ఒకటికి మించి పోస్టులకు దరఖాస్తులు చేయాలనుకుంటే అన్ని పోస్టులకు ఒకసారి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, పోస్టుకు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు. ఈ నెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇప్పటికే ఎవరైనా అభ్యర్థులు ఒక పోస్టుకు దరఖాస్తు చేసి, మరలా మరో పోస్టుకు రెండో దరఖాస్తు సమర్పించాలనుకుంటే వారు apss&kgbv@apschooledu.in మెయిల్‌కు అభ్యర్థి సంతకం, వివరాలతో లెటర్ పంపిస్తే దరఖాస్తును రద్దు చేసి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి మానిటరింగ్ సెల్‌కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 94412 70099 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాబోయే రెండు రోజులు ఎండలు

సాక్షి, అమరావతి: రాబోయే రెండు రోజులు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. గురువారం 15 మండలాలు, శుక్రవారం 302 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లి, బుచ్చయ్యపేట, చోడవరం, కె.కోటపాడు, కశింకోట, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, సబ్బవరం మండలాలు, కాకినాడ జిల్లా కోటనందూరు, తుని మండలాలు, విజయనగరం జిల్లా జామి, కొత్తవలస మండలాలు, విశాఖలోని పద్మనాభం మండలంలో వడగాడ్పుల తీవ్రత ఉంటుందని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వడగాడ్పులు, అకాల వర్షాలు, పిడుగుపాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడేటప్పుడు చెట్ల కింద నిలబడవద్దని విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, బుధవారం కర్నూలు జిల్లా మంత్రాలయంలో 43.4 డిగ్రీలు, ప్రకాశం జిల్లా మర్రిపూడిలో 43.1 డిగ్రీలు, ఏలూరు జిల్లా కామవరపుకోట మండలంలో 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.

3 నుంచి గ్రూప్-1 మెయిన్స్

10 వరకు నిర్వహణ



సాక్షి, అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 3 నుంచి 10 వరకు ఈ పరీక్షలు ఉంటాయని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ తెలిపారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో కమిషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్, సభ్యులు సలాం బాబు, సుధీర్‌తో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 111 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి ఈ ఏడాది జనవరి 8న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి 27న ఫలితాలను వెల్లడించారు. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులకు రెండో దశ అయిన మెయిన్స్‌ను శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సవాంగ్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 1,26,449 మంది దరఖాస్తు చేసుకోగా 87,718 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 6,455 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. వీరికి రాష్ట్రంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలను పరీక్షల కోఆర్డినేటర్లుగా నియమించామన్నారు. అభ్యర్థులను పరీక్ష తేదీల్లో ఉదయం 8.30 నుంచి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. పెన్, పేపర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. భాషా పేపర్లు తప్ప మిగిలినవి తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటాయన్నారు.

తొలిసారి బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్

వాస్తవానికి మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్‌లోనే జరగాల్సి ఉన్నా ఆ సమయంలో సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు ఉన్న నేపథ్యంలో జూన్‌కు వాయిదా వేసినట్టు సవాంగ్ వెల్లడించారు. మెయిన్స్‌కు హాజరయ్యే అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేస్తామన్నారు. గతంలో ఈ విధానం లేదని.. ఏపీపీఎస్సీ చరిత్రలో తొలిసారిగా దీన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ట్యాంపరింగ్, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి కదలిక, శబ్దాన్ని గుర్తించేలా అందులో ఏర్పాట్లు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలను ఏపీపీఎస్సీ కేంద్ర కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించామని తెలిపారు. మెయిన్స్ పూర్తయిన వెంటనే జూలై రెండో వారానికి జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేస్తామన్నారు. ఆగస్టులో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. ఆగస్టు 15 కల్లా గ్రూప్-1 భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. కాగా, సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరలో 1,962 పోస్టుల భర్తీకి చర్యలు

అతి త్వరలో 1,962 పోస్టులకు సంబంధించి 18 నోటిఫికేషన్లు రానున్నాయని సవాంగ్ తెలిపారు. త్వరలోనే గ్రూప్-2 పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ రానుందని వెల్లడించారు. ఏపీపీఎస్సీ 2019-23 మధ్య 57 నోటిఫికేషన్ల ద్వారా 5,705 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టి.. ఇప్పటిదాకా 4,594 పోస్టులను భర్తీ చేసిందన్నారు. మిగిలిన పోస్టుల భర్తీ వివిధ స్థాయిల్లో ఉన్నట్టు వివరించారు. గతంలో ఇచ్చిన ఆరు నోటిఫికేషన్లపై కోర్టు కేసులు ఉన్నందున భర్తీ ఆలస్యమవుతోందని తెలిపారు. మరో ఏడు నోటిఫికేషన్ల పోస్టులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే మరో 9 నోటిఫికేషన్ల ఫలితాలు వెల్లడించాల్సి ఉందన్నారు. సరైన కారణం లేకుండా కొందరు పరీక్షలపై కోర్టులను ఆశ్రయిస్తున్నారని.. దీంతో భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతోందని చెప్పారు. ఈసారి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అందువల్లే ఈసారి గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చిన మూడు నెలల్లోనే ప్రిలిమ్స్ నిర్వహించి 19 రోజుల్లోనే ఫలితాలను వెల్లడించామని తెలిపారు.

పరీక్షల షెడ్యూల్ ఇదీ..

- జూన్ 3- తెలుగు
- 5- ఇంగ్లిష్ (అర్హత పేపర్లు)
- 6- పేపర్-1 (జనరల్ ఎస్సే)
- 7- పేపర్-2 (హిస్టరీ అండ్ కల్చర్, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ)
- 8- పేపర్-3 (పాలిటీ, రాజ్యాంగం, గవర్నెన్స్, లా అండ్ ఎథిక్స్)
- 9- పేపర్-4 (భారత్, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్)
- 10- పేపర్-5 (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం అంశాలు)

• తెలంగాణ

తెలుగు వర్సిటీ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు


హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా నిర్వహించే వివిధ కోర్సుల ప్రవేశ ప్రకటనను బుధవారం విడుదల చేశారు. 2023-24వ విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయం నిర్వహించే రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నారు. శిల్పం, చిత్రలేఖనం, డిజైన్స్, లైబ్రరీ సైన్స్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు చరిత్ర, పర్యాటకం, భాషా శాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా తదితర అంశాలలో తెలుగు విశ్వవిద్యాలయం పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది. ఆయా కోర్సులలో ప్రవేశం పొందగోరే విద్యార్థుల నుండి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతున్నారు. దరఖాస్తులను జూన్ 16లోగా, ఆలస్య రుసుముతో జూన్ 30 లోగా విశ్వవిద్యాలయానికి సమర్పించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో సూచించారు.

2023-24 పీహెచ్‌డీ ప్రవేశాలు

భాషా శాస్త్రం, సంగీతం, నృత్యం, రంగస్థలం, జానపదం, జర్నలిజం, చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్రం, జానపద గిరిజన విజ్ఞానం తదితర అంశాలలో తెలుగు విశ్వవిద్యాలయం 2023-24వ విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను చూడొచ్చు.

రాబోయే విపత్తుల్ని సమర్థంగా ఎదుర్కొందాం

- జూన్ 8న రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు
- జూన్ 12వ తేదీ నాటికి రాష్ట్రమంతటా విస్తరణ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



అమరావతి: రానున్న నైరుతి రుతుపవన కాలంలో సంభవించే తుపానులు, వరదలు వంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. నైరుతి రుతుపవనాల సన్నద్ధతపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులతో ఆయన సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. నైరుతి రుతు పవనాలు జూన్ 4వ తేదీకి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని, జూన్ 8వ తేదీ నాటికి ఏపీలో ప్రవేశించి 12వ తేదీకి రాష్ట్రమంతటా విస్తరించే వీలుందని సీఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా సముద్ర తీర, నదీ పరివాహక మండలాల్లో ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. తుపానులు, వరదలు సంభవిస్తే ఆస్తి, ప్రాణ నష్టాలు కనిష్ట స్థాయికి తగ్గించేందుకు వీలుగా అవసరమైన పరికరాలు, సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. గత ఏడాది తిరుపతి నగరంలో అండర్ పాస్ వద్ద నీరు నిలిచి ప్రాణ నష్టం జరిగిందని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రమాదకర అండర్ పాస్‌ల వద్ద శాశ్వత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, కాలువ గట్లు, రిజర్వాయర్ల గట్లు, వివిధ రహదారులపై గల కల్వర్టులను తనిఖీ చేసి వాటి పటిష్టతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ నైరుతి రుతుపవనాల సన్నద్ధత ఏర్పాట్లపై శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ శంఖబ్రత బాగ్చి, ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ డీఐజీ రాజకుమారి, కార్యదర్శి పి.భాస్కర్, ఏపీఎస్డీఎంఏ ఈడీ నాగరాజు, వాతావరణ శాఖ డైరెక్టర్ స్టెల్లా తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగానికి కొత్త జవసత్వాలు

మంత్రి కాకాణి



సహకార భూమి పక్షపత్రిక ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడతూర్పు): సహకార రంగం పటిష్టతకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. సహకార స్ఫూర్తితో ఏర్పాటు చేసిన 'సహకార భూమి' పక్ష పత్రికను విజయవాడలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సహకార రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సహకార రంగానికి నూతన జవసత్వాలు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.298 కోట్లను కేటాయించారని తెలిపారు. ఈ రంగంలో అపారమైన అనుభవం ఉన్న వారు తీసుకొస్తున్న సహకార భూమి పత్రిక విజయవంతం కావాలని, ప్రభుత్వానికి, సహకార వ్యవస్థకు ఒక అస్త్రంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార భూమి పక్షపత్రికకు తాము అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ సహకార రంగంలో పత్రిక రావడం ముదావహమన్నారు. జిల్లాలో ఆదర్శవంతంగా నడుస్తున్న ఎలకుర్రు కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, స్వాతంత్య్ర సమరయోధుడు,, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు మనవడు కాశీనాథుని నాగేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. సహకార భూమి పత్రిక మార్గదర్శకులు డి కేశవులు, సంపాదకులు అక్బర్ పాషా, వ్యవస్థాపక సంపాదక మండల సభ్యులు హాజరయ్యారు.

ఒంగోలు డెయిరీ అభివృద్ధికి చర్యలు

- పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ అహ్మద్‌బాబు
- అంగన్‌వాడీలకు సరఫరా చేసే టెట్రా పాలు, బాలామృతం తయారీకి ప్రణాళిక



అమూల్ ఎండీతో మాట్లాడుతున్న పాడి పరిశ్రమ ఎండీ, కలెక్టర్, జేసీ

చీమకుర్తి: అమూల్ సంస్థ సహకారంతో ఒంగోలు-పేర్నమిట్టలోని విజయ డెయిరీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ అహ్మద్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఒంగోలు డెయిరీని సందర్శించారు. లోపల ఉన్న మిషనరీ, స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాస్, అమూల్ సంస్థ ఎండీ సుభాష్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు డెయిరీని అభివృద్ధి చేసి దానిలో యూహెచ్‌టీ ప్లాంట్ నిర్మించి దాని ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే టెట్రా పాలు తయారు చేస్తామన్నారు. అలాగే బాలామృతం కూడా ఇక్కడే తయారు చేసేందుకు అనువైన పరిస్థితులను గమనించామని చెప్పారు. పాడి రైతులకు విరివిగా రుణాలు, బీమాతో రూ.లక్ష వరకు ప్రయోజనం వంటివి కలిగించనున్నట్లు తెలిపారు. పాడి రైతులకు దాణా, పాలవెల్లువ ప్రారంభం కాని గ్రామాల్లో ప్రారంభించడం, మహిళా సంఘాల రైతులను ప్రమోటర్లుగా కొనసాగించటం, రైతులకు ఇవ్వాల్సిన లాభాలను వెంటనే చెల్లించటం వంటి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణను టీడీపీ నియమించింది. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల ప్రకారం కన్నాను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడెల శివప్రసాదరావు మృతి చెందిన నాటి నుంచి ఆ నియోజకవర్గం బాధ్యతలను చంద్రబాబు ఎవరికీ అప్పగించలేదు. కోడెల తనయుడు శివరాం ఆశలు పెట్టుకున్నా బాధ్యతలు ఇవ్వలేదు. మరో ఇద్దరు నేతలు కూడా ఆశించినప్పటికీ కన్నా వైపే మొగ్గ చూపారు.

బాబూ.. నీ మేనిఫెస్టోకు విశ్వసనీయత లేదు

- గతంలో మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి ఎందుకు తొలగించావు?
- జగన్ నాలుగేళ్ల పాలనలో నాలుగు తరాల సంక్షేమం
- సీఎం జగన్‌పై బురదజల్లాలని చూస్తే తాటతీస్తాం
- ఉద్యోగులంతా మా వైపే
- వ్యక్తి టార్గెట్‌గా సీబీఐ విచారణ అభ్యంతరకరం
- ఉప ముఖ్యమంత్రులు నారాయణస్వామి, రాజన్నదొర, మంత్రులు జోగి రమేష్, అమర్‌నాథ్, రోజా, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి, తిరుపతి/శ్రీరంగరాజపురం/తిరుమల/పులివెందుల: ప్రజల్ని మరోసారి మోసం చేయాలనే ఉద్దేశంతోనే ఆల్ ఫ్రీ చంద్రబాబు మేనిఫెస్టో విడుదల చేశారని ఉప ముఖ్యమంత్రి, మంత్రులు విమర్శించారు. ఆయన మేనిఫెస్టోకు విశ్వసనీయత లేదన్నారు. సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి రాష్ట్రం.. శ్రీలంక, వెనెజులాగా మారుతుందంటూ దుష్ప్రచారం చేసినవారు ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్‌ను మించి ఖర్చయ్యేలా మేనిఫెస్టోను ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో అధికారంలోకి వచ్చిన రెండో రోజే 600కు పైగా హామీలున్న మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించారని గుర్తుచేశారు. వాటిలో కనీసం ఆరు హామీలనైనా నెరవేర్చావా? అని నిలదీశారు. వారు బుధవారం ఆయా ప్రాంతాల్లో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో నాలుగు తరాల సంక్షేమం ఉందని, ఆయన పాలన సంక్షేమం, సుస్థిరత, సాధికారత, సమ్మిళిత అభివృద్ధి దిశగా సాగుతోందని పేర్కొన్నారు. అదిచూసి చంద్రబాబుకు నవనాడులు చిట్లిపోయి, నవరంధ్రాల్లో రక్తం కనిపించడంతో పిచ్చిపట్టినట్టుగా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ విడుదల చేసిన చార్జిషీట్ చంద్రబాబు పిట్టకథలకు, పచ్చ మీడియా పిచ్చి కథలకు పుట్టిన విషపుత్రిక అని చెప్పారు.

చంద్రబాబు మాటలు నమ్మితే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేదు



ప్రజలను మోసం చేయడానికి ఆల్ ఫ్రీ బాబు మేనిఫెస్టో విడుదల చేశారు. జగనన్న సంక్షేమ పథకాలను గతంలో 'పప్పులు బెల్లం' అన్న చంద్రబాబు నేడు ఆ పథకాలనే కాపీ కొట్టడం ఎంతవరకు సమంజసం. చంద్రబాబు మాటలు నమ్మితే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేదు. మరోసారి మోసానికి మాత్రం గ్యారెంటీ. మేనిఫెస్టో అంటే జగనన్న భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తున్నారు. అదే మేనిఫెస్టోను చంద్రబాబు ప్రజలను వంచించే, కామెడీ మేనిఫెస్టోగా భావిస్తారు. చంద్రబాబు మేనిఫెస్టోకు క్రెడిబిలిటీ లేదు. దొంగ వాగ్దానాలు చేసి 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఏంచేశావు? ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రెండోరోజే వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో తీసేయలేదా? బాబు వస్తే జాబు వస్తుందన్నావు.. ఎన్ని జాబులిచ్చావో చెప్పగలవా? నేడు ఇంటికి రెండు ఉద్యోగాలంటున్న నిన్ను ఎలా నమ్మాలి? నువ్వు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మరు. జనం అంతా జగనన్ననే ఆదరిస్తున్నారు.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

మళ్లీ దగా చేసేలా చంద్రబాబు మేనిఫెస్టో



అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య. మహిళలను, రైతులను దగా చేసేందుకే ఎన్నికల మేనిఫెస్టో అంటూ నాటకాలాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న అమ్మ ఒడి పథకాన్ని.. అమ్మకు ఒడి నాన్నకు బుడ్డి అంటూ చంద్రబాబు అక్కసు వెళ్లగక్కారు. ఇప్పుడు నాన్నకు బుడ్డి లేదా? ఈ విషయాన్ని ప్రజలు ఎప్పుడో గ్రహించారు. 2014 ఎన్నికల్లో అనేక ఆల్ ఫ్రీ పథకాలను ప్రకటించి గెలిచిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేశారు. రుణాలు మాఫీ చేస్తానని చెప్పి డ్వాక్రా మహిళల్ని, రైతుల్ని మోసగించారు. ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగభృతి అంటూ యువతను మళ్లీ దగాచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్థిక నిపుణులు చంద్రబాబు ఉచితాల దగా మేనిఫెస్టోపై చర్చించాలి. పార్టీ అధిష్టానం అనుమతిస్తే చంద్రబాబు మేనిఫెస్టోపై కోర్టుకెళ్లేందుకు సిద్ధం. విశ్వసనీయత, విలువల్లేని చంద్రబాబును నమ్మి మరోసారి ఓట్లేసి మునిగిపోవడానికి ప్రజలు సిద్ధంగాలేరు.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

దమ్ముంటే మేనిఫెస్టోపై చర్చకు రావాలి



టీడీపీ విడుదల చేసిన చార్జిషీట్‌లో ఉన్న నేరాలు, ఘోరాలు, దందాలు, దోపిడీలు, లూటీలు, విధ్వంసాలు, విద్వేషాలన్నీ చంద్రబాబు పాలనలో జరిగినవే. ఈ చార్జిషీట్‌పై బాబుగానీ, ఆయన పార్టీ నాయకులుగానీ చర్చించేందుకు సిద్ధమా? దమ్ముంటే టీడీపీ మేనిఫెస్టోను పట్టుకుని చర్చకు రావాలి. టీడీపీ నేత బొండా ఉమా విజయవాడలో ఒక తల్లి, కుమార్తెను ఆస్తికోసం వేధించడం తెలిసిందే. టీడీపీ అధికారంలో ఉండగానే ఆయన భార్య మీద సీఐడీ కేసు నమోదు చేసింది. ఇవి చూస్తే మోసగాళ్లెవరో అర్థమవుతోంది. వైఎస్ జగన్ పాదయాత్రతో ప్రజలకు నమ్మకాన్ని, భరోసాను కలిగించారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన 600కి పైగా హామీల్లో కనీసం ఆరు కూడా అమలు చేయలేదు. ఎంపీ వైఎస్ అవినాశ్‌ని రాజకీయంగా దెబ్బకొట్టేందుకు వ్యక్తి టార్గెట్‌గా విచారిస్తున్న సీబీఐ తీరును తెలంగాణ హైకోర్టు కూడా గుర్తించిందని భావిస్తున్నాం. పచ్చమంద అభిప్రాయాలకు అనుకూలంగా తీర్పురాలేదని హైకోర్టు జడ్జిపై అవినీతి ఆరోపణలు చేస్తూ ఏబీఎన్, మహాటీవీల్లో చర్చించిన వారిని తక్షణమే గుర్తించి హైకోర్టు సీజే చర్యలు చేపట్టాలి.

– ఆర్కే రోజా, మంత్రి

చంద్రబాబు మాటలు నీటిమీద రాతలు



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మాటలు నీటిమీద రాతలు. తెలుగుదేశం విడుదల చేసిన మేనిఫెస్టో హాస్యాస్పదం. 2014 ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోను తెలుగుదేశం అధికారంలోకి రాగానే వెబ్‌సైట్ నుంచి తొలగించారు. మా పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి చూపించారు. దేశంలో ఏ రాష్ట్రంలోను లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ప్రజలకు అందుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కరోనా, లోటు బడ్జెట్ వంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నా మాట తప్పలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపట్ల అన్ని వర్గాల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా గోబెల్స్ ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. వీటన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు.

– వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎంపీ

కాపులు మా ఆస్తి.. వారికి పెద్దపీట వేశాం



రాష్ట్రంలో కాపులంతా మా ఆస్తి. వారికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసింది. మద్యపాన నిషేధంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. సీపీఎస్ రద్దుపై అధ్యయనం జరుగుతోంది. ఉద్యోగులంతా మా పక్షానే ఉన్నారు. కొడాలి నాని వ్యాఖ్యలను టీడీపీ వాళ్లు తప్పుదారి పట్టించారు. చంద్రబాబు డర్టీ ఫెలో.. ఆ పార్టీ మేనిఫెస్టో టిష్యూ పేపర్‌తో సమానం. మేనిఫెస్టో అంటే చంద్రబాబుకే అర్థం తెలియదు. 2019లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయని వారు కూడా ఇప్పుడు ఓట్లు వేయబోతున్నారు. డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టు మొదటిదశ పనులు పూర్తవుతాయి. పొత్తులు లేకుండా పార్టీని నడపలేనని పవన్‌కళ్యాణ్ చెప్పారు. అదేమాట మేం ఫ్లెక్సీల్లో చెప్పడంతో జనసేన నాయకులు ఉలిక్కిపడుతున్నారు. మా హయాంలో రాష్ట్రానికి ఇన్ఫోసిస్ సంస్థ వచ్చింది. లోకేశ్ హయాంలో ఒక పెద్ద కంపెనీ అన్నా రాష్ట్రంలో అడుగు పెట్టిందా?

– జోగి రమేష్, గుడివాడ అమర్‌నాథ్

వచ్చే ఎన్నికల్లో ఘనవిజయం దిశగా వైఎస్సార్‌సీపీ పరుగులు

- సవాళ్లను అధిగమించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- వైఎస్సార్‌సీపీ నేత వి.విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రకృతి వైపరీత్యాలు, అవాంతరాలు, కష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారని, జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించడానికి వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతోందని ఆయన బుధవారం తాడేపల్లిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల్లో కేవలం పనితీరుతో ప్రజల మనసుల్ని గెల్చుకునే మొదటి రాజకీయపక్షంగా వైఎస్సార్‌సీపీ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతోందని తెలిపారు. ఆ ప్రకటనలో ఆయన ఏమన్నారంటే..

- సీఎం వైఎస్ జగన్ రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఎన్నో విధాలుగా ఆదుకుంటున్నారు. రాజ్యసభకు నలుగురు బీసీలను పంపించారు. ఇంకా 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎమ్మెల్సీ పదవులిచ్చారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆ పదవులు కూడా ఇచ్చారు. గతంలో పాలకులు పేదలను ఓటర్లుగానే చూశారు. అదే సీఎం జగన్ పాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు ఊళ్లోను, ఇళ్లవద్దే పథకాలు అందుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని ప్రజల్లో పూర్తి విశ్వాసం కలిగించిన నేత జగన్. తన పాలనతో అందరి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ నాలుగేళ్లలో డీబీటీ ద్వారా రూ.2.11 లక్షల కోట్లు.. పైసా లంచం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. 31 లక్షల ఇళ్లపట్టాలు ఇవ్వడంతో పాటు దాదాపు 22 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తున్నారు.



> చదవడం... మనకు తెలియని స్నేహితులను తెస్తుంది.
> – హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 1 జూన్ 2023

‘ప్రశాంత మణిపూర్’ ఎట్లా?

నెలరోజులుగా భగ్గున మండుతున్న మణిపూర్‌లో ప్రశాంతత నెలకొల్పేందుకు ఎట్టకేలకు ఒక రాజకీయ ప్రయత్నం మొదలైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆ రాష్ట్రంలో పర్యటించి పరస్పరం కలహిస్తున్న మెయితీ, కుకీ తెగల నాయకులతో, పౌర సమాజ కార్యకర్తలతో, రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశమయ్యారు. సమస్య ఉగ్రరూపం దాల్చినప్పుడు, జనం చావుబతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు పాలకులుగా ఉన్నవారు సంయమనంతో మెలగటం, సాధారణ స్థితి ఏర్పడేందుకు ప్రయత్నించటం అవసరం. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్‌కు ఈ ప్రాథమిక విషయాలు కూడా తెలిసినట్టు లేదు. ఇప్పటివరకూ జరిగిన ఘర్షణల్లో దాదాపు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. 40,000 మంది వరకూ కొంపా గోడూ వదిలి చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. ఊళ్లకు ఊళ్లే మంటల్లో మాడి మసయ్యాయి. పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తుపాకులు, మందుగుండు అపహరించిన ఉదంతాలు జరిగాయి. ఇలాంటి సమయంలో ‘ఇదంతా కుకీ ఉగ్రవాదులకూ, భద్రతా దళాలకూ సాగుతున్న ఘర్షణ తప్ప మరేంకాద’ని బీరేన్ సింగ్ ప్రకటించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. పరోక్షంగా కుకీలను మిలిటెంట్లుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించటమే ఆయన ప్రకటన వెనకున్న సారాంశమన్న విమర్శలు వెల్లువెత్తాయి. రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సీఎం ప్రకటనను తోసిపుచ్చారు. ఇది కేవలం రెండు తెగల మధ్య ఘర్షణేనని తేల్చి చెప్పారు. మెయితీ తెగకు చెందిన నేతగా బీరేన్ సింగ్‌కు వ్యక్తిగతంగా ఎలాంటి అభిప్రాయాలైనా ఉండొచ్చు. కానీ పాలకుడిగా స్పందించాల్సి వచ్చినప్పుడూ, రాష్ట్రం ఇంకా ఘర్షణలతో అట్టుడుకుతున్నప్పుడూ ఆచి తూచి మాట్లాడాలి. తమ తెగవారిపై జరుగుతున్న దాడుల మాటేమిటని కుకీ శాసనసభ్యులు నిలదీస్తే ఆయన నుంచి సమాధానం లేదు. ఇదొక్కటే కాదు... హింసను సాకుగా చూపి 25 మిలిటెంట్ సంస్థలతో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్టు బీరేన్ సింగ్ ఏకపక్షంగా ప్రకటించటం కూడా సమస్య తీవ్రతను పెంచింది. కుకీలతో అమిత్ షా నిర్వహించిన సమావేశానికి సీఎం రాలేని స్థితి ఏర్పడటం, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని వారు కోరటం రాష్ట్ర ప్రభుత్వంపై ఏర్పడిన అవిశ్వాసానికి అద్దం పడుతుంది.

మణిపూర్‌తో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఎంతో వైవిధ్యభరితమైనవి. అక్కడి నాలుగున్నర కోట్ల జనాభాలో 400కు పైగా తెగలున్నాయి. మాండలికాలు సైతం దాదాపు అంతే సంఖ్యలో ఉంటాయి. వీరంతా భిన్న సంస్కృతులు, విశ్వాసాలకు చెందినవారైనా... అప్పుడప్పుడు అపోహలు తలెత్తిన సందర్భాలున్నా మొత్తంమీద శతాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే ఇంచుమించు ఏభైయ్యేళ్లుగా ఇదంతా మారింది. తెగల పరిరక్షకులమంటూ సాయుధ బృందాలు తలెత్తటం మొదలైంది. ఉపాధి లేమివల్ల కావొచ్చు... జీవికకు ముప్పు కలుగుతుందన్న భయాందోళనల వల్ల కావొచ్చు చిన్న సమస్య రాజుకున్నా అది క్షణాల్లో కార్చిచ్చుగా మారి కల్లోలం రేపుతోంది. తమకు స్వయం పాలిత ప్రాంతాన్ని ఏర్పరచాలన్న డిమాండ్ బయల్దేరుతోంది. వివిధ రాష్ట్రాల్లో తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి ‘ప్రత్యేక నాగాలిమ్’ ఏర్పరచాలని నాగాలు పదేళ్ల క్రితం తీవ్ర ఆందోళనకు దిగారు. పరిమిత వనరులను పలువురితో పంచుకోవటం తప్పనిసరి కావటంతో అవతలివారు శత్రువులుగా కనిపిస్తున్నారు. మెయితీలను సైతం ఎస్టీలుగా పరిగణించాలన్న న్యాయస్థానం ఆదేశాలు ఈ కారణంతోనే ఆదివాసీలైన కుకీల్లో కల్లోలం సృష్టించాయి. ఇదే అదునుగా ఘర్షణలు తలెత్తాయి. పొరుగునున్న మయన్మార్ నుంచి వచ్చిపడుతున్న శరణార్థులను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మెయితీ నాయకులు చెప్పటం సమస్యను తగ్గించి చూపటమే అవుతుంది. అసలు కుకీలు స్థానికులు కాదనీ, వారు మయన్మార్ నుంచి వలస వచ్చినవారనీ చాన్నాళ్లనుంచి మెయితీలు వాదిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సీ) అమలు చేసి, పౌరసత్వాన్ని నిగ్గుతేల్చి స్థానికేతరులను పంపేయాలని వారు కోరుతున్నారు. 53 శాతంగా ఉన్న మెజారిటీ తెగ నుంచి ఇలాంటి డిమాండ్ రావటం కొండప్రాంతాల్లో ఉంటున్న కుకీల్లో సహజంగానే గుబులు రేపుతోంది. 1901 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో కుకీలు 14.5 శాతం. 110 ఏళ్ల తర్వాత 2011 నాటికి వారి జనాభా పెరుగుదల రెండు శాతం మాత్రమే. అలాంటపుడు కుకీలపై స్థానికేతరుల ముద్రేయటం అసంబద్ధం కాదా?

ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రకటనలనూ, తెగల మధ్య అపోహలు పెంచే వదంతులనూ నివారించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దాని పర్యవసానంగానే ఇంత హింస చోటుచేసుకుంది. నిరుడు యూపీలోని మధురలో కన్నవారి కర్కశత్వానికి బలైపోయిన 21 ఏళ్ల యువతిని మెయితీ తెగ మహిళగా చిత్రించి, ఆమెపై కుకీలు అత్యాచారానికి పాల్పడి హతమార్చారని తప్పుడు ప్రచారం జరపడంతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కుకీ తెగ మహిళలపై దాడులు జరిగాయి. అత్యాచార ఉదంతాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఇక చురాచాంద్‌పూర్‌లో హిందూ దేవాలయాలపై దాడులు సాగించారన్న వదంతులు లేవదీశారు. ఇదంతా అబద్ధమని వెంటనే ఆ ప్రాంత మార్వాడీ, పంజాబీ సొసైటీలు, బెంగాలీ సొసైటీ, బిహారీ సొసైటీ సంయుక్తంగా ప్రకటించాయి. తెగల పేరుతో, మతం పేరుతో ప్రజల్లో చీలికలు తెచ్చే యత్నాలను మణిపూర్ పౌర సమాజం ఐక్యతతో తిప్పికొట్టాలి. పాలకులు, రాజకీయ పార్టీల నేతలు జవాబుదారీతనంతో మెలగాలి. అప్పుడే ప్రశాంత మణిపూర్ సాధ్యమవుతుంది.

ఓఎన్‌డీసీతో ఈ-కామర్స్ విప్లవం?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

ఈ-కామర్స్ రంగంలో ఈ మధ్యకాలంలో ఓ విషయం హల్‌చల్ చేస్తోంది. భారత రిటైల్ రంగాన్ని సమూలంగా మార్చేయగల సత్తా ఉందని చెప్పుకుంటున్న దాని పేరు... ‘ఓఎన్‌డీసీ’. వస్తువులు అమ్ముకునే వారికీ, కొనేవారికీ వేదికగా నిలవగల, అందరికీ అందుబాటులో ఉండే నెట్‌వర్క్ ఇది. స్థూలంగా చెప్పాలంటే దేశంలోని లక్షలాది చిన్న కంపెనీలు అతితక్కువ ఖర్చుతో ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌పై తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఈ ప్లాట్‌ఫార్మ్‌కు కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తోంది. అలాగని ఇది ప్రభుత్వ రంగ సంస్థ కాదు. ప్రైవేట్ రంగంలోనే లాభాపేక్ష లేని సంస్థగా కొనసాగనుంది. ఈ-రిటైలింగ్ దేశం నలుమూలలకూ విస్తరించేందుకు ఇదో గొప్ప సాధనమవుతుందని అంచనా!

‘ఓఎన్ డీసీ’ అంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్. వ్యాపారులు, వినియోగదారులిద్దరికీ చాలా అనుకూలంగా ఉండే ఈ ప్లాట్‌ఫార్మ్‌కు కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తోంది. అలాగని ఇది ప్రభుత్వ రంగ సంస్థ కాదు. ప్రైవేట్ రంగంలోనే లాభాపేక్ష లేని సంస్థగా కొనసాగనుంది.

బ్యాంకుల్లాంటి ఆర్థిక సంస్థలు, ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకని వంటివారు ఈ ఓఎన్‌డీసీకి దన్నుగా నిలిచారు. నందన్ నీలేకని ఈ మొత్తం ప్రయత్నానికి సూత్రధారి అని కూడా చెబుతున్నారు. ఈ-కామర్స్ రంగాన్ని ప్రజాస్వామ్య పథం పట్టించే సామర్థ్యమున్న అతి పెద్ద ఆవిష్కరణ ఇదని నందన్ చెబుతున్నారు. ఓఎన్‌డీసీకి ఇచ్చిన నిర్వచనాన్ని పరిశీలించినా ఈ విషయం అర్థమవుతుంది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా వంటి ప్లాట్‌ఫార్మ్‌లపై ఏ సంస్థ అయినా తమ ఉత్పత్తులను అమ్ముకోవాలంటే వాటిల్లో ప్రత్యేకంగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అమ్మకాల్లో గరిష్ఠంగా 35 శాతం కమిషన్‌ను ఈ ప్లాట్‌ఫార్మ్‌లు పొందుతూంటాయి. ఓఎన్‌డీసీలో ఈ అవసరం ఉండదు. వినియోగదారులకూ ఇది వర్తిస్తుంది. చిన్న చిన్న కంపెనీలు నేరుగా ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫార్మ్‌పై తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు వీలేర్పడుతోంది. ఈ ఉత్పత్తులను వినియోగదారులు మాత్రమే కాకుండా... అమెజాన్ వంటి పెద్ద రిటైయిలర్లూ కొనుగోలు చేయవచ్చు. ఓఎన్‌డీసీలో కమిషన్ కేవలం రెండు నుంచి ఐదు శాతం మాత్రమే ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే దేశంలోని లక్షలాది చిన్న కంపెనీలు అతితక్కువ ఖర్చుతో ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌లపై తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఓఎన్‌డీసీని అప్పుడే యూపీఐతో పోలుస్తున్నారు. దేశంలో ఇప్పటికే భారీ విజయం సాధించిన ఈ చెల్లింపుల విధానాన్ని అమలు చేసేందుకు, లేదా యూపీఐలోనే భాగంగా మారేందుకు పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. యూపీఐ సాయంతో గూగుల్ పే, ఫోన్ పే, జియో, అమెజాన్ వంటి అనేక పేమెంట్ పోర్టళ్ల నుంచి చెల్లింపులు చేయవచ్చునన్నది మనకు తెలిసిన విషయమే.

ఓఎన్ డీసీ ఆలోచన చాలా బాగున్నప్పటికీ ప్రస్తుతానికి అది బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. మైక్రోసాఫ్ట్, పేటీఎం, ఫోన్ పే వంటి దిగ్గజ కంపెనీలూ దీంట్లో భాగస్వాములయ్యాయి. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌ను వినియోగదారులు భిన్నరీతుల్లో ఉపయోగిస్తున్నారు. దీనివల్ల కొన్ని వివాదాలూ వస్తున్నాయి. ఉదాహరణకు... కొంత మంది ఓఎన్ డీసీ నెట్‌వర్క్‌పై ఆహారాన్ని ఆర్డర్ చేస్తూండటం. జొమాటో, స్విగ్గీ వంటి అప్లికేషన్ల జోలికి పోకుండా వినియోగదారులు నేరుగా ఓఎన్ డీసీ ప్లాట్‌ఫార్మ్ పైనే ఫుడ్ ఆర్డర్లు పెడుతూండటం... కమిషన్లు తక్కువగా ఉన్న కారణంగా ధరలు తక్కువగా ఉండటం రెస్టారెంట్లను ఆకర్షిస్తోంది. స్విగ్గీ, జొమాటో లాంటి పెద్ద కంపెనీలు



తమను నియంత్రిస్తున్నాయన్న భావనలో ఉన్న రెస్టారెంట్లు ఇప్పుడు ఓఎన్‌డీసీ వైపు మళ్లేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి. సమస్యల్లా ఒక్కటే. సరకుల రవాణా బాధ్యత ఏ కంపెనీ తీసుకోవాలి? ఈ నైపుణ్యం డెలివరీ అప్లికేషన్లది! ఒకవేళ ఆర్డర్లు సరైన సమయానికి వినియోగదారులకు చేరకపోతే, అందిన సరుకులు సక్రమంగా లేకపోతే బాధ్యత ఎవరిది? ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఫుడ్ డెలివరీకి మాత్రమే కాదు, ఇతర విక్రయాలకూ ఈ సమస్యల పరిష్కారం అత్యవసరం.

రవాణా సమస్యల పరిష్కారానికి ‘లాజిస్టిక్స్’ రంగంలోని స్టార్టప్‌లతో ప్రయత్నాలు మొదలయ్యాయని ఓఎన్‌డీసీ చెబుతోంది. డెలివరీ సమస్యలను ఇవి చూసుకుంటాయని అంటోంది. అయితే కొన్ని అంశాలను ఇంకా సరిచేయాల్సిన అవసరముంది. డిస్కౌంట్లు, తక్కువ కమిషన్ వంటివి ఇలాగే ఎక్కువ కాలంపాటు కొనసాగే అవకాశాలు తక్కువ. ఓఎన్ డీసీ నిర్వాహకులు కూడా పలు సందర్భాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆరంభానికీ, ప్రాచుర్యానికీ ఈ డిస్కౌంట్లు ఉపయోగపడతాయి కానీ... దీర్ఘకాలంలో వీటి రూపురేఖలు మార్కెట్ శక్తులపై ఆధారపడి ఉంటాయని వారు చెబుతున్నారు.

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం ఓఎన్ డీసీలో 36,000 మంది విక్రయదారులున్నారు. గత ఏడాది సెప్టెంబరులో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ సాధించిన పురోగతి ఇది. అలాగే నెట్‌వర్క్ భాగస్వాముల సంఖ్య 45గా ఉంది. సగటున వారానికి 13 వేల రిటైల్ ఆర్డర్లు వస్తుండగా... గరిష్ఠంగా ఒక్క రోజులో 25 వేల వ్యవహారాలు నడిచాయి. ఈ-రిటైల్ రంగం సామర్థ్యం భారీ ఎత్తున పెరగనుందని కూడా ఓఎన్ డీసీ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. సుమారు 14 కోట్ల మంది ఆన్‌లైన్ వినియోగదారులతో చైనా, అమెరికా తరువాత భారత్ మూడో స్థానంలో ఉందని లెక్క. అయితే దేశంలో ఈ-రిటైల్ చొచ్చుకుపోయింది చాలా తక్కువ. చైనాలో 25 శాతం ప్రాంతాలకు విస్తరించగా, కొరియాలో ఇది 26 శాతంగా ఉంది. అలాగే యూకేలో ఈ-రిటైల్ విస్తరణ 23 శాతముంటే, భారత్‌లో కేవలం 4.3 మాత్రమే. దేశంలో ఉండే 75 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులను పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా తక్కువ. బెయిన్ అండ్ ఆక్సెల్ సంస్థ లెక్కల ప్రకారం 2027 నాటికి దాదాపు కోటీ యాభై లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఆన్‌లైన్ క్రయ విక్రయాలకు దిగనున్నాయి. ప్రస్తుతం ఈ సంఖ్య 60 లక్షలు మాత్రమే. ఈ నేపథ్యంలోనే ఓఎన్‌డీసీకి ప్రాధాన్యతమేర్పడుతోంది. ఈ-రీటెయిలింగ్ దేశం నలుమూలలకూ విస్తరించేందుకు ఇదో గొప్ప సాధనమవుతుందని అంచనా.

ఓఎన్‌డీసీ పుట్టి నెలలు కూడా గడవకముందే దీనిపై కొందరు ఇది పనిచేయదని పెదవి విరిచేస్తున్నారు. పనిభారం ఎక్కువవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంటర్నెట్ దిగ్గజ కంపెనీలు ఓఎన్ డీసీలో భాగం కాకపోతే విజయవంతమయ్యే అవకాశాలు తక్కువన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. గూగుల్ ఈ నెట్‌వర్క్‌లో భాగస్వామి అవుతుందని గత ఏడాది మధ్యలో కొన్ని వదంతులైతే వచ్చాయి. కానీ ఆ తరువాత ఎలాంటి సద్దు లేదు. ఈ-కామర్స్ సంస్థలు అమెజాన్, వాల్‌మార్ట్ ఆధ్వర్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఇంకా ఓఎన్ డీసీలో చేరలేదు. అయితే వాల్‌మార్ట్‌కే చెందిన ఫోన్ పే ఇప్పటికే ఇందులో భాగస్వామి కావడం గమనార్హం. ఫోన్ పే... ‘పిన్‌కోడ్’ అనే ప్రత్యేకమైన అప్లికేషన్‌తో ఓఎన్‌డీసీలో చేరింది. ఓలా, ఊబర్‌లను కూడా చేర్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే ఈ రంగంలో ఇప్పటివరకూ బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ‘నమ్మ యాత్రి’ అన్న రైడ్ హెయిలింగ్ సంస్థ మాత్రమే ఓఎన్‌డీసీలో భాగంగా ఉంది.

ఓఎన్‌డీసీ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నెట్‌వర్క్. పూర్తి సామర్థ్యాన్ని అందుకునేందుకు కొంత సమయం పడుతుంది. ఈ నెట్‌వర్క్‌లో ఇప్పుడే భాగస్వాములుగా చేరాలనీ, భవిష్యత్తులో చేర్చు కోమనీ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వ్యాఖ్యానించడం దీని అభివృద్ధికి అంతగా సహకరించేది కాదు. ఓఎన్ డీసీ జయాపజయాలు ఆర్థికంగా ఎంతమేరకు అనుకూలం అన్నది భాగస్వాముల చేరిక, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై ఆధారపడి ఉంది. యూపీఐ, ఆధార్‌ల మాదిరిగా ఓఎన్ డీసీ కూడా విప్లవాత్మకమైన ఆలోచనైతే అది దాని సృజనాత్మక డిజైన్ కారణంగానే అవుతుంది కానీ ప్రభుత్వ మార్గదర్శకత్వాల కారణంగా కాదు. ఈ కొత్త ఈ-కామర్స్ ప్రపంచం ఎలా పరిణమించనుందో తెలుసుకోవాలంటే వేచి చూడటం కంటే వేరు మార్గం లేదు.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక వ్యవహారాల జర్నలిస్ట్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదా పనితీరు?



నా భార్యకు రెండేళ్లుగా చంకలో గడ్డ ఉంది. తన రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు అది ప్రతిస్పందన అన్నారు. బయాప్సీ చేయడానికి నిరాకరించారు. 2022 డిసెంబరులో 4వ స్టేజీ బ్రెస్ట్ క్యాన్సర్ ఉందని తేలింది. అది వెన్నెముకకూ, కాలేయానికీ వ్యాపించింది. ‘నేషనల్ హెల్త్ సర్వీస్’ (ఇంగ్లండ్)పై ఆమె విశ్వాసాన్ని కోల్పోయింది.

– పాల్ నికోల్స్, ఇంజినీర్

ఇప్పటి శాంతి ముఖ్యం



మన లక్ష్యం సంతోషంగా ఉండటం – మనశ్శాంతిని పొందడం. నేను తర్వాతి జీవితం గురించో, దేవుడికి సంబంధించో మాట్లాడటం లేదు; ఇప్పుడు ఇక్కడ శాంతితో, సంతోషంగా ఉండటం గురించి చెబుతున్నాను.

– దలై లామా, బౌద్ధ గురువు

ఇంకానా?



తొమ్మిదేళ్ల తర్వాత – అంటే దాదాపు దశాబ్దం – కూడా ఇంకా మనం నిజంగా కాంగ్రెస్ తప్పు చేసింది, లేదా నెహ్రూ తప్పు చేశారు అని వినాలా?

– సుచేతా దలాల్, జర్నలిస్ట్

మహాదక్షిణం



రాజకీయంగా మహారాష్ట్ర లేకుండా దక్షిణాది అనేది సంపూర్ణం కాదు. అంతిమంగా మహారాష్ట్ర అనేది దెక్కన్‌లో భాగం.

– రాజు పారులేకర్, రచయిత

ఇదీ చేదే!



చైనా యువత అత్యధిక స్థాయి నిరుద్యోగితను చవిచూస్తోంది. కమ్యూనిస్టు పార్టీ సహా షీ జిన్‌పింగ్ వాళ్లను మానవ శ్రమకూ, గ్రామాలకు తరలివెళ్లడానికీ అతీతులుగా భావించుకోవడం మానుకోవాలని చెబుతున్నారు. వాళ్లు ‘చేదు మింగడాన్ని’ నేర్చుకోవాలని సూచిస్తున్నారు.

– లీ యువాన్, కాలమిస్ట్

ఒకటే లక్ష్యం



ఖాలిస్తానీ ట్రోల్స్ అందరి ప్రొఫైల్స్‌ను బాగా చూశాక, నేను గమనించిన అంశాలు: అందరూ ఎన్ఆర్ఐలు. వాళ్లకు సిక్కుల గురించిన పట్టింపు లేదు. వాళ్లు పంజాబ్‌లోని మాదక ద్రవ్యాలు, గ్యాంగ్‌స్టర్ల సమస్యల గురించి ఎప్పుడూ మాట్లాడరు. వాళ్లు చేసేదల్లా హిందువులను ట్రోల్ చేయడం.

– తరణ్‌జీత్ సింగ్, వ్యాఖ్యాత

వాళ్లేరి మరి?



విమానయాన పరిశ్రమ ఎలా పనిచేస్తున్నదో నేను అర్థం చేసుకోవడం మానేశాను. నాలుగు సీట్లు, వీలైతే వరుసగా, ప్రత్యేకించి విండో, ఐల్ ఉండేట్టుగా ఇమ్మని కోచిలో (కేరళ) అభ్యర్థించాను. సారీ, అన్నీ బుక్కయ్యాయి, అందుబాటులో లేవు అన్నాడు. సరే, ఫర్లేదని చెప్పాను. తీరా బోర్డింగ్ అయ్యాక చూస్తే విమానం దాదాపుగా ఖాళీగా ఉంది.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.11.10 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** స్వాతి తె.5.21 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి విశాఖ, ఉ.10.25 నుండి 12.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.46 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.8.17 నుండి 9.55 వరకు.

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.26
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

ఇన్‌బాక్స్

మన మూలాలపై నీలినీడలు

ఆధునిక మానవుడు ఒకే ఒక మూలం నుండి రాలేదని చెప్పే నూతన పరిశోధన ఫలితాలు ఇటీవల ‘నేచర్’ జర్నల్‌లో ప్రచురితం కావడంతో పరిణామ వాదులు ఈ ఫలితాల మీద ఉత్సుకతను చూపుతున్నారు. ఆధునిక మానవుడు పాలు ఇచ్చి పిల్లలను పెంచే జీవుల (ప్రైమేట్స్) నుండి వచ్చి ఉంటాడు అని డార్విన్ తన ‘జాతుల పుట్టుక’(జెనిసిస్ ఆఫ్ స్పీసీస్) గ్రంథంలో పేర్కొన్నారు. అంటే కోతులు, చింపాంజీలు వంటి జీవులన్నిటి ఉమ్మడి పూర్వీకుడి నుండి నేటి మానవుడు పరిణామం చెందాడనేది డార్విన్ ఉద్దేశం. కానీ ఇటీవల అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా అంత్రపాలజీ విభాగానికి చెందిన బ్రేన్నా ఎం. హేన్ పరిశోధన పరిణామ మూలాలను మార్చే దిశగా ఉన్నట్లు కనబడుతోంది. ఈ పరిశోధన ఫలితాలు ఇటీవల (మే 17) ‘నేచర్’ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఇప్పటి వరకు ఆఫ్రికా నుండి వచ్చిన ఒకే పూర్వీకుల సమూహం నుండి ఆధునిక మానవుడు వచ్చాడన్న విషయాన్ని అందరూ నమ్ముతున్నారు. ఆధునిక మానవులు భూమి అంతటా వ్యాపించడానికి ముందు ఆఫ్రికాలో ఒక మిలియన్ సంవత్సరాలు నివసించిన రెండు సమూహాల నుండి ఉద్భవించినట్లు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. అంటే ఈ పరిశోధన మానవాళికి ఒక్క మూలం లేదని తేల్చి చెప్పిందన్నమాట.

దక్షిణాఫ్రికాలోని నామా సమూహం నుండి తీసుకొన్న జనాభా జన్యు డాటాను, అక్కడి ప్రాచీన మానవుల శిలాజ సాక్ష్యాధారాలతో పోల్చడం ద్వారా పరిశోధకులు మానవ పరిణామ కొత్త నమూనాను కనుగొన్నారు. దీనితో ఒకే ఆఫ్రికన్ జనాభా నుండి మానవులందరూ ఆవిర్భవించారని చెప్పే మాట సరికాదని తేలింది. ప్రస్తుత శాస్త్రీయ పరిశోధనలు దీర్ఘకాల పరికల్పనకు అంటే కొన్ని ఏళ్లకు పూర్వం ఇలా జరిగి ఉండవచ్చని చెప్పే విషయాలకు మద్దతు ఇవ్వలేదు అని తేల్చారు. దీంతో మానవుని మూల జీవి ఎవరు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

– డా॥ మామిడాల ఇస్తారి
అసోసియేట్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ

విద్యా వ్యవస్థకు స్వర్ణయుగం

అభిప్రాయం



మంచికంటి

ఐదు దశాబ్దాల పాటు పాఠశాల విద్యావ్యవస్థతోపాటు సాగిన ప్రయాణం నాది. నేను చదువుకున్నప్పటి నుండి ఇప్పటి వరకు విద్యా వ్యవస్థ రూపురేఖలను పరిశీలిస్తున్నాను. పిల్లల చదువుల పట్ల ప్రభుత్వాల తీరు తెన్నులను గమనిస్తున్నాను. పాఠశాలలో ఖర్చు చేయడానికి పట్టుమని పదివేల రూపాయలు ఇవ్వని రోజులు ఎన్నో చూశాను. టీచర్ల సొంత డబ్బులతోనే చాక్ పీసులు కొనుక్కున్న అనుభవాలు ఉన్నాయి. బడిలో చేరినప్పుడు కుర్చీలు లేక కిటికీలో కూర్చోవలసి వచ్చిన సందర్భం ఎప్పటికీ మర్చిపోలేను.

నాడు బడి బందెలదొడ్డిలా ఉండేది. పందులు తిరుగుతూ ఉండేవి. చిల్లచెట్ల మయమై ఉండేవి. పగిలిపోయిన గోడలు... పెచ్చులూడిపోయిన పైకప్పులు, తలుపులు లేని టాయిలెట్లు, పగిలిపోయిన నాపరాళ్ళు, పందికొక్కులు తోడేసిన గోతులతో ప్రహరీ గోడలు, గేట్లు లేని అనాథలు అప్పటి పాఠశాలలు! పిల్లలు మాత్రం చదువుకొని చదువుకొని చివరికి చదువుకోలేక, చదువు రాక ఏదో ఒక పనిలోకి చేరిపోవడం ఆనాటి బడులు సాధించిన గొప్ప ఫలితాలు.

అప్పుడూ పిల్లలు యూనిఫామ్ వేసుకుని స్కూల్‌కి వచ్చేవాళ్ళు. కానీ అట్టలు కట్టిన చొక్కాలు. చాలీచాలని నిక్కర్లు. ఇప్పుడు గవర్నమెంట్ స్కూల్ పిల్లల యూనిఫాం ఒక మోడల్. ప్రైవేట్ స్కూల్ పిల్లల యూనిఫామ్ లకు పోటీగా ఉంది. స్కూల్ బ్యాగ్, బెల్ట్, షూస్... తల్లిదండ్రులు ఇవ్వలేనివన్నీ ఎవరూ అడక్కుండానే వాళ్ళ దరి చేరుతున్నాయి.

నేను బడిలో చదువుకున్నప్పటి నుండి ఇప్పటి వరకు ఐదు దశాబ్దాలుగా చూడని మార్పు. ఎవరూ ఊహించని మార్పు. ఎవరూ ఆశించ సాహసించని మార్పు. విద్యావ్యవస్థను లక్ష్యంగా చేసుకున్న అద్భుతం! అప్పుడు బడికి పోవాలంటే ప్రాణం పోయేది. పొరపాటున ఆరోగ్యం బాగా లేకుంటే టాయిలెట్ అవసరాల కోసం టీచర్లే చెట్ల వెంబడి పుట్ల వెంబడి పడి పరుగులు తీయాల్సి వచ్చేది.



ఇవాళ డీలక్స్ క్లాస్ టాయిలెట్లను ఆనందంగా పిల్లలు ఉపయోగించుకుంటున్నారు. నాడు ఎండాకాలం వస్తే తరగతి గదిలో ఉక్క పోతకు పిల్లలు అల్లాడిపోయేవాళ్ళు. ఇవాళ తరగతికి నాలుగు ఫ్యాన్లు, నాలుగు లైట్లు చలికాలంలో కూడా పిల్లలు ట్యూబులైట్ల కాంతిలో ఫ్యాన్ల గాలిలో తేలిపోతూ ఉన్నారు. పాఠశాలలోనే వాటర్ ప్లాంట్. మీట నొక్కితే తియతీయని మంచినీళ్ళు. అప్పుడు మధ్యాహ్నం భోజనం ముక్క వాసన వస్తూ ఉండేది. పిల్లలు తినే దానికంటే పడేసేదే ఎక్కువగా ఉండేది. ఇప్పుడు రోజుకు ఒక రకం భోజనం తయారు చేయడం, అది బాగుందో లేదో చేసే వాళ్ల మీద నమ్మకం కలగడానికి ప్రతి రోజు ఫోటో తీసి పంపడం. అదొక నిజ నిర్ధారణ. మెనూ సరిగా లేదంటే మధ్యలో ఎన్ని మార్పులు చేస్తున్నారో.

పిల్లల పిల్లల ఆహారం, వైద్యం గురించి ఇంతకు ముందెన్నడూ ఎవరూ ఎప్పుడూ ఆలోచించలేదు. ఎవరూ ఈ బడుల గురించి శ్రద్ధ పెట్టలేదు. ఒకరోజు మాత్రలు మింగని పిల్లలకి మళ్ళీ రెండో రోజు వచ్చి మాత్రలు మింగిస్తున్న సందర్భాలు. ఆడపిల్లలకు రుతుస్రావ ప్యాడ్లు. మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన బ్రష్‌లు, ద్రావకాలు క్రమం తప్పకుండా పాఠశాలలకు చేరుతున్నాయి.

ఒకప్పుడు ఐదో క్లాసుకు వచ్చేదాకా ఇంగ్లీషులో ఏబీసీడీలు నేర్చుకోవడంలోనే ఉండేవాళ్ళు. ఇవాళ ఒకటి, రెండవ తరగతిలోనే ఇంగ్లీషు పదాలు వాక్యాలుగా చదువుకుంటూ పోతున్నారు.

పాఠ్యపుస్తకాలు ఇంగ్లీష్ ఒక వైపు, తెలుగు ఒక వైపు. నిజంగా ఇంగ్లీష్ నేర్చుకునే టీచర్లకు ఇంత కంటే మంచి అవకాశం ఉండదు. పిల్లలకు కూడా ఇంగ్లీష్ నేర్పించడం చాలా సులభం.

రంగం సిద్ధం అయింది. రంగస్థలం మొదలు కావాల్సి ఉంది. అసలు నాటకం మొదలే కావాల్సి ఉంది. మెరుగైన విద్యను అందించే అవకాశం ఉపాధ్యాయుల చేతుల్లోనే వుంది.

వ్యాసకర్త కథా రచయిత, ఒంగోలు
మొబైల్: 99495 35695

పరీక్షగా చూసేవాడు

మహాభారత సంగ్రామంలో జరిగిన వినాశనం తరవాత పరీక్షిత్తు ఒక్కడే పాండు వంశానికి ఏకైక వారసుడుగా మిగిలాడు.

యుద్ధం తరవాత జగత్తంతా ‘అపాండవం’ కావాలని ఉద్దేశించి అశ్వత్థామ బ్రహ్మాస్త్రం సంధించాడు. శ్రీకృష్ణుడు సుదర్శన చక్ర ప్రయోగం ద్వారా, పాండవులను దాని నుంచి కాపాడాడు. కానీ, ఆ బ్రహ్మాస్త్రం పాండువంశానికి వారసుడుగా, అభిమన్యుడి సంతానంగా, ఉత్తర గర్భంలో పెరుగుతున్న పిండాన్ని కూడా నాశనం చేయటానికి వెళ్లింది. తన మీదికి వస్తున్న ఆ అస్త్రాన్ని చూసి, ఆ బేల ఎంత భయపడిపోయిందో, పరుగెత్తి వెళ్ళి, శ్రీకృష్ణుడిని ప్రార్థించింది. ‘కాలిన ఇనప ములుకుతో నా మీదికి వస్తున్న ఈ అస్త్రం నన్ను చంపితే చంపనియ్యి, ఫరవాలేదు. కానీ నా గర్భస్థ శిశువుకు ఎలాంటి హానీ కలగకుండా చూడు, ప్రభూ!

అక్కడ సుదర్శన చక్రం పనిచేయదు కనక, తన వైష్ణవ తేజంతో ఉత్తర గర్భాన్ని ఆవరించి, కాపాడాడు కృష్ణుడు. వైష్ణవ తేజాన్ని బ్రహ్మ అస్త్రం గౌరవించి, శమించింది.

పది నెలలు నిండి శిశువు బయటికి వచ్చేటప్పుడు, బ్రహ్మాస్త్ర ప్రభావం ఆ పసిగుడ్డును దహించి వేయబోయింది. అప్పుడు మళ్ళీ భక్త పరాధీనుడైన వాసుదేవుడు అంగుష్ఠమాత్రమయిన ఆకారంతో వచ్చి, తన గదను చిరచిర తిప్పి, బ్రహ్మాస్త్రం వేడిమిని చల్లబరచి, శిశువును రక్షించాడు. ‘నన్ను కాపాడుతున్న ఈ మహానుభావుడెవరో!’ అని ఆ అమాయక శిశువు చూస్తుండగానే, అంతర్ధానమైపోయాడు. విష్ణువు చేత రక్షించబడ్డాడు కాబట్టి ఆ శిశువుకు ‘విష్ణు రాతుడు’ అని పేరు వచ్చింది. కాల క్రమంలో విష్ణురాతుడికి లోకంలో ఎవరిని చూసినా, వాళ్ళలో, తన తల్లి కడుపులో ఉన్నప్పుడు తనను రక్షించిన మహాపురుషుడి ఛాయ కనిపించేది. ఆ మహాపురుషుడు అందరిలో ఉండే సర్వాంతర్యామి కదా! అందుకే విష్ణురాతుడు అందరినీ పరకాయించి, పరీక్షగా చూసేవాడు కనక ఆయనకు ‘పరీక్షిత్తు’ అని పేరు వచ్చింది. తన తల్లి కడుపు లోపల, / మును చూచిన విభుడు విశ్వమున నెల్ల కలం/డనుచు పరీక్షింపగ జను/ లనఘ! ‘పరీక్షిన్న రేంద్రు’డండ్రు మునీంద్రా! (పోతన భాగ 1-296).

– ఎం. మారుతి శాస్త్రి

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

- రాష్ట్రంలో తొలి విగ్రహం
- ఆవిష్కరించిన ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివంగత సూపర్‌స్టార్ కృష్ణ అనుసరించిన క్రమశిక్షణను నేటి హీరోలు నేర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఏలూరు నగరంలో రాష్ట్రంలోనే సూపర్ స్టార్ కృష్ణ తొలి విగ్రహాన్ని బుధవారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పలువురు సినీ రంగ ప్రముఖులు పాల్గొని మాట్లాడుతూ కృష్ణ తెలుగు సినీ పరిశ్రమలో సంచలనాలకు మారుపేరుగా నిలిచినట్టు తెలిపారు. ఆయన ప్రయాణమంతా ప్రయోగాలతోనే సాగిందన్నారు. తొలి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎం, తొలి డీటీఎస్ సౌండ్ సిస్టమ్ వంటి సాంకేతికతను తెలుగు తెరకు పరిచయం చేశారని కొనియాడారు. కృష్ణ విగ్రహాన్ని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, సినీ నిర్మాతలు ఉప్పలపాటి సూర్యనారాయణబాబు, అంబికాకృష్ణ, ఉషా పిక్చర్స్ అధినేత వీవీ బాలకృష్ణారావు, తపన ఫౌండేషన్ ప్రతినిధి గారపాటి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్నాం

సైన్స్, ఇంజినీరింగ్‌లో ప్రపంచంలో మన దేశానిది మూడో ర్యాంక్

స్టార్టప్‌ల పరంగానూ మూడో స్థానం

జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో పారిశ్రామికవేత్త, గ్రీన్‌కో సీఎండీ చలమలశెట్టి అనిల్‌కు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో వీసీ ప్రసాదరాజు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం దూసుకుపోతోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. సైన్స్, ఇంజినీరింగ్ రంగాల్లో 25 వేల మంది పీహెచ్‌డీలతో భారత్ ప్రపంచంలోనే 3వ ర్యాంక్‌లో నిలిచిందన్నారు. స్టార్టప్‌ల సంఖ్య పరంగా కూడా మన దేశం మూడో స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ 9వ స్నాతకోత్సవం వైస్ చాన్సలర్ ప్రసాదరాజు అధ్యక్షతన బుధవారం జరిగింది. చాన్సలర్ హోదాలో ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ నజీర్ మాట్లాడుతూ.. ఆకర్షణీయమైన పెట్టుబడులతో గమ్యస్థానాన్ని చేరుకోవడంలో మనం మూడో స్థానంలో ఉన్నామన్నారు. డిగ్రీలు అందుకున్న తర్వాత యూనివర్సిటీతో విద్యార్థులు సంబంధాన్ని ముగించడం సరికాదన్నారు. బయటకెళ్లిన తరువాత శాశ్వత విద్యార్థిగా విశ్వవిద్యాలయంలో అత్యంత ముఖ్యమైన వాటాదారుగా ఉండబోతున్నారనే విషయాన్ని మరిచిపోకూడదన్నారు. 'శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని అధ్యయనం చేస్తారు. ఇంజినీర్లు ఎన్నడూ లేని ప్రపంచాన్ని సృష్టిస్తారు' అన్న సుప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త, ఏరో స్పేస్ ఇంజినీర్ థియోడర్ వాన్ కర్మన్ చెప్పిన విషయాలను మననం చేసుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు ప్రతి సమస్యను సవాల్‌గా తీసుకుని జీవితాన్ని నేర్చుకోవడానికి, ఎదుగుదలకు అవకాశంగా మలచుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కెరీర్‌లో కొంత ఓపిక, స్థిరమైన ప్రయత్నాలతో పనిచేసిన నాడు ఏదో ఒకరోజు కచ్చితంగా గొప్ప విజయాన్ని సాధిస్తారన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా ఏపీ

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రపంచానికి భారత్ నాలెడ్జ్ హబ్ అయితే.. దేశానికి ఏపీ ఎడ్యుకేషన్ హబ్‌గా నిలుస్తోందన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి ఇంజినీరింగ్ విభాగం ఎంతో కీలకమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. విదేశీ విద్యకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. పేదలకు ఆర్థిక భారం లేకుండా ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున విదేశీ దీవెన పేరుతో తోడ్పాటు అందిస్తోందన్నారు. శాంత బయోటెక్ అధినేత, పద్మభూషణ్ కేఐ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. పరిశోధన రంగంలో భారతదేశం 2030 నాటికి అగ్రదేశంగా మారాలని జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో సాక్షాత్తు ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారన్నారు. పరిశోధనలు చేసే విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం భారీగా నిధులు సమకూర్చాలని, ఆ పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటేనే వాటికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. మంత్రులు దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, ఎంపీ వంగా గీతవిశ్వనాథ్, ఎమ్మెల్యేలు, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ గౌరవార్థం ఇచ్చే డాక్టరేట్‌ను ప్రముఖ వాణిజ్యవేత్త, గ్రీన్ కో సీఎండీ చలమలశెట్టి అనిల్‌కు గవర్నర్ అందజేశారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో వివిధ విభాగాల్లో టాపర్లుగా నిలిచిన 66 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 144 మందికి డాక్టరేట్‌లను గవర్నర్ నజీర్ అందజేశారు.

బాబుకు తగిన శాస్తి జరిగింది

976వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కులవాదమే అజెండాగా ఈ ప్రాంతంలో పేదలను తరిమికొట్టి అమరావతి పేరుతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేయాలని చూసిన బాబుకు తగిన శాస్తి జరిగిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 976వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలోబుధవారం పలువురు మాట్లాడారు.పూలింగ్ పేరుతో రైతుల వద్ద భూములను సేకరించిన బాబు రైతులకు న్యాయం చేయలేదని, వారికిచ్చిన రిటర్న్‌బుల్ ప్లాట్లను అభివృద్ధి చేయకుండా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు భూములను కారుచౌకగా కట్టబెట్టి కోట్లాది రూపాయలు లబ్ధి పొందాడని ఆరోపించారు. అమరావతి అభివృద్ధికి చంద్రబాబే అడ్డంకిగా మారాడనేందుకు కోర్టుల్లో వేసిన వందలాది తప్పుడు కేసులే కారణమని చెప్పారు. సీఆర్డీఏ చట్టంలో పొందుపరచిన విధంగానే 5 శాతం భూమిని పేదల అవసరాల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తుంటే అడ్డుపడాలని తప్పుడు కేసులు వేయించిన బాబుకు హైకోర్టు, సుప్రీంకోర్టు చెంప చెళ్లుమనిపించాయని హర్షం వ్యక్తం చేశారు. పేదల కోసమే పోరాటం చేయాల్సిన వామపక్షాలు, ఇతర పార్టీలు ప్యాకేజీ రాజకీయాలు చేయడం బాధాకరమని తెలిపారు. నాయకులు ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జూ పార్కులో పులి కూన మృతి

- కిడ్నీ, ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా కన్నుమూత
- పోస్టుమార్టం అనంతరం పులి కూనకు జూలోనే దహన సంస్కారం

సాక్షి, తిరుపతి : రెండు నెలల కిందట నంద్యాల జిల్లా నల్లమల నుంచి తిరుపతి జూకి తీసుకొచ్చిన నాలుగు పులి కూనల్లో ఒకటి సోమవారం మృతిచెందింది. కిడ్నీ, ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా అది మరణించినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. శ్రీశైలం–నాగార్జున సాగర్ పులుల అభయారణ్యంలో టీ 108 అనే పెద్దపులి నాలుగు ఆడ పిల్లలకు జన్మనిచ్చి వాటికి దూరమైన విషయం తెలిసిందే. రోజులు గడిచినా తల్లి పులి జాడ తెలియకపోవడంతో శ్రీశైలం రిజర్వుడు అటవీ అధికారులు కూనల సంరక్షణ కోసం తిరుపతి జూ పార్క్‌కు తీసుకొచ్చారు. శ్రీశైలం రిజర్వుడ్ ఫారెస్ట్ నుంచి తెచ్చిన పులి కూనలను నెల రోజుల వరకు పర్యవేక్షణ గదిలో ఉంచి ఆపై ఎన్‌క్లోజర్స్‌లో వదిలిపెట్టాల్సి ఉంది. అయితే జూ పార్క్ నిర్వాహకులు నాలుగు పులి పిల్లలను రెండు నెలలపాటు చిన్నపాటి గదిలోనే ఉంచడంతో అవి మానసికంగా కుంగి, ఉక్కిరిబిక్కిరైనట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఒక పులి పిల్ల కిడ్నీ, ఊపిరి తిత్తుల జబ్బుకు గురై మృతి చెందినట్లు సమాచారం. నిత్యం పులి పిల్లలను పర్యవేక్షిస్తూ సంరక్షిస్తున్న 'జూ' డాక్టర్.. పులి పిల్లను ఎన్‌క్లోజర్స్‌లోకి మార్చాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్), జూ క్యూరేటర్‌కు సూచించినప్పటికీ ఆ అధికారులు నిర్లక్ష్యం చూపినట్లు తెలుస్తోంది. మృతి చెందిన పులి కూనకు పోస్టుమార్టం చేసి జూ పార్క్‌లోనే దహన సంస్కారం నిర్వహించారు.

8న జమ్మూలోని శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ

తిరుమల: దేశవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తోన్న టీటీడీ ఉత్తరాదిలోని జమ్మూలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించింది. వైఖానస ఆగమోక్తంగా, సర్వాంగ సుందరంగా ఈ ఆలయాన్ని నిర్మించింది. జమ్మూలోని మజీన్ గ్రామంలో టీటీడీ నిర్మించిన శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ జూన్ 8న జరుగనుంది. ఇందుకోసం జూన్ 3 నుంచి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 3న ఆచార్యవరణం, పుణ్యాహవచనం, మత్స్యంగ్రహణం, అంకురార్పణ చేస్తారు. 4న పంచగవ్యప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమం నిర్వహిస్తారు. 5న యాగశాల వైదిక కార్యక్రమాలు, అక్షిన్మోచనం, నవకలశ స్నపనం, పంచగవ్యాధివాసం చేపడతారు.

కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌పై తీర్పు రిజర్వ్

- జూన్ 2న వెలువరిస్తామన్న ఏసీబీ న్యాయస్థానం
- గడువు కోరిన చంద్రబాబు తరఫు న్యాయవాదులు
- కుదరదన్న న్యాయస్థానం
- అమరావతి భూసమీకరణలో అక్రమాలు
- అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణపై సీఐడీ కేసు
- అధికార దుర్వినియోగం జరిగినట్లు దర్యాప్తులో వెల్లడి
- లింగమనేని రమేశ్‌కు మేలు.. ప్రతిగా చంద్రబాబుకు కరకట్ట నివాసం
- ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో నారాయణ భారీగా అక్రమార్జన



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి భూసమీకరణలో క్విడ్ ప్రోకో కేసులో ఏ–1గా ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కరకట్ట నివాసం, ఏ–2గా ఉన్న అప్పటి పురపాలక శాఖ మంత్రి నారాయణ బ్యాంకు ఖాతాల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. జూన్ 2న తీర్పు వెలువరించనున్నారు.

క్విడ్ ప్రోకో ఇలా

అమరావతి భూసమీకరణలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికార దుర్వినియోగానికి పాల్పడి భారీగా అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. భూసమీకరణ నుంచి లింగమనేని కుటుంబానికి చెందిన భూములు, హెరిటేజ్ సంస్థ భూములు, తమ బినామీల భూములను తప్పించారని ఆధారాలు సేకరించింది. అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పుల ద్వారా తమ బినామీలు, బంధువుల భూముల విలువను భారీగా పెరిగేలా చేశారని కూడా నిర్ధారణ అయ్యింది. అందుకోసం లింగమనేనితో క్విడ్ ప్రోకోకు పాల్పడి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని సాక్ష్యాధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. క్విడ్ ప్రోకోలో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణానది కరకట్ట మీద ఉన్న తమ ఇంటిని చంద్రబాబుకు ఇచ్చారని కూడా ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ నివాసానికి సంబంధించి చంద్రబాబు, లింగమనేని పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు, ప్రకటనలు ఇవ్వడం కూడా గమనార్హం. తాను చంద్రబాబుకు ఇంటిని అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ మొదట సీఐడీకి చెప్పారు. కానీ ఆ ఇంటి అద్దె ద్వారా వచ్చిన ఆదాయం వివరాలను ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన నివేదికలో వెల్లడించలేదు. జీఎస్టీ చెల్లించ లేదు కూడా. మరోవైపు చంద్రబాబు ఆ ఇంటికి ప్రభుత్వం నుంచి హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) తీసుకున్నారు. కానీ.. లింగమనేనికి అద్దె చెల్లించలేదు. అంటే ఆ ఇంటిని లింగమనేనితో క్విడ్ ప్రోకోలో భాగంగానే చంద్రబాబు పొందారన్న విషయం స్పష్టమైంది. అదే రీతిలో ఇన్నర్ రింగ్ రోడ్డులో అలైన్‌మెంట్‌లో అక్రమాల ద్వారా బినామీల పేరిట నారాయణ భారీగా అక్రమంగా ఆర్జించినట్టు గుర్తించారు. దాంతో సీఐడీ ఈ కేసులో దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబు పొందిన కరకట్ట నివాసాన్ని, నారాయణ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న బ్యాంకు నిల్వలను అటాచ్ చేయాలని సీఐడీ ప్రభుత్వాన్ని కోరింది. అందుకు ప్రభుత్వం అనుమతిస్తూ జీవో జారీ చేసింది.

అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోర్టును కోరిన సీఐడీ

జప్తునకు ప్రభుత్వం అనుమతించడంతో అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయస్థానంలో సీఐడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కరకట్ట మీద నివాసం, నారాయణ బంధువుల ఆస్తుల జప్తునకు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశామని, అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరారు. నేరం జరిగిందా లేదా అనేది తెలుసుకునేందుకు అవసరమైతే ఈ కేసులో అఫిడవిట్ దాఖలు చేసిన అధికారిని న్యాయస్థానం విచారించవచ్చని చెప్పారు. ఈ దశలో ప్రతివాదులకు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై ప్రతివాది చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. అటాచ్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద లేనందున సమయం ఇవ్వాలని కోరారు. ఆ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. అటాచ్‌మెంట్ పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయని, తీర్పును జూన్ 2న వెలువరిస్తామని చెప్పారు.

నిరుద్యోగులకు టోకరా కేసులో ఆరుగురిపై కేసు

- ఉద్యోగాల పేరుతో రూ.2 లక్షల చొప్పున వసూలు

సీతమ్మధార : నిరుద్యోగులకు టోకరా కేసులో జావా మ్యాట్రిక్స్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఆరుగురిపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో హైదరాబాద్‌కు చెందిన జావా మ్యాట్రిక్స్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసింది. 1,700 మంది నిరుద్యోగులకు ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ కింద డీటీపీ ఆపరేటర్లుగా జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చింది. ఇందుకోసం ఒక్కొక్కరి దగ్గర రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా విశాఖ నుంచి 200 మంది ఉంటారు. అయితే వీరికి 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు జీతాలు చెల్లించలేదు. జీతాలు గురించి అడిగితే ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరింపులకు పాల్పడుతుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంస్థకు చెందిన అరుణ అలియాస్ హారిక, సంతోష్, రామకృష్ణ, సుధాకర్, ఆకాష్, సురేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మిగిలిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు.

చంద్రగిరి ఐపీయల్ అద్భుతం..!

- 15 వేల మంది క్రీడాకారులను ఒక్కచోటకి చేర్చటం చెవిరెడ్డికే సాధ్యం
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

తిరుపతి రూరల్: 1,000 జట్లు, 15 వేల మంది క్రీడాకారులతో ప్రపంచస్థాయి ఏర్పాట్లతో నిర్వహిస్తోన్న చంద్రగిరి ఐపీయల్‌గా పిలిచే వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ అద్భుతమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కొనియాడారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో నిర్వహిస్తోన్న ఐపీఎల్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 13 క్రీడా మైదానాల్లో జరుగుతోన్న మ్యాచ్‌లను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి ఓపెన్ టాప్ జీపులో తిరుగుతూ తిలకించారు. బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అవార్డులను, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనితరసాధ్యుడని కొనియాడారు. ఒక్క నియోజకవర్గంలోనే 1000 టీమ్‌లను తీసుకువచ్చి వారందరికీ క్రికెట్ కిట్లు ఇవ్వటమే కాకుండా, వేలాది మందికి ప్రతి రోజు మూడు పూటల భోజనాలను అందించడం చెవిరెడ్డికే సాధ్యమన్నారు. తండ్రి బాటలోనే యువతను ప్రోత్సహించడంలో మోహిత్‌రెడ్డి ముందు ఉన్నారని, రానున్న రోజుల్లో ఆయనకు అండగా ఉండాలని యువతకు సూచించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో చిన్నారులకు పునర్జన్మ

- చెన్నైలోని గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీలో లివర్ మార్పిడి
- ఎంతో మందికి ప్రాణభిక్ష పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నాలుగేళ్లలో 100 మందికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఒక్కో ఆపరేషన్‌కు రూ.20 లక్షలు ఖర్చు
- సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరు
- త్వరలో గుంటూరులోనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్
- బాధిత చిన్నారులతో కలిసి అవగాహన సదస్సు



కాలేయ మార్పిడి చేయించుకున్న చిన్నారులు, కుటుంబసభ్యులతో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్, డాక్టర్ రజనీకాంత్

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రాణం విలువ తెలిసిన గొప్ప మానవతావాదిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యవసర వైద్యం అవసరమైన ఎంతో మందికి సహాయం చేస్తూ పునర్జన్మనిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. బుధవారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నైకు చెందిన గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి (ఏపీ సీఎంఆర్ ఎఫ్) నుంచి కాలేయ (లివర్) మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న చిన్నారులు తోట భార్గవి, చిన్నారి ఆరాధ్య, జగదీష్, వారి కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.20 లక్షలు ఖర్చయ్యే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వీరికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అత్యవసర వైద్యానికి వేగంగా అనుమతులు ఇస్తున్నారని చెప్పారు. లక్షలాది రూపాయల ఖర్చుతో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారని తెలిపారు. అత్యంత ఖరీదైన వైద్యానికి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమయ్యే పరిస్థితుల్లో వారికి పైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్యాన్ని అందిస్తూ సీఎం జగన్ లక్షలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. గ్లోబల్ హెల్త్‌సిటీ ఆస్పత్రి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణుడు డాక్టర్ పచ్చా రజనీకాంత్ మాట్లాడుతూ.. ఏపీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఇటీవలి కాలంలో 20 మంది చిన్నారులకు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు చేశామని, వారంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వివరించారు. ఒక్కో శస్త్ర చికిత్సకు 20 మంది వైద్యులు 10 గంటలపాటు శ్రమించాల్సి వస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ అర్జీల స్వీకరణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్.. వెనువెంటనే సంబంధిత ఆస్పత్రులకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) మంజూరు చేసి, శస్త్ర చికిత్స అనంతరం నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే ప్రభుత్వ అనుమతితో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గ్లోబల్ హెల్త్ సిటీ ఆస్పత్రి కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ వాకా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా గత నాలుగేళ్లలో 100 మందికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు చేశామని చెప్పారు. ఏడాది క్రితం విజయవాడకు చెందిన నాలుగున్నర నెలల చిన్నారి ఆరాధ్యకు అత్యంత చిన్న వయస్సులో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజల అదృష్టమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడిని రక్షించబోయి..

- తల్లి, ఆమె స్నేహితురాలి మృతి
- శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లాలో ఘటన





సబీహా, షాహినా మృతదేహాలు

నెల్లూరు(క్రైమ్)/వీఆర్సీసెంటర్: పెన్నా నదిలో రివిట్మెంట్ వాల్ నిర్మాణం కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు పడిన తన యుడిని రక్షించబోయిన తల్లి, ఆమె స్నేహితురాలు మృతిచెందారు. ఈ హృదయవిదారక సంఘటన నెల్లూరు భగత్‌సింగ్ కాలనీ వద్ద పెన్నా నదిలో బుధవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్‌కాలనీలో తిరుమల, సబీహా(29)లు దంపతులు. వారికి ముగ్గురు కుమారులు. ఫర్నిచర్ షాపులో తిరుమల, నగరంలోని ఓ దుకాణంలో సబీహా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రస్తుతం తిరుమల వేరే రాష్ట్రంలో పనులకు వెళ్లారు. వారి ఇంటికి ఎదురుగానే షాహినా(25) తన కుమార్తెతో కలిసి జీవిస్తోంది. ఆమె బీడీలు చుట్టుకుంటూ కుమార్తెను పోషించుకుంటోంది. సబీహా, షాహినాలు స్నేహితులు. బుధవారం సబీహా, షాహినాల పిల్లలు పెన్నానదిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సబీహా కుమారుడు రీహాన్ గుంతలో పడి మునిగిపోతూ కనిపించాడు. దీంతో సబీహా, షాహినాలు అక్కడకు పరుగులు తీసి రీహాన్‌ను గుంతలో నుంచి గట్టున పడేశారు. ఈ క్రమంలో వారిద్దరూ కాలుజారి గుంతలో పడిపోయారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని గమనించిన ఓ మహిళ పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన గుంతవద్దకు చేరుకుని ఆ మహిళలను బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం

తొలిరోజు శ్రీకృష్ణుని విహారం • నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం



తెప్పపై అమ్మవార్లతో కలసి పుష్కరిణిలో విహరిస్తున్న స్వామివారు, దేవేరుల ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి వారు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణుని సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి ముఖమండపంలో వేదపారాయణం, మంగళవాయిద్యం నడుమ ఉభయదేవేర్లతో సహా స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో ఆలయ అర్చకులు నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు ఉభయదేవేర్లతో సహా స్వామి వారిని వేంచేపుగా ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణికి తీసుకొచ్చి తెప్పపై కొలువుదీర్చారు. అనంతరం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామి వారు ఉభయదేవేర్లతో సహా మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి 7.30 గంటలకు స్వామి వారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంలో ఏపీకి జాతీయ పురస్కారం



కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న కొత్తపల్లి సర్పంచ్ నాగప్రసాద్

సాక్షి, అమరావతి: సూక్ష్మ సేద్యం ద్వారా అత్యుత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. సూక్ష్మ సేద్యం అమలులో ఏపీ జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. మొదటి మూడు స్థానాలను రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర దక్కించుకున్నాయి. బోర్ల కింద వంద శాతం బిందు, తుంపర పరికరాలను అమర్చడంతోపాటు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్న పంచాయతీగా జాతీయ స్థాయిలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం ఈ.కొత్తపల్లి ఎంపికైంది. రాష్ట్రంలో 12 లక్షల మంది రైతులు 34.70 లక్షల ఎకరాల్లో బిందు సేద్యం, 12.98 లక్షల ఎకరాల్లో తుంపర సేద్యం చేస్తున్నారు. మరో 28 లక్షల ఎకరాలు అనువైనవిగా గుర్తించగా 2022–23లో రూ.636 కోట్లతో 2.27 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించారు. 2023–24లో రూ.902 కోట్ల అంచనాతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

ఉత్తమ పంచాయతీగా పులివెందుల మండలం ఈ.కొత్తపల్లి

జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపికైన వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం ఈ.కొత్తపల్లిలో 630 మంది రైతులకు బోర్ల కింద 1405 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 1,152.50 ఎకరాల్లో బిందు, 252.50 ఎకరాల్లో తుంపర పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. వీటి ద్వారా అరటి, కూరగాయలు, వేరుశెనగ పంటలు పండిస్తూ జాతీయ స్థాయిలో అధిక దిగుబడులను సాధిస్తున్న పంచాయతీగా ఈ.కొత్తపల్లి గుర్తింపు సాధించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్'పై ఢిల్లీలో బుధవారం జరిగిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా చేతుల మీదుగా ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం పీవో డాక్టర్ సీబీ హరినాథ్‌రెడ్డి, ఈ.కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ బాలనాగప్రసాద్ అవార్డులను అందుకున్నారు. వినూత్న కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మనోజ్ ఆహూజా ప్రశంసించారు. జాతీయ స్థాయిలో 30 మిలియన్ హెక్టార్లలో బిందు, తుంపర పరికరాలను రాయితీపై అందించామని, వచ్చే ఏడేళ్లలో 70 మిలియన్ హెక్టార్లలో విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి అహ్మద్ కిద్వాయి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు, ఎన్ఆర్ఎం జాతీయ కార్యదర్శి ఫ్రాంక్లిన్, ఏపీ ఉద్యాన శాఖాధికారులు వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రోత్సాహంతో సాధించాం

ఆర్బీకేల ద్వారా ఎలాంటి సిఫార్సులు లేకుండా నూరు శాతం బిందు, తుంపర పరికరాలను పొందగలిగాం. అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తక్కువ నీటితో అధిక దిగుబడులను సాధిస్తూ రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నాం. మా గ్రామానికి జాతీయ స్థాయి పురస్కారం లభించడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహం వల్లే దీన్ని సాధించగలిగాం.

–బాలనాగప్రసాద్, సర్పంచ్, ఈ.కొత్తపల్లి, వైఎస్సార్ జిల్లా

ప్రభుత్వ కృషి ఫలితం..

ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావు లేకుండా అర్హత కలిగిన వారందరికీ ఆర్బీకేల ద్వారా బిందు, తుంపర సేద్యం పరికరాలను అందిస్తున్నాం. సామాజిక తనిఖీ కోసం అర్హుల జాబితాలను ప్రదర్శిస్తున్నాం. బోర్ల కింద నూరు శాతం సూక్ష్మ సేద్యం అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్, ప్రకాశం జిల్లాలు జాతీయ స్థాయిలో టాప్ 5లో నిలిచాయి. ప్రభుత్వ కృషి ఫలితంగా రాష్ట్రానికి జాతీయ పురస్కారం లభించింది.

– సీబీ హరినాథ్‌రెడ్డి, పీవో, ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం

టపాకాయల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- ముగ్గురి దుర్మరణం
- తిరుపతి జిల్లాలో ఘటన

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): టపాకాయలు తయారు చేసే అనధికారిక గోడౌన్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం కువ్వాకొల్లి పంచాయతీ సమీపంలోని ఎల్లకట్టవ గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. ఎల్లకట్టవ గ్రామ సమీపంలో ఎస్.వీరరాఘవులు అనే వ్యక్తి గత కొంతకాలంగా టపాకాయల తయారీ గోడౌన్‌ను నిర్వహిస్తున్నారు. బుధవారం గోడౌన్ వెలుపల ఆరుబయట పైకి వెళ్లే తారాజువ్వల రకానికి చెందిన టపాకాయలు తయారు చేస్తుండగా ఒక్కసారిగా అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో టపాకాయలు తయారు చేస్తున్న గూడూరు ప్రాంతానికి చెందిన ఏడుకొండలు(45), కువ్వాకొల్లికి చెందిన ఎ.నాగేంద్ర(31), ఎల్లకట్టవకు చెందిన బి.శంకరయ్య(50)లు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వీరరాఘవులు, అక్కడే పనిచేస్తున్న ఎల్లకట్టవ గ్రామానికి చెందిన వలంటీర్ కళ్యాణకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

ఓటీటీల్లో కూడా పొగాకు వ్యతిరేక హెచ్చరికలు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓవర్ ది టాప్ (ఓటీటీ) ప్లాట్‌ఫామ్‌ల్లో కూడా పొగాకు వ్యతిరేక హెచ్చరికలు, ప్రకటనల ప్రసారాన్ని తప్పనిసరి చేసింది. సినిమా థియేటర్లు, టీవీ కార్యక్రమాల్లో మాదిరిగానే ఓటీటీల్లో కూడా పొగాకు వ్యతిరేక డిస్‌క్లెయిమర్లు వేసేలా సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం, 2004కు కేంద్రం సవరణలు చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో పొగాకు వ్యతిరేక ప్రకటనలను తప్పనిసరి చేసిన తొలి దేశం భారతే. ఇకపై ఓటీటీల్లో ప్రసారమయ్యే ఏ కార్యక్రమానికైనా ముందు 30 సెకండ్లు, లేదంటే మధ్యలో 30 సెకండ్లు పొగాకు వాడకం క్యాన్సర్ కారకం, ఆరోగ్యానికి హానికరమన్న ప్రకటన ప్రసారం చేయాలి. కార్యక్రమాల్లో పొగ తాగే, మద్యం సేవించే సన్నివేశాలుంటే అది హానికరమన్న డిస్‌క్లయిమర్ స్క్రీన్‌పై 20 సెకండ్లు తప్పనిసరిగా రావాలి. ఈ హెచ్చరికలు, ప్రకటనలు ఓటీటీ కంటెంట్ ప్రసారమయ్యే భాషలోనే ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. ఓటీటీల్లో ప్రసారమవుతున్న వెబ్ సిరీస్‌లు, ఇతర కార్యక్రమాల్లో పొగాకు ఉత్పత్తుల్ని విచ్చలవిడిగా చూపుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

అక్రమ వలసదారుల పిల్లలకు... పౌరసత్వ హక్కులు రద్దు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికాకు అక్రమంగా వచ్చిన వలసదారులకు పుట్టేవారికి పౌరసత్వ హక్కుల్ని తాను అధికారంలోకి వస్తే రద్దు చేస్తానని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తానంటూ ప్రచార వీడియోలో చెప్పారు.

టచ్‌లో మరింత మంది 'షిండే' ఎమ్మెల్యేలు: రౌత్

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేల్లో మరింత మంది తమకు 'టచ్'లోకి వస్తున్నట్టు శివసేన (ఉద్ధవ్) ఎంపీ, అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ చెప్పుకొచ్చారు. ''షిండే వర్గంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలంతా వచ్చే ఎన్నికల్లో తమ గుర్తుపై పోటీ చేయాల్సిందేనని బీజేపీ అంటోంది. వారికిది ఇష్టం లేదు. ఈ మేరకు మాకు కచ్చితమైన సమాచారముంది'' అన్నారు.

కర్ణాటక ఫలితాలతో దేశ రాజకీయ ముఖచిత్రం మారింది. బీజేపీ ఇప్పటికీ ఉత్తరభారతం, ఈశాన్య భారతంలో తన పట్టు ప్రదర్శిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రమే బీజేపీ కంటే కాంగ్రెస్‌కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ రాజకీయాల్లో పెనుమార్పులే వచ్చాయి. దక్షిణాదిలో పెద్దగా బలం పుంజుకోలేకపోయినప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతాల్లో మాత్రం బీజేపీ తన పట్టు కొనసాగిస్తూ వస్తోంది..

ఉత్తరంలోనే కమలం హవా...

తూర్పు, పశ్చిమ, ఈశాన్య భారతాల్లో మెరుగు

దక్షిణాదిన అంతంతే, మెరుగవుతున్న కాంగ్రెస్


దశాబ్ద కాలంగా బీజేపీ అత్యధికంగా పట్టు నిలుపుకున్నది ఉత్తరాది రాష్ట్రాల్లోనే. అయితే ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో 2017 నాటికి 60 శాతం అసెంబ్లీ స్థానాలు బీజేపీ ఖాతాలో ఉంటే, 2022 నాటికి 47 శాతానికి తగ్గాయి. 2023కు మరింత తగ్గి 44 శాతానికి పరిమితమైంది. ఉత్తరాదిన యూపీలో బీజేపీ వరస విజయాలతో ఊపు మీదుంది. ఇక ఈశాన్య రాష్ట్రాలు కూడా బీజేపీ వైపే ఉన్నాయి. 2012లో అక్కడ ఏమాత్రం బలం లేని కమలదళం పదేళ్లలో అనూహ్యంగా పుంజుకుంది.

దక్షిణం మినహా...


మొత్తం 498 ఈశాన్య అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి అప్పట్లో కేవలం 2 శాతం స్థానాలే ఉండగా ఇప్పుడది ఏకంగా 36 శాతానికి పెరిగింది పశ్చిమ భారతంలోనూ బీజేపీయే కీ ప్లేయర్. గోవా, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీకి 2012లో 44% సీట్లుండగా ఇప్పుడు 52 శాతానికి పెరిగాయి. తూర్పుభారతంలోనూ బీజేపీ మెరుగవుతూ వస్తోంది. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో 2012లో బీజేపీకి ప్రతి ఐదుగురు ఎమ్మెల్యేల్లో ఒక్కరే ఉండగా ఇప్పుడు ప్రతి నలుగురిలో ఒకరున్నారు.

- గత 11 ఏళ్లలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం తగ్గుతూ వస్తోంది. 2013, 2018లో జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలు కాంగ్రెస్‌కు కలిసిరాలేదు.
- ఇన్నేళ్లుగా బీజేపీ, కాంగ్రెస్‌యేతర పార్టీలు అసెంబ్లీల్లో తమ పట్టు కొనసాగిస్తూ వస్తున్నాయి. దేశవ్యాప్తంగానున్న ఎమ్మెల్యేలలో 50% మంది ప్రాంతీయ పార్టీల్లోనే ఉన్నారు. రాష్ట్రాల్లోని 3వ వంతు మంది ఎమ్మెల్యేలు బీజేపీకి చెందిన వారు. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతీ 10 మంది ఎమ్మెల్యేలలో బీజేపీకి ఒకరే ఉన్నారు.
- 2012 మార్చిలో కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా 1,224 మంది ఎమ్మెల్యేలు ఉంటే బీజేపీకి 845 మంది ఉన్నారు. అప్పట్లో దేశవ్యాప్తంగా హస్తం హవా ఉండేది. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టేసి క్రమంగా బీజేపీ బలపడుతూ వచ్చింది. 2023 మే నాటికి దేశంలో 4,033 మంది ఎమ్మెల్యేలు ఉంటే అందులో బీజేపీకి చెందినవారు 1,329 కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 735కి తగ్గిపోయారు.

ప్రాంతాలవారీగా ఎమ్మెల్యేల బలాబలాలు



పార్టీల వారీగా ఎమ్మెల్యేల బలం (శాతాల్లో)



కాంగ్రెస్ మరింత పట్టు పెంచుకుంటుందా?

2012–22 మధ్య దేశవ్యాప్తంగా బీజేపీ అదనంగా 540 ఎమ్మెల్యే స్థానాలను సంపాదించుకుంటే కాంగ్రెస్ 505 సీట్లు కోల్పోయింది! రాహుల్ గాంధీ పాదయాత్ర తర్వాత కర్ణాటకలో సాధించిన విజయం నేపథ్యంతో ముమ్ముందు తన పట్టు ఇంకా పెరుగుతుందని కాంగ్రెస్ ధీమాగా ఉంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం గ్రాఫ్ మరింత మెరుగవుతుందని ఆశిస్తోంది.

–సాక్షి, నేషనల్ డెస్క్

ఆహార ధాన్యాల స్టోరేజీకి... అతి భారీ పథకం

7 కోట్ల టన్నుల సామర్థ్యం

- రూ.లక్ష కోట్లతో ఐదేళ్లలో ఏర్పాటు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఆహార ధాన్యాల నిల్వ కోసం రూ.లక్ష కోట్లతో భారీ పథకానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. పంట నష్టాలను తగ్గించడమే గాక నిల్వ సదుపాయం లేక రైతులు పంటను అయిన కాడికి అమ్ముకునే దుస్థితిని ఇది తప్పించనుంది. దేశ ఆహార భద్రతను కూడా మరింత పటిష్టం చేయనుంది. ఇందులో భాగంగా సహకార రంగంలో వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోకెల్లా అతి భారీగా 7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల స్టోరేజీ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో భారీగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి బ్లాకులో 2 వేల టన్నుల నిల్వ సామర్థ్యంతో గోదాములను ఏర్పాటు చేస్తారన్నారు. మంత్రివర్గ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ''ప్రస్తుతం దేశ వార్షిక ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు 31 కోట్ల టన్నులు. కానీ నిల్వ సామర్థ్యం మాత్రం 14.5 కోట్ల టన్నులే. అంటే సగాని కంటే తక్కువ. తాజా పథకంతో అమలైతే అది 21.5 కోట్ల టన్నులకు పెరుగుతుంది. వికేంద్రీకృత తరహాలో ఎక్కడికక్కడ నిల్వ సామర్థ్యం ఏర్పాటు చేస్తే ఆహార ధాన్యాల వృథా, రవాణా వ్యయం తదితరాలన్నీ బాగా తగ్గుతాయి'' అని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల (పీఏసీఎస్)ను ఇది బలోపేతం చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్ష పీఏసీఎస్‌ల్లో 63 వేల దాకా చురుగ్గా పని చేస్తున్నాయి.



అమలుకు మంత్రుల కమిటీ

- ఆహార ధాన్యాల నిల్వ పథకం అమలుకు మంత్రుల కమిటీ వేయనున్నారు. కేంద్ర సహకార శాఖ మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.
- వ్యవసాయ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర శాఖలకు చెందిన పలు పథకాలను దీనిలో విలీనం చేస్తారు.
- ముందుగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన 10 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేసి చూస్తారు. ఆ అనుభవాల ఆధారంగా పూర్తిస్థాయి పథకాన్ని దశలవారీగా అమల్లో పెడతారు.
- పీఏసీఎస్‌ల కార్యకలాపాలను విస్తృతం చేయడం ద్వారా వాటి ఆదాయాన్ని ఇతోధికంగా పెంచడం కూడా ఈ పథకం లక్ష్యాల్లో ఒకటి.

పాతికసార్లు పొడిచి మరీ... కన్నకూతురిని కడతేర్చాడు

సూరత్‌లో ఘోరం



సూరత్: కూతురి పెళ్లి విషయమై భార్యతో గొడవ పడ్డాడు. ఆవేశంలో ఆమెను కత్తితో గాయపరిచాడు. అంతటితో ఆగకుండా కూతురిపైనా ఆటవికంగా దాడికి దిగాడు. తప్పించుకునే ప్రయత్నం చేసినా వెంటాడి మరీ ఏకంగా 25 సార్లు పొడిచి పొట్టన పెట్టుకున్నాడు. ఈ దారుణం గుజరాత్‌లోని సూరత్‌లో మే 18న జరిగింది. నిందితుడు రామానుజ ఆ రాత్రి భార్యతో కలిసి మేడపై పడుకున్నాడు. కూతురు గురించి వాగ్వాదం జరగడంతో రెచ్చిపోయాడు. ఒళ్లు తెలియని ఆవేశంలో కత్తం దుకుని ఆమెను చంపబోయాడు. అడ్డుకున్న పిల్లలనూ గాయపరిచాడు. వాళ్లు కాసేపు నిలువరించినా, దగ్గరికొచ్చిన ప్రతివారినీ పొడవడం మొదలుపెట్టాడు. తర్వాత కత్తితో కూతురి వెంటపడ్డాడు. ఆమె అరుస్తూ గదిలోకి పరిగెత్తినా వదలకుండా పదే పదే పొడిచాడు. మళ్లీ మేడపైకి వెళ్లి భార్యపైకి దూసుకెళ్లాడు. పిల్లలు అప్పటికే గాయపడ్డా ధైర్యంగా తండ్రిని అడ్డుకున్నారు. ఇదంతా అపార్ట్‌మెంట్ సీసీటీవీలో రికార్డైంది. అంతలో పోలీసులు రంగప్రవేశం చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

జ్ఞానవాపి మసీదుపై పిటిషన్ తిరస్కరణ

అలహాబాద్ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. ఈ మసీదు ప్రాంగణంలోని ఆలయంలో పూజలు చేసుకోవడానికి అనుమతి కోరుతూ ఐదుగురు హిందూ మహిళా భక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను వారణాసి కోర్టు విచారణకు స్వీకరించడాన్ని సవాలు చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు తీర్పు వెలువరించింది. హిందూ వర్గానికి ఇదొక పెద్ద విజయమని న్యాయవాది సుభాష్ నందన్ చతుర్వేది చెప్పారు. కోర్టు తీర్పుపై అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ తరఫు న్యాయవాది మొహమ్మద్ తౌహీద్ ఖాన్ స్పందించారు. ఆర్డర్ 7 రూల్ సీపీసీపై కోర్టు తీర్పు ఇచ్చిందని, దీనిపై కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని, సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. జ్ఞానవాపి మసీదు వివాదానికి సంబంధించిన 7 కేసులను వారణాసి కోర్టు బుధవారం విచారించింది.

మిడిసిపడుతున్నారు!

దేవుడి కంటే గొప్పనుకుంటున్నారు

మోదీపై రాహుల్ ధ్వజం

అమెరికా సదస్సులో ప్రసంగం

ఆయనో నకిలీ గాంధీ: బీజేపీ



మహిళా రిజర్వేషన్ బిల్లు

భారత్‌లో నేడు పేదలు, మైనార్టీ వర్గాల ప్రజలు నిస్సహాయులుగా మారిపోతున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయులు సహజంగా ఒకరినొకరు ద్వేషించుకోరని అన్నారు. దేశంలో వ్యవస్థను, మీడియాను నియంత్రిస్తున్న కొందరు వ్యక్తులు ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వివరించారు. రాజకీయ వ్యవస్థ, వ్యాపారాలు, పాలక వర్గంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాల్సిందేనని రాహుల్ తేల్చిచెప్పారు.

శాంటాక్లారా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. దేవుడి కంటే తమకే ఎక్కువ తెలుసు అని భారతదేశంలో కొందరు మిడిసిపడుతున్నారని, అలాంటివారిలో మోదీ కూడా ఒకరని అన్నారు. అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాంటాక్లారాలో మంగళవారం 'మొహబ్బత్ కీ దుకాణ్' పేరిట ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించిన సదస్సులో వందలాది మంది భారతీయ అమెరికన్లను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ ప్రపంచం చాలా పెద్దదని, అందరూ అన్ని విషయాలు తెలుసుకోవడం చాలా కష్టమని వివరించారు. భారత్‌లో ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం తమకు అన్నీ తెలుసని వాదిస్తుంటారని అన్నారు. వారు తమకు అన్నీ తెలుసంటూ ఎవరినైనా ఒప్పించగల ఘనులు అని చెప్పారు. చరిత్ర గురించి చరిత్రకారులకు, సైన్స్ గురించి సైంటిస్టులకు, యుద్ధరీతుల గురించి సైన్యానికి పాఠాలు బోధించగల సమర్థులు అని ఎద్దేవా చేశారు. దేవుడితో సమానంగా కూర్చొని, ప్రపంచంలో ఏం జరుగుతోందో దేవుడికే చెప్పగలరని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇతరులు చెప్పేది మాత్రం వారు వినబోరని పేర్కొన్నారు. అలాంటి 'నమూనా' మనుషుల్లో ప్రధాని మోదీ కూడా ఉన్నారనడంలో సందేహం లేదన్నారు. ఈ సృష్టి ఎలా పనిచేస్తోందో దేవుడికి మోదీ చక్కగా పాఠాలు చెప్పగలరని తెలిపారు. అప్పుడు తాను సృష్టించిన ఈ సృష్టి పట్ల దేవుడు అయోమయానికి గురికావడం ఖాయమని వెల్లడించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సభామందిరం నవ్వులతో దద్దరిల్లిపోయింది.

సెంగోల్ పేరిట ఆర్భాటం

భారత్ అనే భావన ఇప్పుడు దాడికి గురవుతోందని, సవాళ్లు ఎదుర్కొంటోందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్వేష వ్యాప్తి వంటి సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, వాటిని పరిష్కరించేవారే లేకుండాపోయారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవమని ఆరోపించారు. ప్రజా సమస్యల గురించి చట్టసభల్లో చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని, అందుకే సెంగోల్ (రాజదండం) పేరిట ఆర్భాటం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ సర్కారు వచ్చి అబద్ధాలకోరు అని దుయ్యబట్టారు. అమెరికాలో భారత దేశం జెండాను సగర్వంగా ఎగురవేస్తున్న భారతీయ అమెరికన్లపై రాహుల్ గాంధీ ప్రశంసల వర్షం కురిపించారు.

ఖలిస్తానీ మద్దతుదారుల కలకలం

శాంటాక్లారాలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా ఖలిస్తానీ మద్దతుదారులు కాసేపు హంగామా సృష్టించారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. రాహుల్ నవ్వుతూ ప్రతిస్పందించారు. ''స్వాగతం, స్వాగతం .. విద్వేషం అనే బజారులో ప్రేమ అనే దుకాణానికి స్వాగతం'' అని అన్నారు. తాము అందరినీ ప్రేమిస్తామని, గౌరవిస్తామని చెప్పారు. ఎవరినీ ద్వేషించబోమని, ఇతరులు చెప్పేది వింటామని పేర్కొన్నారు. ఇంతలో భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి ఖలిస్తానీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు.

రాహుల్‌కు ఏమీ తెలియదు: బీజేపీ

అమెరికాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నకిలీ గాంధీ అని విమర్శించారు. రాహుల్ దృష్టిలో చరిత్ర అంటే ఆయన కుటుంబమేనని అన్నారు. ఆయనకు ఏమీ తెలియదని, కానీ, అన్నింట్లోనూ నిష్ణాతుడయ్యాడని ఎద్దేవా చేశారు. భారతీయులు తమ చరిత్ర పట్ల గర్వపడతారని వివరించారు. రాహుల్ మాత్రం భారతదేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి విదేశీ గడ్డను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీపై రాహుల్ చేసిన విమర్శలను పలువురు బీజేపీ ముఖ్య నేతలు తప్పుపట్టారు. రాహుల్‌పై బీజేపీ నేతలు చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విట్టర్‌లో ఖండించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాహుల్ మాట్లాడారని స్పష్టం చేశారు. ప్రజలు సమస్యల్లో కూరుకుపోయిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, ఆయన భజనపరులు నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

దేశ మనోభావాలను కించపర్చారు

60 వేల మంది కార్మికుల శ్రమను అగౌరవపర్చారు

కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం



అజ్మీర్‌లో సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అజ్మీర్: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. దేశ మనోభావాలను కాంగ్రెస్ కించపర్చిందని, 60,000 మంది కార్మికుల కఠోర శ్రమను అగౌరవపర్చిందని ధ్వజమెత్తారు. రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో బుధవారం ఓ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి తొమ్మిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. మూడు రోజుల క్రితం పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభించుకున్నామని, ప్రజలంతా గర్విస్తున్నారని, దేశ ప్రతిష్ట మరింత పెరగడంతో వారంతా సంతోషిస్తున్నారని మోదీ తెలిపారు. అన్నింటిలోనూ బురదజల్లే రాజకీయాలు చేసే కాంగ్రెస్, ఇతర పార్టీలు పార్లమెంట్ కొత్త భవనం విషయంలోనూ అదే పని చేస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రారంభించుకొనే అవకాశం కొన్ని తరాలకు ఒకసారి మాత్రమే వస్తుందని, కాంగ్రెస్ దాన్ని 'స్వార్థపూరిత నిరసన' కోసం వాడుకుందని ఆరోపించారు. మన దేశం సాధిస్తున్న ప్రగతిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. వారి అవినీతిని, కుటుంబ వారసత్వ రాజకీయాలను తాము ప్రశ్నిస్తున్నామని, అందుకే తమపై కోపంగా ఉన్నారని పరోక్షంగా సోనియా గాంధీ కుటుంబంపై విమర్శలు ఎక్కుపెట్టారు. వారి ఆరాచకాలను ఒక 'నిరుపేద బిడ్డ' సాగనివ్వడం లేదని, అది వారు తట్టుకోలేకపోతున్నారని ఆక్షేపించారు.

కాంగ్రెస్ పాలనలో అవినీతి వ్యవస్థ

''పేదరికాన్ని సమూలంగా నిర్మూలిస్తామని 55 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, పేదలను దగా చేసింది. పేదలను తప్పుదోవ పట్టించడం, వారిని ఎప్పటికీ పేదలుగానే ఉంచడం కాంగ్రెస్ విధానం. కాంగ్రెస్ పాలనలో రాజస్తాన్ ప్రజలు ఎంతగానో నష్టపోయారు. తొమ్మిదేళ్ల బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజాసేవకు, సుపరిపాలనకు, నిరుపేదల సంక్షేమానికి అంకితం చేస్తున్నాం. 2014కు ముందు దేశంలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చేవారు. నగరాల్లో ఉగ్రవాద దాడులు జరిగేవి. అప్పట్లో రిమోట్ కంట్రోల్‌తో పాలన సాగేది. కాంగ్రెస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చే అవినీతి వ్యవస్థను అభివృద్ధి చేశారు. దేశ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ గురించి మాట్లాడుకుంటోంది. దేశంలో పేదరికం అంతమవుతోందని నిపుణులు చెబుతున్నారు. మన దేశం సాధించిన ప్రతి విజయం వెనుక ప్రజల చెమట చుక్కలు ఉన్నాయి. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారతీయులు ప్రదర్శిస్తున్న అంకితభావం ప్రశంసనీయం. కొందరు వ్యక్తులకు మాత్రం ఇది అర్థం కావడం లేదు'' అని ప్రధాని మోదీ తప్పుపట్టారు.

ఉత్తర కొరియా నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలం



సియోల్: ఉత్తర కొరియాలో కిమ్ ప్రభుత్వం మిలటరీ కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వరస పెట్టి క్షిపణి పరీక్షలు నిర్వహిస్తున్న ఆ దేశం తొలిసారిగా ప్రయోగించిన నిఘా ఉపగ్రహం విఫలమైంది. ఉపగ్రహాన్ని తీసుకువెళుతున్న రాకెట్ రెండో దశ సమయంలో కనెక్షన్ తెగిపోయినట్టు ఉత్తర కొరియా అధికారిక న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఉపగ్రహ ప్రయోగం వైఫల్యానికి గల కారణాలను శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నట్టుగా వెల్లడించింది. ఉపగ్రహం శకలాలు కొరియాలోని ఉత్తరంవైపు సముద్ర జలాల్లో పడినట్టుగా తెలిపింది. ప్రయోగం విఫలమై రాకెట్ భూమిపైకి దూసుకువచ్చే సమయంలో అసాధారణంగా ప్రయాణించడంతో దక్షిణ కొరియా, జపాన్‌లు వణికిపోయాయి. రాకెట్ ఎక్కడ తమ భూభాగం మీద పడుతుందోనన్న భయంతో దేశ ప్రజలు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపొమ్మంటూ హెచ్చరించాయి. చివరికి రాకెట్ సముద్రంలో పడడంతో ఆ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి.

మూడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

- డిజిటల్ పరికరాలు, రూ.17.50 లక్షల నగదు స్వాధీనం
- పీఎఫ్ఐ కుట్రలపై దర్యాప్తు

న్యూఢిల్లీ/బనశంకరి: నిషేధిత ఇస్లామిక్ అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కుట్రలపై దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు బుధవారం మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించారు. బిహార్‌లోని కతీహర్ జిల్లా, కర్ణాటకలోని దక్షిణ కన్నడ, షిమోగా జిల్లాలు, కేరళలోని కాసర్‌గోడ్, మలప్పురం, కోజికోడ్, తిరువనంతపురం జిల్లాల్లో మొత్తం 25 చోట్ల ఈ సోదాలు జరిగాయి. అనుమానితుల నివాసాల్లో సోదాలు చేపట్టినట్లు ఎన్ఐఏ అధికారులు తెలియజేశారు. మొబైల్ ఫోన్లు, హార్డ్‌డిస్కులు, సిమ్ కార్డులు, పెన్ డ్రైవ్‌లు, డేటా కార్డులు, ఇతర డిజిటల్ పరికరాలు, పత్రాలు, పీఎఫ్ఐకి సంబంధించిన సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఈ సోదాల్లో రూ.17.50 లక్షల నగదు లభ్యమైందని వివరించారు. భారత్‌లో విధ్వంసకర కార్యకలాపాల కోసం పీఎఫ్ఐకి విదేశాల నుంచి హవాలా డబ్బు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల కర్ణాటకలోని బంట్వాళ, పుత్తూరుల్లో నలుగురు అనుమానితులను అరెస్ట్ చేశారు. కేరళలోని కాసరగోడ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పీఎఫ్ఐ కార్యకలాపాలకు సంబంధించి కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు ఎన్ఐఏ గుర్తించింది.

కశ్మీర్‌లోనూ...

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, బుద్గామ్ జిల్లాల్లో మూడు ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ అధికార ప్రతినిధి చెప్పారు. పాక్ దన్నున్న లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్, అల్–బదర్, అల్‌కాయిదా ఉగ్ర సంస్థల అనుబంధ సంస్థల సభ్యులు, సానుభూతిపరుల నివాసాల్లో సోదాలు జరిగాయి. ద రెసిస్టెన్స్ ఫోర్స్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్–జమ్మూకశ్మీర్, ముజాహిదీన్ గజ్వాత్–ఉల్–హింద్, జమ్మూకశ్మీర్ ఫ్రీడం ఫైటర్స్, కశ్మీర్ టైగర్స్, పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్ అనే ఉగ్రవాద సంస్థలు ఇటీవల కొత్తగా పుట్టుకొచ్చాయి.



చిక్కింది చేప

మిట్టమధ్యాహ్నం మంచి భోజనం దొరికిందని సంబరపడిపోతూ చిట్టి చేపను లాఘవంగా లాగించేస్తున్న నారాయణపక్షి ఇది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండో నగరంలో తీసిందీ ఫొటో. మంగళవారం సిటీలోని ఇవాన్‌హోయీ సరస్సులో ఇలా చేపలను వేటాడే 'గ్రేట్ బ్లూ హెరాన్' కొంగలు వేలాదిగా గుమికూడి తమవిందు కానిస్తూ అక్కడి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
గురువారం । 1 । జూన్ । 2023

యూనిఫాం, గుర్తింపు కార్డు ఉంటే చాలు

– విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

సాక్షి, చెన్నై:పాఠశాల యూనిఫాం ధరించి, గుర్తింపు కార్డులతో బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల వద్ద చార్జీలను వసూలు చేయవద్దని చెన్నై నగర రవాణా సంస్థ బుధవారం ప్రకటించింది. 2023 విద్యా సంవత్సరం ఈనెల7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయడానికి వీలుగా పాస్‌లను రవాణా సంస్థ మంజూరు చేస్తోంది. ఈ ఏడాది విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల నుంచి సేకరించి బస్‌పాస్ సిద్ధం చేసి పంపిణీ చేయడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో నగర రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

220 కిలోల సముద్రపు జలగలు స్వాధీనం

అన్నానగర్: చేరన్‌కోట్టై ప్రాంతంలో బుధవారం వేకువజామున 220 కిలోల సముద్రపు జలగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. రామేశ్వరంలోని చేరన్‌కోట్టై ప్రాంతంలో ప్రభుత్వం నిషేధించిన సముద్రపు జలగలను భద్రపరిచినట్లు అటవీ రక్షణ దళానికి బుధవారం రహస్యసమాచారం అందింది. దీంతో అటవీ రక్షణ దళం, మెరైన్ హై టార్గెట్ ఫోర్స్, యాంటీ పోచింగ్ యూనిట్ సంయుక్తంగా చేరన్‌కోట్టై ప్రాంతంలో గస్తీ నిర్వహించాయి. ఆ సమయంలో చేరన్ పోర్ట్ బీచ్ సమీపంలో ప్రభుత్వం నిషేధించిన సుమారు 220 కిలోల సముద్రపు జలగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో రామేశ్వరం ప్రాంతానికి చెందిన సేతురాం, రామచంద్రన్, తంగస్వామి, సిద్దవేలును అరెస్టు చేశారు. పట్టుబడిన సముద్రపు జలగలను శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది.

2న మద్రాసు వర్సిటీలో డాక్టర్ కాసల ఉపన్యాసం

కొరుక్కుపేట: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో సాహితీవేత్తల జయంతోత్సవాల సందర్భంగా సాహిత్యకారుల జీవన చిత్రాలు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో వక్తగా తెలుగు విశ్రాంత ఆచార్యులు, కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం ఉపన్యాసించనున్నారు. ఈ మేరకు వర్సిటీ తెలుగుశాఖాధ్యక్షులు విస్తాలి శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో ఆచార్య వి.రామచంద్ర జయంతిని జరుపుకోనున్నామన్నారు. ముఖ్యఅతిథిగా జనని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేలు పాల్గొననుండగా, ఉపన్యాకులుగా కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం పాల్గొని ప్రసంగించన్నారని, తెలుగు సాహితీప్రియులంతా హాజరుకావాలని కోరారు.

బైక్- లారీ ఢీ

– ఇద్దరు విద్యార్థుల మృతి

అన్నానగర్: ఊటీ సమీపంలో మంగళవారం సాయంత్రం బైకును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతి చెందారు. వివరాలు.. నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని బాయ్స్ కంపెనీ ప్రాంతానికి చెందిన రిత్విక్ (21). కోతగిరికి చెందిన రిక్సన్ (21) స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాలలో పరీక్ష జరిగింది. పరీక్ష అనంతరం రిత్విక్, రిక్సన్ ఇద్దరూ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రకాశపురం ప్రాంతం నుంచి కేత్తి పాలడ ప్రాంతానికి బైక్‌లో బయలుదేరారు. ఆ ఆ సమయంలో లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రితివ్క్, రిక్సన్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పారిపోయాడు. సమాచారం అందుకున్న కేత్తి పాలడై పోలీసు ఇన్‌స్పెక్టర్ నాగమణి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఇద్దరి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఊటీ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీసీలతో మంత్రి పొన్ముడి భేటీ


పొన్ముడి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీల వీసీలు, కళాశాల ప్రిన్సిపాళ్లతో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్ర విద్యా విధానం రూపకల్పన, కళాశాలలో కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియ తదితర అంశాల గురించి చర్చించారు. అన్నావర్సిటీలో ఈ సమావేశం జరిగింది. ఇందులో అన్నా వర్సిటీ, భారతీ దాసన్, తిరువళ్లూరు, మద్రాసు తదితర 19 వర్సిటీల వీసీలు, ఇంజినీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. కాగా జూన్ 5వ తేదీన అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో ఊటీ వేదికగా సమావేశానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో జాతీయ విద్యావిధానం గురించి చర్చించబోతున్నట్లు తెలిసింది. ఇలాంటి సమయంలో వర్సీటీల వీసీలు, ప్రిన్సిపాళ్లతో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

గుంటలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

సేలం: నీటిగుంటలో మునిగి మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు సీఎం స్టాలిన్ తలా రూ. 2 లక్షలు పరిహారం ప్రకటించారు. వివరాలు.. సేలం జిల్లా నంగవల్లి సమీపంలో ఉన్న విరుదాసంపట్టి మునియప్పన్ కోవిల్ కాడు వలవై ప్రాంతానికి చెందిన సుభాష్ కుమారుడు భరణిధరన్ (15) కందనూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో గత ఏడాది పదో తరగతి చదివాడు. సుభాష్ బంధువు నంగవల్లి కరట్టుపట్టికి చెందిన తంగరాజు కుమారుడు క్రితీష్ (8) కోనూర్ సమత్తువపురం సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదు వుతున్నాడు. పాఠశాలకు సెలవు కావడంతో క్రితీష్ ధరన్ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఆడుకోవాడానికి వెళ్లి తర్వాత ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల గాలించారు. విచారణలో వారు విరుదాసంపట్టి కోవిల్‌కాడు సమీపంలోని నీటి గుంటలో మునిగి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

మేఘదాతుపై వెనక్కి తగ్గం!

కర్ణాటకలో ప్రభుత్వాలు మారినా కావేరి తీరంలోని మేఘదాతు డ్యాం ఏర్పాటుపై మాత్రం వివాదం వీడడం లేదు. తమిళనాడులోకి కావేరి జలాలను అడ్డుకోవడమే లక్ష్యంగా మొన్నటి వరకు కర్ణాటక బీజేపీ పాలకులు డ్యాం అస్త్రంతో దూసుకెళ్లారు. తాజాగా కర్ణాటక పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పాలకులు సైతం అదే నినాదాన్ని అందుకోవడం తమిళ పార్టీల్లో ఆగ్రహాన్ని రేపుతోంది. తాజాగా ఆ రాష్ట్ర డెప్యూటీ సీఎం శివకుమార్ వ్యాఖ్యలపై తమిళనాడు నీటి పారుదల శాఖమంత్రి దురై మురుగన్, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎస్ అళగిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


మేఘదాతు వద్ద ప్రవహిస్తున్న కావేరి నది

- నిన్న బీజేపీ.. నేడు కాంగ్రెస్
- డ్యాం ఏర్పాటుపై అదే నినాదం
- కర్ణాటక డెప్యూటీ సీఎం శివకుమార్ వ్యాఖ్యలపై రగడ
- స్నేహ హస్తం వద్దా: దురై మురుగన్
- వ్యతిరేకిస్తామన్న కేఎస్ అళగిరి
- రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యతన్న పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై : కర్ణాటక – తమిళనాడు మధ్య కావేరి నదీ జల వివాదం గురించి తెలిసిందే. ఏటా కర్ణాటక సర్కారు తమిళనాడుకు 177.25 టీఎంసీల కావేరి నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే, గతంలో ఏటా ఈ నీళ్ల కోసం భగీరథ ప్రయత్నం చేయక తప్ప లేదు. గతంలో కావేరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును కేంద్రంలోని బీజేపీ పాలకులు తుంగలో తొక్కేశారు. ప్రత్యామ్నాయంగా కావేరి యాజమాన్య సంస్థ, కావేరి నదీ జలాల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ముందు ఏటా తమ వాదనల్ని వినిపించుకుని మరీ నీటిని విడుదల చేయించుకోవాల్సిన పరిస్థితి తమిళనాడు ప్రభుత్వానికి తప్పడం లేదు. అయితే, గత మూడేళ్లుగా కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు తమిళనాడు వైపుగా కావేరి ఉధృతంగా ప్రవహించింది. తమిళనాడులోని డెల్టా జిల్లాల వర ప్రదాయిని మేట్టూరు జలాశయం పలు మార్లు పూర్తిగా నిండి ఉబరి నీళ్లు డెల్టా జిల్లాల వైపుగా పరవళ్లు తొక్కింది. అయితే, కావేరి ఉబరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తుండడాన్ని కర్ణాటకను ఏలిన గత బీజేపీ పాలకులు తీవ్రంగానే పరిగణలోకి తీసుకున్నారు. వృథా అవుతున్న నీటిని పరిరక్షించుకుంటామనే నినాదంతో కావేరి తీరంలో కొత్తగా జలాశయం మీద తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. ఈ తీరంలోని మేఘదాతు వద్ద 64 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేందుకు వీలుగా జలాశయ నిర్మాణం మీద దృష్టి పెట్టారు. నిధులు కేటాయించారు. అయితే వీరి చర్యలను గత అన్నాడీఎంకే ప్రభుత్వం, ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వం అడ్డుకుంటూ వచ్చింది.

స్నేహ హస్తం వద్దా?

డీఎంకే సీనియర్ నేత, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్ స్పందిస్తూ, పొరుగున ఉన్న తమిళనాడులో కర్ణాటక పాలకులకు స్నేహ హస్తం వద్దేమో? అని వ్యాఖ్యలు చేశారు. ముందుగా డెప్యూటీ సీఎం బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన వచ్చి రాగానే మేఘదాతు అంశాన్ని, నినాదాన్ని అందుకోవడం శోచనీయమన్నారు. ఆయనకు మేఘదాతులో డ్యాం వ్యవహారం గురించి పూర్తి సమాచారం, వివరాలను అధికారులు తెలియజేయనట్టుందని చమత్కరించారు. అధికారంలోకి వచ్చి, పదవీ బాధ్యతలు చేపట్టి రోజులుగడవక ముందేగా పొరుగు రాష్ట్రాన్ని కయ్యానికి లాగే విధంగా ఆయన వ్యాఖ్యలు చేయడం శోచనీయమని విమర్శించారు. కావేరి జలాలపై తమిళనాడుకు పూర్తి హక్కులు ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ, మేఘదాతులో డ్యాం నిర్మాణానికి అవకాశం ఇవ్వమని తేల్చి చెప్పారు. పొరుగు రాష్ట్రాలతో స్నేహ సంకేతం ఇవ్వాలే గానీ, ఇలా వచ్చి రాగానే వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇక, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి స్పందిస్తూ, కావేరిలో నది తీరంలో ఎలాంటి డ్యాంల నిర్మాణాలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. కర్ణాటక పాలకుల నిర్ణయాలను రాష్ట్ర కాంగ్రెస్ ఆదరించే ప్రసక్తే లేదన్నారు. డ్యాం నిర్మాణాలను అడ్డుకుంటామని, కావేరి జలాల కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. మాజీ సీఎం పన్నీరు సెల్వం పేర్కొంటూ, తమిళనాడు అనుమతి లేకుండా కావేరి తీరంలో ఎలాంటి డ్యాంలను నిర్మించే అధికారం కర్ణాటకకు లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొంటూ, తమిళనాడు కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గతంలో తాము ఢిల్లీ వరకు వెళ్లి మరీ మేఘదాతులో డ్యాం పనులను అడ్డుకున్నామని వివరించారు. ఇప్పుడు కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకుల చర్యలను మరింత తీవ్రంగా తమిళనాడులోని కాంగ్రెస్ నేతలు డ్యాం వ్యవహారంలో ఖండించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టోలో మేఘదాతు అంశాన్ని పొందు పరిచిన నేపథ్యంలో అక్కడి సీఎం, డెప్యూటీ సీఎం ప్రమాణ స్వీకారానికి తమిళనాడు సీఎం స్టాలిన్ వెళ్లడం శోచనీయమన్నారు. ఈ వ్యవహారంలో సీఎం స్టాలిన్ స్పందించాలని , కాంగ్రెస్ చర్యలను ఖండించే విధంగా గళం విప్పాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మంత్రి దురై మురుగన్

ప్రభుత్వం మారినా.. ఒకే నినాదం..

కేంద్రంలోని తమ ప్రభుత్వం ద్వారా అనుమతులు పొంది మేఘదాతులో డ్యాం ఏర్పాటే లక్ష్యంగా కర్ణాటకను ఏలిన గత బీజేపీ పాలకులు చేసిన తీవ్ర ప్రయత్నాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయ పోరాటం ద్వారా ఓ వైపు, కావేరి యాజమాన్య సంస్థ సమావేశం ద్వారా మరోవైపు వ్యతిరేకిస్తూ, ఎదురు దాడి చేస్తూ వచ్చింది. కర్ణాటక ఎత్తులకు పై ఎత్తు వేస్తూ డ్యాంకు అడ్డుకట్ట వేస్తూ వచ్చింది. ఈ సమయంలో కర్ణాటకలో అధికారం మారింది. బీజేపీ పతనంతో డీఎంకే మిత్ర పక్షం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కర్ణాటక కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్య, డెప్యూటీ సీఎం శివకుమార్‌ల ప్రమాణ స్వీకారానికి సీఎం స్టాలిన్ స్వయంగా హాజరై శుభాకాంక్షలు తెలిపి, అభినందించి వచ్చారు. ఈ సమయంలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ రాజకీయ వ్యూహాల అమల్లో కీలక పాత్ర పోషిస్తున్న డీఎంకేకు ఆగ్రహం తెప్పించే పరిస్థితులను కర్ణాటక ప్రస్తుత పాలకులు చేస్తుండటం చర్చకు దారి తీసింది. అధికార పగ్గాలు చేపట్టి రోజుల గడవక ముందు మేఘదాతులో డ్యాం నిర్మించి తీరుతామని కర్ణాటక డెప్యూటీ సీఎం శివకుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తమిళ పార్టీల్లో ఆగ్రహాన్నిరేపాయి. మేఘదాతుల డ్యాం నిర్మాణ పనులు తొలి విడతగా శివకుమార్ చర్చించి ఆచరణలో పెట్టే విధంగా అధికారులకుఅ నేక సూచనలు చేసి ఉండడం డీఎంకేతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతల్లో ఆగ్రహాన్ని రేపింది. శివకుమార్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం నేతలు స్పందించారు.

నవంబర్‌లో దివ్యాంగులకు సామూహిక వివాహాలు

- జూన్ 4 నుంచి 11 ప్రదేశాల్లో స్వయంవరం

కొరుక్కుపేట: చెన్నైకు చెందిన గీతా భవన్ ట్రస్ట్, తమిళనాడు దివ్యాంగుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల ఉచిత సామూహిక వివాహాలు–2023 కార్యక్రమం నవంబర్ 19న నిర్వహించనున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతాభవన్ ట్రస్ట్ అనేక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు దివ్యాంగులకు ఉచిత వివాహాలు చేపడుతోందన్నారు. ఇప్పటి వరకు 559 మంది దివ్యాంగులకు వివాహాలు జరిపించినట్లు తెలిపారు. వివాహం చేసుకున్న ఒక్కో జంటకు దాదాపు 2 లక్షలు విలువ చేసే వస్తువులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జరిగిన ప్రత్యేక ప్రతిభావంతుల వివాహవేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై ఆశీస్సులు అందించారని గుర్తు చేశారు. ఈ ఏడాది నవంబర్ 19న చెన్నైలోని గోపాలపురంలో ఉన్న గీతాభవన్ వేదికగా ప్రత్యేక ప్రతిభావంతుల సామూహిక వివాహాలు జరిపేందుకు నిర్ణయించామన్నారు. దీనికి సంబంధించి జూన్ 4 నుంచి ఆగస్టు 13 వరకు తిరువారూర్, విరుదునగర్,కడలూరు, కోవై, ఈరోడ్, విల్లుపురం , తిరువన్నామలై, వేలూరు, అరియలూరు, మదురై, చెన్నైల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో ఆగస్టు 13న స్వయంవరం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వారు ఆగస్టు 7తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఈ–మెయిల్, పోస్టు ద్వారా పంపించాలని మరిన్ని వివరాలకు 9445198100 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గీతా భవన్ ట్రస్ట్ ట్రస్టీలు కేకే గుప్తా, ఎస్‌కే గోయంకా, రాకేష్ గోయల్, విశాల్ అగర్వాల్, చైర్మన్ ఓం ప్రకాష్ మోదీ, తమిళనాడు దివ్యాంగుల సమాఖ్య నిర్వాహకుడు ఎస్.సీమచంద్రన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మనుగోయల్, సీమచంద్రన్ తదితరులు

రోడ్డు భద్రతే లక్ష్యం

సాక్షి, చెన్నై: గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సిబ్బందికి, విద్యార్థులకు రోడ్డు భద్రతా పరికరాల పంపిణీ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ శంకర్ జివాల్ పాల్గొని ట్రాఫిక్ సిబ్బందికి పరికరాలను అందజేశారు. అలాగే చెన్నైలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి భరతం పట్టే విధంగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన గస్తీ వాహనాన్ని రంగంలోకి దించారు. ఈ వాహనాన్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.


గస్తీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీలంక నుంచి బంగారం స్మగ్లింగ్

- సముద్రంలో గాలింపు
- రూ. 4 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

సాక్షి , చెన్నై: శ్రీలంక నుంచి తమిళనాడులోకి పెద్ద ఎత్తున బంగారం స్మగ్లింగ్ అవుతోన్నట్లు వచ్చిన సమాచారంతో నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ), కోస్టు గార్డ్, సముద్ర తీర భద్రతా విభాగం వర్గాలు తీవ్ర వేటలో నిమగ్నమయ్యారు. రెండు పడవల్లో వచ్చిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 4 కోట్లు విలువ చేసే బంగారాన్ని సీజ్ చేశారు. అయితే వీరు మరింతగా బంగారాన్ని సముద్రంలో పడేశారనే సమాచారంతో గాలింపు ముమ్మరం చేశారు. ఇటీవల కాలంగా శ్రీలంక నుంచి తమిళనాడులోకి బంగారం స్మగ్లింగ్ పెరిగిన విషయం తెలిసిందే. గత కొంత కాలంగా రామనాథపురం జిల్లాదీవుల్లో అనుమానిత పడవలు వచ్చి వెళ్తుండడంతో స్మగ్లింగ్ జోరందుకున్నట్లు తెలిసింది. దీంతో డీఆర్‌ఐ వర్గాలు, కోస్టు గార్డు, సముద్ర తీర భద్రతా విభాగం సమష్టిగా తీరంపై నిఘా ఉంచాయి. ఈ పరిస్థితుల్లో మంగళవారం రాత్రి అందిన సమాచారం మేరకు నిఘా కట్టుదిట్టం చేశారు. రామనాథపురం జిల్లా మండపం పరిసరాల్లోకి అర్ధరాత్రి వేళ వచ్చిన ఓ బోట్‌ను సీజ్ చేశారు. ఇందులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరు వేదారణ్యానికి చెందిన నాజర్, అబ్దుల్, పాంబన్‌కు చెందిన రఫీగా గుర్తించారు. వీరి ఫైబర్ పడవలో ఉన్నబంగారం సీజ్ చేశారు. అలాగే, కీలకరై దీవులలో వీరు బంగారం సముద్రంలో విసిరి వేసినట్లుగా సమాచారం రావడంతో అక్కడ తీవ్రంగా గాలిస్తున్నారు. గజ ఈతగాళ్లు రంగంలోకి దిగారు. అదే సమయంలో వేదాలై తీరానికి వచ్చిన మరో పడవలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచీ బంగారం సీజ్ చేశారు. కాగా స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.4 కోట్లుందని భావిస్తున్నారు.

కేంద్ర మంత్రికి సీఎం లేఖ

- విమానాల కోసం వినతి
- ముగిసిన విదేశీ పర్యటన
- చెన్నైకు తిరుగు ప్రయాణమైన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: జపాన్ టోక్యో– చెన్నై మధ్య, సింగపూర్ – మదురై మధ్య విమాన సేవలకు చర్యలు తీసుకోవాలని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం లేఖ రాశారు. సీఎం ఎంకే స్టాలిన్ తొమ్మిది రోజుల పర్యటనకుగా విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. పలు ఒప్పందాలు, సదస్సులు, సమావేశాలు, చర్చ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. ఈ పర్యటన బుధవారంతో ముగిసింది. సింపూర్, జపాన్ పర్యటనల సమయంలో అక్కడి ప్రతినిధులు చేసుకున్న విజ్ఞప్తికి సీఎం స్పందించారు. ఈమేరకు బుధవారం జపాన్ నుంచి చెన్నైకు తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో కేంద్ర మంత్రికి లేఖ రాశారు. జపాన్ రాజధాని టోక్యో – చెన్నై మధ్య, సింగపూర్ – మదురై మధ్య విమాన సేవలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతాల మధ్య నేరుగా విమాన సేవలకు చర్యలు తీసుకున్న పక్షంలో తమిళనాడు మరింత ప్రగతి పథంలో నడిచేందుకు వీలుందని, పెట్టుబడుల మహానాడుకు పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలను సింగపూర్, జపాన్ నుంచి తరలి వచ్చేందుకు అవకాశాలు ఉన్నట్లు వివరించారు. ఇక, చెన్నైకు తిరుగు పయనం అవుతూ డీఎంకే కార్యాకర్తలకు సీఎం లేఖ రాశారు. ప్రకాశవంతమైన తమిళనాడు నిర్మాణమే లక్ష్యంగా తన పర్యటన జరిగినట్టు అందులో వివరించారు. ఈ పర్యటనలో రూ. 1,258 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 14 ఒప్పందాలు జరిగినట్లు పేర్కొన్నారు. కాగా, చెన్నైకు సీఎం చేరుకున్న తర్వాత రాష్ట్రంలోని డెల్టా జిల్లాల పర్యటనకు వెళ్లేందుకు నిర్ణయించారు. జూన్ ఐదో తేదీ నుంచి ఈ పర్యటన సాగనుందని అధికారులు పేర్కొన్నారు.


జపాన్ నుంచి చెన్నైకు బయలుదేరిన సీఎం

అన్ని రంగాల్లో అగ్రస్థానమే లక్ష్యం

సాక్షి, చెన్నై : భారతదేశం మునుపెన్నడూ లేని విధంగా అన్నిరంగాల్లో అగ్రస్థానమే లక్ష్యంగా అద్భుతమైన పురోగతి సాధిస్తోందని పుదుచ్చేరి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభిప్రాయపడ్డారు. చెన్నై వేదికగా చిన్మయా మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచమంతా ఒక కుటుంబం (వసుదైక కుటుంబం) అనే పేరుతో జీ20 జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు పాల్గొని విద్య, జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలు, క్రీడలు, కళలు, వ్యాపారం–ఆర్థికాభివృద్ధి అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సదస్సుకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, గౌరవ అతిథిగా తుగ్లక్ పత్రిక సంపాదకులు, ఆడిటర్ ఎస్. గురుమూర్తి పాల్గొని ప్రసంగించారు. ముందుగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ... భారతదేశం సంస్కృతికి రాజధానిగా విరాజిల్లుతుందని, మన చరిత్ర, ఆయుర్వేదం, యోగా, కళారూపాలు రోజు రోజుకూ ప్రాచుర్యం పొందుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. భారత్ నిజంగానే వసుదైక కుటుంబం అని పేర్కొంటూ కరోనా మహమ్మారి సమయంలో వ్యాక్సిన్ తయారు చేసి 130 కోట్లు ఉన్న మనదేశ జనాభాకు అందించడమే కాకుండా ఇతర దేశాలకు సాయం చేశామని గుర్తుచేశారు. అనంతరం ఎస్. గురుమూర్తి మాట్లాడుతూ సామరస్య పూర్వకంగా జీవించడానికి ఏకైక మార్గం వసుదైక కుటుంబం అని తెలిపారు. సీనియర్ ఆధ్యాత్మిక గురువు, చిన్మయా మిషన్‌కు చెందిన స్వామి మిత్రానందజీ తోపాటు అంతర్జాతీయ సమన్వయకర్తలు వీరేంద్రగుప్తా, ఇండియన్ కౌన్సిల్ ఫర ఇంటర్నేషనల్ కో- ఆపరేషన్ – ఇండియా డాక్టర్ విక్రాంత్ తోమర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న తమిళిసై సౌందరరాజన్

రాష్ట్రంలో 6.12 కోట్ల మంది ఓటర్లు

- అత్యధికం మహిళలే..
- జాబితా విడుదల చేసిన ఎస్‌ఈసీ

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో మే 31వ తారీఖు నాటికి ఓటర్ల సంఖ్య ఆరు కోట్ల 12 లక్షల 36 వేల 696 మంది ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్ల సంఖ్యే అధికంగా ఉంది. వివరాలు.. కేంద్ర ఎన్నికల కమిషన్ గత ఏడాది తీసుకున్న నిర్ణయం మేరకు జనవరి1వ తేదీ, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1వ తేదీల అర్హతగా 18 ఏళ్లు నిండిన, నిండబోయే వాళ్లు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదుచేసుకోవచ్చు అని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతి మూడు నెలలకు ఓ పర్యాయం ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, చిరునామాల మార్పు తదితర ప్రక్రియలకు కూడా అవకాశం కల్పించారు. ఆ దిశగా ఏప్రిల్ 1వ తేదీ నాటికి వచ్చిన మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు, కొత్తగా పేర్ల నమోదుకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహూ నేతృత్వంలోని బృందం పరిశీలించి జాబితాను సిద్ధం చేసింది. ఈ మేరకు మే 31వ తేదీ నాటికి రాష్ట్రంలో ఉన్న ఓటర్ల వివరాలను బుధవారం సత్య ప్రద సాహూ ప్రకటించారు.


సత్యప్రద సాహూ

ఓటర్ల జాబితా ఇలా..

తాజా జాబితా మేరకు రాష్ట్రంలో పురుష ఓటర్లు 3,01,18,904 మంది, మహిళా ఓటర్లు 3,11,09,813 మంది, ఇతరులు 7,979 మంది ఉన్నారు. ఈ జాబితా మేరకు రాష్ట్రంలో మహిళా ఓటర్లే మళ్లీ అధికంగా ఉన్నారు. సత్యప్రద సాహూ నేతృత్వంలోని ఎన్నికల వర్గాలు విడుదల చేసిన జాబితా మేరకు గత మూడు నెలల కాలంలో మార్పులు చేర్పుల నిమిత్తం 5,123 దరఖాస్తులు స్వీకరించినట్లు వివరించారు. కొత్తగా 23.64 లక్షల మంది తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. 51, 295 మంది చిరునామాల్లో మార్పులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, చిరునామాల్లో గందరగోళం, రెండు చోట్ల పేరు తదితర కారణాలతో 9,11,820 మంది పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని చెంగల్పట్టు జిల్లా షోళింగనల్లూరులో అత్యధికంగా 6,51,077 మంది ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా 69,292 మందితో చెన్నై హార్బర్ నియోజక వర్గం జాబితాలో చివరన ఉంది. ఓటర్ల జాబితాలో 3,400 ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, 4,34,583 మంది ప్రత్యేక ప్రతిభావంతులు, 18 నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన ఓటర్లు 8,80,612 మంది ఉన్నట్లు వివరించారు.

క్లుప్తంగా

బ్లూటూత్ సహాయంతో పరీక్ష

• యువకుడి అరెస్ట్

వేలూరు: టీఎన్‌పీఎస్సీ గ్రూప్ వన్ పోస్టులకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో బ్లూటూత్ పెట్టుకుని కాపియింగ్‌కు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులో 1,083 పోస్టుల భర్తీకి జరిగిన పరీక్షలో భాగంగా వేలూరు జిల్లాలో మొత్తం పది కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాట్పాడి ప్రభుత్వ బాలికల పాఠశాలలో విరుదంబట్టుకు చెందిన అబ్దుల్ బయాస్(27) తన ఎడమ చెవిలో బ్యాండేజి వేసుకుని పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష రాస్తున్న సమయంలో అబ్దుల్ బయాస్ ఎవరితోనో మాట్లాడుతున్నట్లు గుర్తించిన సూపర్‌వైజర్ సరళ అతని చెవులో వేసి ఉన్న బ్యాండేజ్‌ను తీయాలని కోరింది. అనంతరం చెవిలో ఉన్న బ్యాండేజ్‌ను తొలగించి పరిశీలించగా బ్లూటూత్ ఉన్నట్లు గుర్తించారు. బ్లూటూత్ ద్వారా బయట ఉన్న వ్యక్తులకు ప్రశ్నలు తెలియజేసి సమాధానం తీసుకుని పరీక్షలు రాసినట్లు తెలిసింది. దీంతో సరళ కాట్పాడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న అబ్దుల్ బయాస్‌ను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

పెళ్లి కాలేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: మార్తాండం సమీపంలో పెళ్లి కాలేదనే ఆవేదనతో మంగళవారం రాత్రి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. పుదుకోట్టై జిల్లా రాజగోపాలపురం ప్రాంతానికి చెందిన రవి (43). ఇతను బీఎస్ఎన్ఎల్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇందుకోసం మార్తాండం సమీపంలోని చెంగైలో భార్య, బిడ్డతో కలిసి ఉంటున్నాడు. భార్య తమ్ముడు శరవణకుమార్ (19) కూడా వారి వద్దే ఉంటూ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శరవణకుమార్ తనకు పెళ్లి చేయమని బంధువులను తరచూ అడిగేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి శరవణకుమార్ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం ఉదయం చూడగా ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో షాక్‌కు గురైన ఇరుగుపొరుగు వారు వెంటనే అతడిని రక్షించి కులితుర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు శరవణకుమార్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మార్తాండం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం ఆరోగ్యబీమా.. పేదలకు ధీమా



తలసేమియా వారియర్స్‌తో ఐఏఎస్ గోవిందరావు, ప్రీతా రెడ్డి

కొరుక్కుపేట: తమిళనాడు ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం పేదలకు వరప్రసాదంగా మారిందని తమిళనాడు హెల్త్ సిస్టమ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం గోవిందరావు అన్నారు. ఇప్పటి వరకు 10812 మంది పేదలు లబ్ధిపొందారని, దీని కోసం రూ. 804 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. ప్రపంచ తలసేమియా మాసాన్ని పురస్కరించుకుని చెన్నైలోని అపోలో క్యాన్సర్ సెంటర్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం కింద అత్యధిక సంఖ్యలో తలసేమియా బాధిత పిల్లలకు విజయవంతంగా చికిత్స అందించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఏఎస్ అధికారి ఎం.గోవిందరావు, సీఎం బీమా పథకం మెడికల్ సర్వీస్ జాయింట్ డైరెక్టర్ రవిబాబు, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ చంద్రన్‌తోపాటు అపోలో ఆస్పత్రి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి పాల్గొన్నారు. అపోలో క్యాన్సర్ సెంటర్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రేవతిరాజ్ మాట్లాడుతూ.. తలసేమియాతో తీవ్రంగా బాధపడుతున్న దాదాపు 165 మంది చిన్నారులకు సీఎం ఆర్యోగ బీమా పథకం ద్వారా చెన్నై అపోలో క్యాన్సర్ సెంటర్‌లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలు చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . అనంతరం ఎం.గోవిందరావు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో ప్రారంభమైన సీఎం ఆరోగ్యబీమా పథకం పేదలకు వరప్రసాదంగా మారిందని అన్నారు. ఎనిమిది రకాల ట్రాన్స్‌ప్లాంట్‌లకు ఈ పథకం వర్తిస్తోందని తెలిపారు. తలసేమియా చిన్నారులకు సీఎం బీమా పథకం ద్వారా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌లు జరుగుతున్న తొలి రాష్ట్రం తమిళనాడు అని పేర్కొన్నారు.

వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు

ధ్వజారోహణం


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు


అలంకరణలో వేణుగోపాలస్వామి

పళ్లిపట్టు: శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బుధవారం ధ్వజారోహణం నిర్వహించారు. పళ్లిపట్టు సమీపంలోని మేళపూడి గ్రామంలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వైఖాసి బ్రహ్మోత్సవాలకు బుధవారం ఉదయం ధ్వజారోహణం చేశారు. 11 రోజుల పాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూన్ 4న ప్రధానమైన గరుడసేవ, 7న రథోత్సవం నిర్వహిస్తారు. ప్రతిరోజూ భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పొగాకు దూరంగా ఉందాం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

తిరుత్తణి: పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుత్తణిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌టీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ల కళాశాలలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆరోగ్యశాఖ సహాయ డైరెక్టర్ మోహన్, పొగాకు ఉత్పత్తుల నియంత్రణ అధికారి పవిత్ర పాల్గొని పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరించి ప్రతిజ్ఞ చేయించారు.

వీఏఓకు ఆరేళ్ల జైలు


ఏఓ విజయరాఘవులు పిళ్లై

తిరువళ్లూరు: మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అందించే పరిహారం కోసం సిఫార్సు చేయడానికి లంచం తీసుకుని పట్టుబడిన వ్యవహారంలో వీఏఓకు ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరువళ్లూరు జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలుకా కర్లంబాక్కం గ్రామానికి చెందిన సోమసుందరం. ఇతని చిన్నాన్న పండరి మృతి చెందాడు. మృతుడు కుటుంబం ప్రభుత్వ పరిహారం కోసం తాలుకా కార్యాయలంలో దరఖాస్తు చేసుకోగా, సంబంధిత పిటిషన్ విచారణ నిమిత్తం అదే గ్రామానికి చెందిన వీఏఓ విజయరాఘవులు పిళ్లై వద్దకు చేరింది. అయితే పిటిషన్‌ను విచారణ చేసి సానుకూల రిపోర్ట్ ఇవ్వడానికి రూ. వెయ్యి లంచం తీసుకుంటూ 2020లో వీఏఓ విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ కేసులో వీఏఓ అరెస్టు కాగా తిరువళ్లూరు జిల్లా కోర్టులో విచారణ సాగింది. విచారణ ముగిసిన నేపథ్యంలో తిరువళ్లూరు కోర్టు న్యాయమూర్తి వేల్‌రాస్ వీఏఓకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

నగదు అపహరణ కేసులో బీజేపీ నాయకుడి అరెస్టు


అరెస్టయిన మింట్ రమేష్, నాగర్‌కోయిల్ మహేష్

తిరువొత్తియూరు: చెన్నై కొరట్టూరులో రూ. 45 లక్షలు అపహరించి బెదిరింపులకు పాల్పడిన బీజేపీ నాయకుడి సహా ఇద్దరినీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై విల్లివాక్కం 9వ వీధికి చెందిన నారాయణి గత పదవ తేదీ చెన్నై కొరట్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో కొరట్టూర్‌లో ఉన్న 78 సెంట్ల స్థలం విక్రయించడానికి తన స్నేహితుడు సతీష్, బ్రోకర్ ప్రకాష్ రాజ్‌ను సంప్రదించానని తెలిపారు. సుమారు రూ.5 కోట్లు విలువ కలిగిన స్థలాన్ని విక్రయించడానికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడం కోసం బీజేపీ నేత మింట్ రమేష్‌ను కలిసినట్లు పేర్కొన్నారు. దీంతో నాగర్‌కోయిల్ మహేష్‌తో కలిసి మింట్ రమేష్ తన వద్ద రూ. 45 లక్షల తీసుకొని తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై కోరట్టూరు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం నిందితులు మింట్ రమేష్, నాగర్‌కోయిల్ మహేష్‌లను అరెస్టు చేశారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ వెంకటేశన్

వేలూరు: పారిశుద్ధ్య కార్మికుల హౌసింగ్ బోర్డు పనులను వేగవంతం చేయాలని జాతీయ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం వేలూరు కార్పొరేషన్ పరిధిలోని మూడో జోన్ 44వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కోసం నిర్మిస్తున్న హౌసింగ్ బోర్డు పనులను కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం వేలూరు కలెక్టరేట్‌లో వేలూరు జిల్లా పారిశుద్ధ్య కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. కార్మికులకు సక్రమంగా వేతనం ఇస్తున్నారా, పీఎఫ్ నిధులను కేటాయిస్తున్నారా, వైద్య సదుపాయం కల్పిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తాట్కో పథకం ద్వారా తక్కువ వడ్డీతో రుణాలను అందజేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని పేర్నంబట్టు మున్సిపాలిటీలో పని చేస్తున్న ఏడుగురు కార్మికులకు రూ. 24.89 లక్షలతో సంక్షేమ పథకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు అందజేయాలని, చేతికి గ్లౌజులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ రత్నస్వామి, అధికారులున్నారు.

పోర్ తొళిల్ పార్టు-2 లోనూ నటించాలనుంది



పోర్ తొళిల్ చిత్ర యూనిట్

తమిళసినిమా: అప్లాస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఈ 4 ఎక్స్‌పిరిమెంట్స్, ఎప్రియస్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం పోర్ తొళిల్. విఘ్నేష్‌రాజా దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నటుడు శరత్‌కుమార్, అశోక్ సెల్వన్, నటి నిఖిలా విమల్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 8వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం చిత్ర యూనిట్ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటుడు అశోక్ సెల్వన్ మాట్లాడుతూ 2017లో ఈ చిత్ర మూల కథ గురించి తాను దర్శకుడు విఘ్నేష్ రాజా చర్చించుకున్నామన్నారు. తామిద్దరం క్లాస్‌మేట్స్ అని చెప్పారు. విఘ్నేష్ రాజా చాలా టాలెంటెడ్ పర్సన్ అని అన్నారు. తను కథ చెబితే చాలా బాగుంటుందన్నారు. పోర్‌తొళిల్ చిత్ర కథనాలు విభిన్నంగా ఉంటాయన్నారు. ఇంతకుముందు అనేక క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రాలు వచ్చినా వాటికి భిన్నంగా ఈ చిత్రం ఉంటుందన్నారు. ఇందులోని రెండు ప్రధాన పాత్రలను చాలా చక్కగా దర్శకుడు తీర్చిదిద్దారని చెప్పారు. అప్పుడే శిక్షణ పూర్తి చేసుకుని డ్యూటీలో జాయిన్ అయిన పోలీసు అధికారి, సీనియర్ పోలీసు అధికారి వారి ఈగో మధ్య సీరియల్ కిల్లర్ మిస్టరీని ఎలా చేధించారన్నదే ఈ చిత్ర కథ అని చెప్పారు. తన కల్పన కథను దర్శకుడు ఎలా సమర్థంగా తల్లి అన్న సందేహం కలిగిందని, చిత్రం చూసిన తరువాత దర్శకుడి ప్రతిభ, శ్రమ కనిపిస్తుందని చెప్పారు. వ్యక్తిగతంగా చెప్పాలంటే భవిష్యత్‌లో విఘ్నేష్ రాజా ప్రముఖ ఇండియన్ దర్శకుల్లో ఒకరు అవుతారని అన్నారు. నటుడు శరత్‌కుమార్‌తో కలిసి నటించడం మంచి అనుభవం అన్నారు. కాగా పోర్‌తొళిల్ చిత్రం రెండవ భాగంలో నటించాలన్న ఆసక్తి కలుగుతోందని అశోక్ సెల్వన్ పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

నా ఇష్టాన్ని ఇప్పుడే గమనిస్తున్నారు



రెజీనా చిత్ర యూనిట్

తమిళసినిమా: ''చిన్న వయసు నుంచే నేను స్టేజి ఆర్టిస్టుగా పలు నాటకాల్లో నటించాను. అందుకే నాకు ఎప్పుడు వైవిధ్యభరిత కథా పాత్రలో నటించడం ఇష్టం. మొదటి నుంచి నేను ఇదే చెబుతున్నాను. అయితే నా ఇష్టాన్ని ఇప్పుడే పలువురు గ్రహించడం మొదలెట్టారు. నీర్పార్వై, వంశం, సిలుక్కరుపట్టి వంటి పలు చిత్రాలతో పాటు వెబ్ సిరీస్‌లోనూ వైవిధ్యభరితమైన, అదే సమయంలో ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉండే పాత్రల్లోనే నటిస్తున్నాను. ఒక సాధారణ యువతి ఎలా అసాధారణ స్థాయికి చేరుకుంది? కఠినమైన పరిస్థితులను ఎలా అధిగమించిందనే ఇతివృత్తంతో రూపొందిన కథా చిత్రం రెజీనా. ఇందులోను నా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది'' అని నటి సునయన చెప్పింది. ఈమె ప్రధాన పాత్రను పోషిస్తున్న చిత్రం రెజీనా. దీన్ని ఎల్లో బీయర్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ నిర్మిస్తున్నారు. ఈయనే సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ దర్శకుడు డోమిన్ డి.సెల్వ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఆడియో కార్యక్రమాన్ని మంగళవారం కోవైలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటి సునయన పై విధంగా పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో కోవై జిల్లా పోలీసు కమిషనర్ వి.బాలకృష్ణన్, శ్రీకృష్ణ స్వీట్స్ చైర్మన్ ఎం.కృష్ణన్, శ్రీ బాబా థియేటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాగా ఈ చిత్ర ఆడియో హక్కులను టైమ్స్ మ్యూజిక్ సంస్థ పొందింది.

లెట్స్ గెట్ మ్యారీడ్!

తమిళసినిమా: కుటుంబ నేపథ్యంలో రూపొందే ఫీల్ గుడ్ కథా చిత్రాలకు ప్రేక్షకుల మధ్య ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అలాంటి కథా చిత్రమే లెట్స్ గెట్ మ్యారీడ్. ఏంటి చిత్రం పేరు కొత్తగా ఉందనుకుంటున్నారా? ఇప్పటి వరకు ఎల్‌జీఎం పేరుతో ప్రచారంలో ఉన్న చిత్రం పూర్తి పేరు లెట్స్ గెట్ మ్యారీడ్. ప్రముఖ భారతీయ క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్ ధోని సమర్పణలో ఆయన సతీమణి సాక్షి ధోని చిత్ర నిర్మాణం రంగంలోకి ప్రవేశించి నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. నటుడు హరీష్ కల్యాణ్, నటి నదియ, యువనా, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ద్వారా రమేష్ తమిళమణి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కాగా చిత్రం షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. తాజాగా సెకండ్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీనికి మంచి స్పందన వస్తుందని చిత్ర వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. చిత్ర షూటింగ్ ప్రణాళిక ప్రకారం పూర్తి చేసినట్లు నిర్మాణ సాక్షి ధోని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇది మంచి ఫీల్‌గుడ్ మూవీగా ఉంటుందని చెప్పారు. చక్కని వినోదంతో అనుబంధాలను ఆవిష్కరించే మంచి కుటుంబ కథా చిత్రంగా ఎల్‌జీఎం చిత్రం ఉంటుందని తెలిపారు. ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


ఎల్‌జీఎం చిత్ర సెకండ్ లుక్ పోస్టర్

కృతిశెట్టి క్రేజ్ మామూలుగా లేదుగా!


కృతిశెట్టి

తమిళసినిమా: ప్రస్తుతం లక్ అంటే నటి కృతిశెట్టిదే. ఈ 19 ఏళ్ల కన్నడ బ్యూటీ ఇప్పటికీ నటించింది ఆరేడు చిత్రాలే. అందులో తెలుగులో విజయం సాధించిన చిత్రాలు సగం కూడా లేవు. ఇక తమిళంలో ఎంట్రీ ఇచ్చిన రెండు చిత్రాలు (ది వారియర్, కస్టడీ) నిరాశపరిచాయి. లక్కీగా బాలా దర్శకత్వంలో నటించాల్సిన చిత్రం నుంచి బయటపడింది. కాగా కృతిశెట్టికి అవకాశాలు మాత్రం ఈ రెండు భాషల్లోనూ వెతుక్కుంటూ రావడం విశేషం. ముఖ్యంగా తమిళంలో స్టార్ హీరోలతో నటించే అవకాశాలు వస్తున్నాయి. ఇక్కడ నటుడు సూర్యతో నటించే అవకాశం మిస్ అయిన త్వరలో ఆయన సోదరుడు కార్తీతో జతకట్టే అవకాశం వచ్చినట్లు సమాచారం. అదేవిధంగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించనున్న తాజా చిత్రంలో విజయ్ సరసన నటించే లక్కీ చాన్స్ ఈమెకు వరించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. కాగా తాజాగా నటుడు విశాల్‌తో రొమాన్స్ చేసే అవకాశం ఈ అమ్మడి తలుపు తట్టినట్లు తెలిసింది. ఇంతకుముందు ప్రశాంత్ దర్శకుడు పాండిరాజ కాంబినేషన్లో రూపొందిన కథాకళి చిత్రం 2016లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. కాగా సుమారు ఏడాది తరువాత ఈ కాంబో రిపీట్ కాబోతోంది. ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెలలో తిరుచ్చిలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. కాగా ఇందులో విశాల్‌కు జంటగా నటి కృతిశెట్టి నటింప చేయడానికి చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. కాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

ఎంగేజ్‌మెంట్ అయ్యిందా?

తమిళసినిమా: నటి అనుపమ పరమేశ్వరన్‌కు ఎంగేజ్‌మెంట్ అయ్యిందా? ఆమె అభిమానులను ఇప్పుడు పట్టి పీడిస్తున్న అనుమానం ఇదే. అందుకు కారణం లేకపోలేదు. 2015లో ప్రేమమ్ అనే మలయాళ చిత్రం ద్వారా సినీ పరిశ్రమకు పరిచయమైంది. ఆ చిత్ర విజయం ఈమె దశను మార్చేసింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు అనుపమ పరమేశ్వరన్ బాగా ఓన్ చేసుకున్నారని చెప్పక తప్పదు. అక్కడ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు భాషను కూడా నేర్చుకుంది. అదే విధంగా తమిళంలోనూ ధనుష్ జంటగా కోడి, అధర్వ సరసన తల్లి పోగాదే వంటి చిత్రాల్లో నటించింది. ఇక మాతృభాషలో నటిస్తున్న ఈమె బహుభాషా నటిగా రాణిస్తున్నారు. ఇటీవల నటుడు నిఖిల్ సిద్ధార్థ్‌తో జత కట్టిన కార్తికేయ-2 తెలుగుతో పాటు హిందీలోనూ సంచలన విజయం సాధించింది. అలా బాలీవుడ్ ప్రేక్షకులను పరిచయం అయిన అనుపమ ప్రేమ వ్యవహారంపై కూడా 10 రకాల వార్తలు ఉన్నాయి. ముఖ్యంగా స్టార్ క్రికెటర్ బుమ్రాతో ప్రేమాయణం అంటూ వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే ఇటీవల ఆయన తన ప్రేయసిని పెళ్లి చేసుకోవడంతో ఆ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా నటి అనుమప పరమేశ్వరన్ ఒక ప్లాస్టిక్ పేపర్‌ను ఉంగరంగా తయారు చేసి తన వేలికి తొడుక్కుని తన ఎంగేజ్‌మెంట్ ఉంగరం అంటూ ఇన్‌స్ట్రాగామ్‌లో పేర్కొంది. దీంతో తమ అభిమాన నటి పెళ్లికి సిద్ధమైందా అంటూ అభిమానులు తెగ కలవరపడిపోతున్నారు. అయితే ఆమె సరదాగా అలా చేసినట్లు పేర్కొనడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కొందరు నెటిజన్లు మాత్రం పెళ్లి తలపుల్లో అనుపమ. ఆ రహస్య ప్రేమికుడు ఎవరో? అంటూ వైరల్ చేస్తున్నారు. కాగా ఈ 27 ఏళ్ల పరువాల సుందరి ప్రస్తుతం తమిళంలో నటుడు జయం రవి, కీర్తిసురేష్‌లతో కలిసి సైరన్ చిత్రంలో నటిస్తోంది.


నటి అనుపమ పరమేశ్వరన్

క్లుప్తంగా

రూ.38 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో బుధవారం వేకువజామున షార్జాకు అక్రమంగా తరలించేందుకు యత్నించిన రూ.38 లక్షల విదేశీ కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి విమానాశ్రయం నుంచి బుధవారం వేకువజామున షార్జాకు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న విమానంలో ప్రయాణికులను తనిఖీ చేశారు. ముగ్గురిపై అనుమానం రావడంతో విడివిడిగా తనిఖీ చేశారు. వారి హ్యాండ్ బ్యాగ్‌లో దాచిన అమెరికా డాలర్, దుబాయ్ దిర్హామ్, సౌదీ రియాల్ సహా రూ.37.93 లక్షల విలువైన విదేశీ నగదును స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.

యువతిని వ్యభిచార కూపంలో దించేందుకు యత్నం

- ఇద్దరి అరెస్టు


కార్తీక్


కుగన్

తిరువళ్లూరు: ఉద్యోగం కోసం వచ్చిన యువతిని లాడ్జీకి తీసుకెళ్లి వ్యభిచార కూపంలోకి దించడానికి యత్నించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసిన పోలీసులు మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా కొరట్టూరుకు చెందిన యువతి(23) పెద్దపాళ్యం వెళ్లి ఉద్యోగ అన్వేషణ ప్రారంభించింది. యువతి ఉద్యోగం కోసం వెతుకున్న విషయాన్ని గమనించిన ఇద్దరు యువకులు ఆమెను నమ్మించి ఉద్యోగం ఇప్పిస్తామని లాడ్జీకి తీసుకెళ్లారు. అనంతరం మెస్సీ(23), కార్తీక్(32), లాడ్జీ నిర్వాహకుడు కుగన్(24) యువతిని బలవంతం చేసి వ్యభిచార కూపంలోకి దించడానికి యత్నించారు. నిరాకరించిన యువతిపై దాడి చేయడంతో పాటు హత్య చేస్తామని బెదిరింపులకు దిగారు. యువతిపై దాడి చేస్తున్న సమయంలో అటు వైపు వెళ్తున్న పెద్దపాళ్యం పోలీసులు కార్తీక్, కుగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మెస్సీ కోసం గాలిస్తున్నారు.

ఇంజినీరింగ్ చదవడం ఇష్టంలేక బలవన్మరణం

అన్నానగర్: ఇంజినీరింగ్ చదవడం ఇష్టం లేక ఓ విద్యార్థి మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తేని అల్లినగరం సమీపంలోని అన్నంజి బాలాజీ నగర్‌కు చెందిన జయరామన్ కుమారుడు కిషోర్ కుమార్ (18) ప్లస్–2 ప్రభుత్వ సాధారణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. తదుపరి చదువుల కోసం ఆండిపట్టిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించారు. మంగళవారం రాత్రి ఇంటిలోని ఓ గదికి లోపలి నుంచి తాళం వేసి అక్కడే చదువుకుంటున్నాడు. అయితే చాలా సేపటికి తలుపులు తెరవలేదు. అనుమానం వచ్చిన జయరామన్ గది తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లాడు. కిషోర్‌కుమార్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. జయరామన్ అల్లినగరం పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ సుభయ్యన్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇంజినీరింగ్ చదవడం ఇష్టం లేకనే కిషోర్ కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు మగ పిల్లలు

అన్నానగర్: శివగంగై ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు మగ పిల్లలకు జన్మనిచ్చింది. విరుదునగర్ జిల్లా తిరుచూళి సమీపంలోని వీరచోళన్ గ్రామానికి చెందిన దురై మురుగన్ భార్య మహేశ్వరి (24) గర్భం దాల్చడంతో ప్రసవం కోసం శివగంగ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. గత నెల ఆమెకు ప్రసవ నొప్పి వచ్చింది. వైద్యులు స్కానింగ్ చేసి కడుపులో ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో సర్జరీ చేశారు. ఇందులో మహేశ్వరి ముగ్గురు మగపిల్లలకు జన్మనిచ్చింది. పిల్లల బరువు 1.5 నుంచి 1.7 కిలోలు ఉన్నాయి. శిశు సంక్షేమ విభాగాధిపతి రాజ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వనిత, బాలసుబ్రమణ్యం చిన్నారులను ఇంక్యుబేటర్‌లో ఉంచారు. తల్లీ పిల్లలను బుధవారం డిశ్చార్జ్ చేశారు.

రూ.కోటి విలువైన డ్రగ్స్ స్వాధీనం

అన్నానగర్: పుదుచ్చేరి నుంచి చెన్నైకి రూ.కోటి విలువైన డ్రగ్స్‌ను తరలిస్తున్న నాగైకి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. వివరాలు.. పుదుచ్చేరి నుంచి విదేశాలకు మద్యం, డ్రగ్స్ అక్రమ రవాణ జరగకుండా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పుదుచ్చేరి పక్కనే ఉన్న చిన్న మొదలియార్‌వాడి చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఇళంగో నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం పుదుచ్చేరి నుంచి చెన్నై వెళ్తున్న తమిళనాడు ప్రభుత్వ బస్సులో సోదాలు చేశారు. అప్పుడు బసులో ఓ వ్యక్తి చేతిలో బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కూర్చొన్నాడు. అతని బ్యాగ్‌ను పరిశీలన చేయగా బ్యాగ్‌లో హెరాయిన్ ఉండడంతో షాక్‌కు గురయ్యారు. అనంతరం అతడిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారణలో అతడు నాగైకి చెందిన అలీదుల్లా (55)గా తేలింది. అతడి వద్ద నుంచి 10 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ కోటి రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నాలుగో మార్గం పనులకు మోక్షం

- బీచ్ – చేపాక్కం మధ్య ఎంఆర్‌టీఎస్ సేవలు రద్దు
- దక్షిణ రైల్వే నిర్ణయం


బీచ్ - ఎగ్మూర్ రైల్వే మార్గం

సాక్షి, చెన్నై: ఎగ్మూర్ – బీచ్ రైల్వే స్టేషన్ మధ్య నాలుగో రైల్వే మార్గం పనులకు మోక్షం లభించింది. ఈ పనుల దృష్ట్యా, ఏడు నెలల పాటు బీచ్ – చేపాక్కం మధ్య ఎంఆర్‌టీఎస్ రైలు సేవలు రద్దు కానున్నాయి. ఈ రైళ్లు చేపాక్కం నుంచి వేళచ్చేరి వైపుగా గురువారం బయలు దేరనున్నాయి. వివరాలు.. చెన్నైలో సెంట్రల్ తదుపరి, ఎగ్మూర్ రెండో అతి పెద్ద రైల్వే టెర్మినల్‌గా ఉన్న విషయం తెలిసిందే. అలాగే తాంబరంను మూడో టెర్మినల్‌గా తీర్చిదిద్దారు. సెంట్రల్‌లో రైళ్ల రద్దీని తగ్గించేందుకు వీలుగా తాంబరం, ఎగ్మూర్‌ల నుంచి ప్రస్తుతం ఉత్తరాది వైపుగా రైలు సేవలు అధికం చేశారు. ఈ రైళ్లలన్నీ ఎగ్మూర్ నుంచి బీచ్ మార్గం మీదుగా సెంట్రల్ నుంచి తిరువళ్లూరు, అరక్కోణం, గుమ్మిడిపూండి వైపుగా వెళ్లే రైల్వే లేన్ మార్గంలో కలపడం జరుగుతోంది. అయితే ఎగ్మూర్ నుంచి బీచ్ వైపుగా 4.3 కి.మీ దూరం మూడు రైల్వే మార్గాలు ఉన్నాయి. ఇందులో రెండు మార్గాల ఎలక్ట్రిక్ రైళ్ల సేవలకు ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఒకే మార్గంలో ఉత్తరాది వైపుగా వెళ్లే రైళ్లు, సరుకులతో వచ్చే గుడ్స్‌ల పాటు ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాక పోకలు జరుగుతున్నాయి. నాలుగో మార్గానికి గతంలో నిర్ణయించినా స్థల సేకరణ సమస్యగా మారింది. ఎట్టకేలకు అన్ని ప్రక్రియలు ముగించారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ పనులకు రూ. 96.70 కోట్లు కేటాయించారు. దీంతో పనులపై దక్షిణ రైల్వే అధికారులు దృష్టి పెట్టారు. 4.3 కి.మీ దూరం నాలుగో రైల్వే మార్గం పనులకు కార్యాచరణ సిద్ధం చేశారు. అదే సమయంలో బీచ్ నుంచి ఎగ్మూర్ – తాంబరం – చెంగల్పట్టు మార్గంలో ఎలక్ట్రిక్ రైళ్లు, బీచ్ – చేపాక్కం – వేళచ్చేరి వైపుగా ఎంఆర్‌టీఎస్ రైళ్ల సేవలు జరుగుతున్నాయి. ఇందులో నాలుగో మార్గం పనుల కారణంగా ఎంఆర్‌టీఎస్ రైళ్ల సేవలకు ఆటంకం తప్పడం లేదు. ఈ దృష్ట్యా, జూన్ 1వ తేదీ నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు 7 నెలల పాటుగా బీచ్ – చేపాక్కం మధ్య ఎంఆర్‌టీఎస్ రైళ్ల సేవలు రద్దు చేశారు. ఎంఆర్‌టీఎస్ రైళ్లు ఇక, చేపాక్కం నుంచి బయలుదేరి వెళ్తాయి. వేళచ్చేరి నుంచి చేపాక్కం వరకు మాత్రమే ప్రయాణిస్తాయని దక్షిణ రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

నవ వధువు అనుమానాస్పద మృతి

తిరువొత్తియూరు: ప్రేమ వివాహం చేసుకున్న యువతి 21 రోజుల్లోనే అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని తీసుకోవడానికి తిరస్కరించి బంధువులు ఆందోళనకు దిగారు. కోవై సిరువాని రోడ్డు మద్వరాయపురం కురింజి నగర్‌కు చెందిన సంజయ్ (20) పేరూరులో ఉన్న కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన రాణి (20)తో పరిచయం ఏర్పడి ప్రేమకు దారి తీసింది. తల్లిదండ్రులు వ్యతిరేకత తెలపడంతో మే 8వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో తన కుమార్తె కనబడలేదని రాణి తల్లిదండ్రులు సెల్వరాయపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రాణి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రాణి, సంజయ్‌లు వేలాంగనికి వెళ్లి అక్కడ ఒక ఆలయంలో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సంగతి తెలుసుకున్న పోలీసులు ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. జూన్ 24వ తేదీ వివాహ రిసెప్షన్ జరిగింది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన రాణి స్పృహ తప్పింది. దీంతో ఇరుగు పొరుగువారు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్ష చేసి మృతి చెందినట్లు తెలిపారు. బంధువులు రాణి మృతదేహాన్ని తీసుకోవడానికి నిరాకరించి ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం రిపోర్ట్ తర్వాత విషయం తెలుస్తుందని పోలీసులు వారికి సర్దిచెప్పారు.

వైద్య విద్యార్థినిపై లైంగిక వేధింపులు


నల్లబ్యాడ్జీలతో విద్యార్థుల నిరసన

కొరుక్కుపేట: చెంగల్‌పట్టు ప్రభుత్వాసుపత్రిలో గత కొన్ని రోజులుగా ఓ ట్రైనీ వైద్య విద్యార్థినిని తోటి వైద్యుడు లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో బుధవారం ఉదయం 100 మందికి పైగా ట్రైనీ వైద్యులు పనులను బహిష్కరించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వివరాలు.. చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కాలేజీలో చదువుతున్న 1,000 మందికి పైగా జూనియర్ ట్రైనీలు పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ శిక్షణలో నిమగ్నమై ఉన్నారు. ఈక్రమంలో ఆస్పత్రి గది తలుపులు వేసి ట్రైనీ డాక్టర్‌గా పని చేస్తున్న జూనియర్‌ను తోటి వైద్యుడు లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిసింది. దీంతో క్యాంపస్‌లోని జూనియర్ 100 మంది విధులు బహిష్కరించి వైద్యుడి తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. దీంతో అధికారులు ట్రైనీని లైంగికంగా వేధించిన తోటి వైద్యుడిని పిలిపించి అందరి ముందు క్షమాపణలు చెప్పించారు. అయితే లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెబితేనే నిరసన విరమిస్తామని ట్రైనీలు స్పష్టం చేశారు. దీంతో చెంగల్‌పట్టు ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అల్లేరి కొండకు రూ. 5.5 కోట్లతో రోడ్డు


అల్లేరి కొండపై రోడ్డు ఏర్పాటుకు సర్వే చేస్తున్న అధికారులు

వేలూరు: వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గంలోని పింజమండై, జార్దాన్‌కొల్లై పాలంబట్టు వంటి అటవీ ప్రాంత పంచాయతీల్లో సుమారు 120కి పైగా గ్రామాలున్నాయి. ఇక్కడ సుమారు 30 వేల మంది ఉంటున్నారు. రోడ్డు వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికైనా ఉన్నఫలంగా అనారోగ్యం క్షీణిస్తే డోలి కట్టి కొండ కిందకు తీసుకురావాల్సిన పరిస్థితి. గత వారం అల్లేరి గ్రామానికి చెందిన అనుష్క అనే చిన్నారిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు రోడ్డు వసతి లేకపోవడంతో చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో చిన్నారి మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి అంబులెన్స్ ద్వారా గ్రామానికి తీసుకెళ్లలేక కొండ కిందనే వదిలి పెట్టి వెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు సుమారు 10 కి.మీ దూరం భుజంపై వేసుకుని కాలి నడకన తీసుకెళ్లారు. కలెక్టర్ కలెక్టర్ కుమరవేల్ పాండియన్, అధికారులు కొండ ప్రాంతాన్ని నేరుగా సందర్శించి రోడ్డు వేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు. దీంతో అధికారులు మొదటి విడతగా కొండ కింద ఉన్న వరతాలం పట్టు గ్రామం నుంచి అల్లేరి గ్రామం వరకు 6.5 కిలో మీటరు దూరం మూడు మీటర్లు వెడల్పుతో రోడ్డు ఏర్పాటు చేసేందుకు సర్వే పనులను చేపట్టారు. అదే విధంగా అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ. 5.5 కోట్లతో రోడ్డు వేసేందుకు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

ఎట్టకేలకు చిక్కిన ఎలుగుబంటి

తిరువొత్తియూరు: కల్లకాడు గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని ఎట్టకేలకు బోనులో బంధించారు. వివరాలు.. నెల్‌లై జిల్లా ముండందురై పులుల సంరక్షణ కేంద్రంలో పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, అడవి దున్నలు, జింకలు తదితర అటవీ జంతువులు ఉన్నాయి. కొన్ని జంతువులు ఆహారం కోసం, నీళ్ల కోసం తరచూ అటవీ ప్రాంతంలో నుంచి గ్రామంలోకి చొరబడుతున్నాయి. ఎలుగు బంట్లు గ్రామంలోకి వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో అటవీశాఖ సిబ్బంది కల్లకాడు గ్రామం పరిసరాల్లో బోనులను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఆహారం కోసం వచ్చిన ఎలుగు బంటి బోనులో చిక్కింది. అలాగే అదే ప్రాంతంలో మరో రెండు బోన్లలో రెండు ఎలుగుబంట్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు.

దంత వైద్య సదస్సు


కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడాంటిక్స్ విభాగం నేతృత్వంలో సవీత ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నికల్ సైన్సెస్‌లో 2023 సంవత్సరానికి గాను ఇన్నో వేషన్‌ఇన్ రిస్టోరేటివ్ డెంటిస్ట్రీ- బీ బాండెడ్ బీ బయోమిమెటిక్ పేరుతో కంటిన్యూయింగ్ డెంటల్ ఎడ్యుకేషన్ సదస్సు బుధవారం జరిగింది. ఇందులో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తీయనీశ్వరన్, కోల్‌కతాకు చెందిన డాక్టర్ దిశా అగర్వాల్ నేతృత్వంలో పరిశోధక అభ్యర్థులు, విద్యార్థులకు దంత వైద్య శ్రేణి, చికిత్స తదితర అంశాల గురించి సమగ్రంగా వివరించారు. - సాక్షి, చెన్నై

ట్రాక్టర్ చక్రం కిందపడి బాలుడి మృతి


వరదరాజన్ (ఫైల్)

తిరువొత్తియూరు: మేనమామతో కలిసి పొలం పనులకు వెళ్లి ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతిచెందిన విషాదకర ఘటన దిట్టక్కుడిలో జరిగింది. కడలూరు జిల్లా దిట్టకుడి సమీపంలోని పెరుమాళ్ గ్రామానికి చెందిన రేఖ (34), పళనివేలు (43) దంపతుల కుమారుడు వరదరాజన్ (10). పళనివేలు బహ్రెయిన్‌లో పనిచేస్తున్నాడు. రేఖ పెరుమునై గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. వరదరాజన్ తిట్టకుడిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. బాలుడి మేనమామ మనిగండన్ (28) కొత్త ట్రాక్టర్ కొన్నాడు. దాన్ని మనిగండన్ బంధువు దినేష్ పొలం దున్నడానికి తీసుకెళ్లాడు. వరదరాజన్ ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్నాడు. పొలం దున్నుతున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. అతని తలపై ట్రాక్టర్ చక్రం ఎక్కి దిగడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కర్పూరం అంటుకుని గాయపడ్డ మహిళ మృతి


వరలక్ష్మి (ఫైల్)

తిరువళ్లూరు: అమ్మవారి ఆలయంలో కర్పూరం అంటుకుని తీవ్రంగా గాయపడిన మహిళ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తిరువళ్లూరు జిల్లా ఆరణి బజార్ వీధికి చెందిన వెంకటరత్నం భార్య వరలక్ష్మి(58) ఆరణిలోని భవాని అమ్మవారికి మే 26న నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో కర్పూరం వెలిగించారు. అయితే ఆమె చీరకు కర్పూరం అంటుకోవడంతో క్షణాల్లో మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కీళ్‌పాక్కం వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అజ్ఞాతంలో ఉన్న నిందితుడి అరెస్టు


మునుస్వామి

తిరువొత్తియూరు: హత్య కేసులో బెయిల్‌పై విడుదలై వచ్చి నాలుగేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై మాధవరం రెట్టేరి వంతెన సమీపంలో 2019 మే నెలలో కొలత్తూరు కన్నగిరి చెందిన అస్లాం బాషా (49) హత్యకు గురయ్యాడు. అదే ఏడాది జూన్‌లో మూలకడైకి చెందిన బాలాజీ (39) హత్యకు గురయ్యాడు. ఈ హత్యలకు సంబంధించి అదే ప్రాంతానికి చెందిన మునుస్వామి (39)ని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి జైల్లో పెట్టారు. బెయిల్‌పై బయటకు వచ్చిన మునుస్వామి కోర్టుకు హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. మునుస్వామిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. కొలత్తూరు డిప్యూటీ కమిషనర్ శక్తి వేలు, పోలీస్ కమిషనర్ ఆదిమూలం నేతృత్వంలో మంగళవారం మాధవరం మంజంబాక్కం వద్ద మునుస్వామిని అరెస్టు చేశారు.

అంత్యక్రియలు చేసిన మరుసటి రోజే ఇంట్లో ప్రత్యక్షం

- శవాన్ని బయటకు తీసి డీఎన్‌ఏ టెస్టుకు పంపిన పోలీసులు


సాక్కమ్మాల్ (ఫైల్)

తిరువళ్లూరు: తల్లి మృతి చెందిందని భావించి అంత్యక్రియలు నిర్వహించిన మరుసటి రోజే ఆమె ప్రాణంతో ఇంటి వద్ద ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా సేలైకండ్రిగ గ్రామానికి చెందిన సాక్కమ్మాల్(56)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం సేలై కండ్రిగలోని చిన్న కుమారుడు శరవణన్ వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం సాక్కమ్మాల్‌కు, ఎదురింటి మహిళకు ఘర్షణ ఏర్పడింది. ఈ ఘర్షణలో సాక్కమ్మాల్ స్వల్పంగా గాయపడడంతో అలిగి చెన్నైలో ఉంటున్న పెద్ద కుమారుడు గాంధీ వద్దకు వెళ్లిపోయింది. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో పచ్చరంగు చీర, ఎరుపు రంగు జాకెట్‌ను ధరించినట్లు తెలిసింది. బుధవారం తిరువళ్లూరు జిల్లా పుట్లూరు రైల్వే ట్రాక్‌పై అదే కలర్ దుస్తులతో వృద్ధురాలి మృతదేహం గుర్తు తెలియని రీతితో కనిపించింది. మృతదేహంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వార్త పలు దినపత్రికల్లో రావడంతో మృతి చెందిన వృద్ధురాలు సాక్కమ్మాల్‌గా భావించిన ఆమె చిన్నకుమారుడు శరవణన్ ఈ రైల్వే పోలీసుల నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చి బంధువులకు సమాచారం ఇచ్చాడు. చెన్నైలో ఉన్న గాంధీకి సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించారు. అయితే గాంధీకి, శరవణన్‌కు మధ్య మాటలు లేకపోవడంతో గాంధీ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మే 28వ తేదీ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా సాక్కమ్మాల్ సోమవారం ఉదయం శరవణన్ ఇంటి వద్దకు రావడంతో కలకలం రేపింది. సాక్కమ్మాల్ ప్రాణంతో వచ్చారన్న విషయం తెలియడంతో జనం పెద్ద ఎత్తున గుమికూడారు. దీనిపై రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతి చెందిన మహిళ తన తల్లిగా భావించి అంత్యక్రియలు నిర్వహించామని, ప్రస్తుతం తన తల్లి ప్రాణంతో ఇంటికి వచ్చిందని సమాచారం అందించాడు. దీంతో రైల్వే పోలీసులు శరవణన్‌ను పిలిపించి విచారణ చేపట్టారు. విచారణలో మృతి చెందిన మహిళ సాక్కమ్మాల్ కాదని నిర్ధారించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ అంబిక, ఆర్‌ఐ గణేష్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికి తీశారు. డీఎన్‌ఏ టెస్టు కోసం నమూనాలను సేకరించారు. విచారణలో మృతి చెందిన మహిళ రెడ్‌హిల్స్‌కు చెందిన ఏలుమలై భార్య శకుంతలమ్మాల్(66)గా గుర్తించారు.

కూతురికి నిప్పు అంటించి తల్లి ఆత్మాహుతి

- కుమార్తె పరిస్థితి విషమం

అన్నానగర్: మాంగాడు సమీపంలో మానసిక వైకల్యంతో బాధపడుతున్న కూతురిపై కిరోసిన్ పోసి నిప్పు అంటించి తర్వాత తల్లి కూడా ఆత్మహుతి చేసుకుంది. కూతురు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. వివరాలు.. మాంగాడు సమీపంలోని కోల్పాక్కానికి చెందిన సులోచన (48). ఈమెకి కుమార్తె మీనాక్షి (18). కుమారుడు కూడా ఉన్నారు. కూతురు మీనాక్షి పుట్టినప్పటి నుంచి మానసికంగా, శారీరకంగా కుంగిపోయింది. తల్లి సులోచన ఆమె బాగోగులు చూసుకుంటోంది. అయితే కుమార్తెకు యుక్త వయస్సు రావడంతో పాటు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండడంతో సులోచన తీవ్ర మనోవేదనకు గురైనట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో బుధవారం కొడుకు ఇంటిలో లేని సమయంలో మీనాక్షిపై సులోచన కిరోసిన్ పోసి నిప్పు అంటించి అనంతరం సులోచన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. వారి అరుపులు విని ఇరుగుపొరుగు వారు పరుగులు తీశారు. ఇద్దరి శరీరాలపై నీళ్లు పోసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అనంతరం ఇద్దరినీ చెన్నైలోని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే తల్లి సులోచన మృతి చెందింది. కూతురు మీనాక్షికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు మాంగాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య



మోహన్, మల్లిక (ఫైల్)

వేలూరు: వేలూరు జిల్లా గుడియాత్తం తాలుకా అలంగానెల్లూరు మోటూరుకు చెందిన రైతు మోహన్(50), ఇతని భార్య మల్లిక(47) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడున్నారు. వివాహం కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. కాగా మోహన్‌కు అప్పులు చేయడంతో ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో దంపతులు ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో లత్తేరి–కాట్పాడి రైల్వే పట్టాల వద్దకు వచ్చారు. ఆ సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబై వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ముందు రావడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న జోలార్‌పేట రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

తిరువొత్తియూరు: మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని భర్తను హత్య చేసిన భార్య బుధవారం ఉదయం పోలీసులకు లొంగిపోయింది. ఈరోడ్‌లో జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. కనిరౌత్తర్ కుళంలోని జామియా మసీదు వెనుక రోడ్డుకు చెందిన సుబ్రమణి (52) నేత కార్మికుడు. ఇతని భార్య పద్మ (52). వీరి కుమారుడు సురేష్. అతనికి పెళ్లయి వేరుగా జీవిస్తున్నాడు. సుబ్రమణికి మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న పద్మ మందలించింది. అయినా ఆమెతో సంబంధాన్ని కొనసాగించాడు. దీని కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన పద్మ ఇంట్లోని కర్రతో సుబ్రమణి తలపై కొట్టింది. తీవ్ర గాయంతో సుబ్రమణి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పద్మ ఇంటికి తాళం వేసుకుని ఈరోడ్‌లోని వీరప్పన్‌ఛత్రం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. పోలీసులు మృతదేహాన్ని ఈరోడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి ప్రిన్సిపల్ ఆత్మహత్య

తిరువొత్తియూరు: మధురైలో రైలు కింద పడి కళాశాల ప్రిన్సిపల్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మధురై విలాంకుడి రైల్వేగేట్ వద్ద 35 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు సమాచారం అందింది. సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. విచారణ చేయగా అతను కోవై జిల్లా నల్వార్ నగర్‌కు చెందిన సుభాష్ కృష్ణన్ అని, ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇతనికి మధురై అన్నానగర్‌కు చెందిన భార్య షణ్ముఖ ప్రియా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విభేదాలు రావడంతో ఏడాది క్రితం విడిపోయారు. వీరి విడాకులు సంబంధించి కేసు మదురై కోర్టులో జరుగుతోంది. ఈ క్రమంలో సుభాష్ కృష్ణన్ జీవితంపై విరక్తి చెంది సోమవారం కోవై నుంచి కారులో మధురైకి వెళ్లాడు. విచారణకు హాజరై తర్వాత భార్యకు సంబంధించిన నగలను అన్నానగర్‌లో ఉన్న ఆమె ఇంటిలో అప్పగించారు. తరువాత విలన్గుడి రైల్వేస్టేషన్ గేటు వద్దకు వచ్చి చెన్నై నుంచి మధురైకి వస్తున్న తేజస్ రైలు ముందు పరిగెత్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

లంచం కేసులో రిటైర్డ్ ఎస్‌ఐకి రెండేళ్ల జైలు

అన్నానగర్: తంజావూరు జిల్లా పాపనాశం సమీపంలోని ఆదనూరుకు చెందిన సెల్వరాజ్ దంపతులు తన భార్యపై దాడి చేశారని 2008 ఆగస్టు 15న అదే వీధికి చెందిన షణ్ముగం (36) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే ఏడాది డిసెంబర్ 30న మద్యం మత్తులో సెల్వరాజ్ తనను దూషించారని కబిస్తలం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీనిపై చర్యలు తీసుకునేందుకు రూ.500 లంచం ఇవ్వాలని అప్పటి ఎస్‌ఐ స్వామిదురై అడిగాడు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని షణ్ముగం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు ఎస్‌ఐకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు విచారణ మంగళవారం కుంభకోణం చీఫ్ క్రిమినల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. కేసును విచారించిన న్యాయమూర్తి షణ్ముఖప్రియ స్వామిదురైకి రెండేళ్ల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధించారు. తదనంతరం స్వామిదురైని తిరుచ్చి సెంట్రల్ జైలులో ఉంచారు.

అత్తను చంపిన కోడలి అరెస్టు

తిరువొత్తియూరు: అత్తను ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేసిన కోడలిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్‌లై సమీపంలోని వడుగన్‌పట్టికి చెందిన షణ్ముఖ వేలు (64) పాల వ్యాపారి. ఇతని భార్య సీతాలక్ష్మి (59). వీరికి మారియప్పన్ అనే కుమారుడు, మహాలక్ష్మి అనే కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమై భర్తతో ఉంటోంది. మారియప్పన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య మహాలక్ష్మి (25). వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మారియప్పన్ తల్లిదండ్రుల ఇంటికి సమీపంలో మరో ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తరచూ అత్త కోడలు మధ్య నగల వ్యవహారానికి సంబంధించి గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున షణ్ముఖ పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కోడలు మహాలక్ష్మి మగ దుస్తులు వేసుకుని షర్టు, ప్యాంట్ ధరించి తలకు హెల్మెట్ వేసుకుని ఇనుప రాడ్డుతో నిద్రపోతున్న అత్త సీతా లక్ష్మిపై దాడి చేసి పారిపోయింది. తీవ్ర గాయాలైన సీతాలక్ష్మి స్పృహ తప్పింది. ఇంటికి వచ్చిన షణ్ముఖ వేలు భార్య నిర్జీవంగా పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన డాక్టర్లు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేసి అక్కడున్న సీసీటీవీ కెమెరాల ఆధారంగా కోడలే అత్తపై దాడి చేసినట్లు గుర్తించారు. మహాలక్ష్మిని అరెస్టు చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,871 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,859 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.3.27 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా...

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

కరీంనగర్ కల్చరల్: ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య కరీంనగర్ పద్మనగర్‌లో బుధవారం సాయంత్రం శ్రీనివాసుడి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అంతకుముందు మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పద్మావతి అమ్మవారికి పద్మశాలీలు ఊరేగింపుగా సారె తీసుకొచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు శ్రీవారి కల్యాణాన్ని జరిపారు.

రాజ్‌భవన్‌లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయించారు. జూన్ 2న ఉదయం 9 గంటలకు రాజ్‌భవన్‌లో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలుత స్వాతంత్ర్య సమరయోధులను గవర్నర్ ఘనంగా సత్కరించనున్నారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఓపెన్ హౌజ్ నిర్వహించి దర్బార్ హాల్‌లో సామాన్య ప్రజలతో శుభాకాంక్షలను ఇచ్చిపుచ్చుకోనున్నారు.

ఈడీ కక్షపూరితంగా వ్యవహరిస్తోంది: అంజన్



సాక్షి, న్యూఢిల్లీ: యంగ్ ఇండియాకు విరాళాలు ఇచ్చిన కేసులో తాను ఎలాంటి తప్పు చేయలేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. విచారణ పేరుతో బడుగు బలహీన వర్గాలపై ఈడీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈడీ నోటీసులు జారీ చేయడంతో బుధవారం అంజన్‌కుమార్ యాదవ్ ఢిల్లీలో ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఈడీ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు అంజన్‌కుమార్ యాదవ్ వివరణ ఇచ్చారు. అనంతరం అంజన్‌కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ...యంగ్ ఇండియా సంస్థ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనే స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చానన్నారు. అంతేగాక నేషనల్ హెరాల్డ్ కేసులో కక్షసాధింపు చర్యలో భాగంగానే ఈడీ కాంగ్రెస్ నేతలను విచారిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా సంస్థకు రూ.20 లక్షలు విరాళం ఇచ్చానని, తన వద్ద అన్ని లెక్కలు ఉన్నాయని తెలిపారు. తాను గతంలో ఎంపీగా పనిచేశానని, తనకు పెన్షన్ కూడా వస్తోందన్న విషయాన్ని ఈడీ అధికారులకు గుర్తు చేశానని చెప్పారు.

ప్రతి ఏటా సీఎం కప్

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో సీఎం కప్ ఎంతో చైతన్యాన్ని నింపిందని, ఇక నుంచి ప్రతి ఏటా సీఎం కప్ క్రీడా సంబరాలను నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా జరుగుతున్న సీఎం కప్ వేడుకలు బుధవారం ఎల్బీస్టేడియంలో ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...సీఎం కప్ పోటీలు యువతను ఛాంపియన్లుగా మలిచాయని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, వచ్చే ఏడాది నుంచి సీఎం కప్‌లో క్రికెట్‌ను కూడా భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, అసలైన క్రీడాకారులకు గుర్తింపు రావడం లేదన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

60% ఉద్యోగులు పాల్గొనాలి!

- రేపు సచివాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం
- జాతీయ జెండా ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 60 శాతం మంది తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. హెచ్‌ఓడీల కార్యాలయాల నుంచి ఉద్యోగులను తరలించడానికి ప్రభుత్వం బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జూన్ 2న ఉదయం 10.30 గంటలకు సీఎం కేసీఆర్ సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో విభాగాధిపతుల కార్యాలయాల్లో ఉదయం 7.30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని, అనంతరం అక్కడి నుంచి సచివాలయంలో జరిగే కార్యక్రమానికి తరలిరావాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు 10 వేల మందికిపైగా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది.

సచివాలయంలో ఉత్సవాలపై రిహార్సల్స్..

తెలంగాణ అవతరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో రిహార్సల్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.



మిక్స్‌డ్ వెదర్‌తో మహా డేంజర్!

- ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్షాలతో మారిపోతున్న వాతావరణం
- ఇన్ఫెక్షన్లు సోకేందుకు, వైరస్‌ల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు
- సీజనల్ వేరియేషన్స్‌తో పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం వేసవి కాలం చివరి రోజుల్లో ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రమంతా ఉదయం నుంచే 40 నుంచి 45 డిగ్రీల ఎండలు హీటెక్కిస్తున్నాయి. వడగాడ్పులతోపాటు అప్పుడప్పుడు సాయంత్రం అకస్మాత్తుగా గాలివాన కురియడంతో వాతావరణం చల్లబడుతోంది. అదీగాక వేసవి సీజన్ ముగిసిపోతుండటంతో ఎండలు చండప్రచండంగా మారుతున్నాయి. త్వరలోనే రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించవచ్చని వాతావరణ శాఖ నివేదికలున్నా.. ప్రతీ ఏడాది ఇవి ఆలస్యంగానే వస్తున్నాయి. అందువల్ల మరికొన్ని రోజుల పాటు ఇలాంటి 'మిక్స్‌డ్ వెదర్'తోనే ప్రజలు నెట్టుకురాక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి వాతావరణంలో బ్యాక్టీరియాలు, వైరస్‌లు చురుగ్గా ఉండి దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల ప్రజలు జాగ్రత్తగా మసలుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని సూచిస్తున్నారు.

వ్యాధినిరోధక శక్తి పెంచుకోవాలి

అటు వేడి, ఇటు చల్లదనం వంటి మధ్యస్థ వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్‌లు యాక్టివ్‌గా ఉంటాయి. మన శరీరాలు కూడా అటు వేడికి, ఇటు చల్లటి వాతావరణానికి అలవాటు పడటానికి కొంత సమయం తీసుకుంటుంది. అలాంటి సమయం కోసం వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేచిచూసి దాడిచేస్తాయి. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలు, గొంతు సంబంధిత ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ల వంటివి వచ్చే అవకాశాలు అధికమవుతాయి. ఇలాంటి వాటికి ఆహారాన్నే ఔషధంగా మార్చుకుని తిప్పికొట్టాలి. ఫ్రైడ్ పదార్థాలు, జంక్‌ఫుడ్ వంటివి మానేయాలి. అప్పటికప్పుడు వేడిగా తయారుచేసిన ఆహారపదార్థాలు తీసుకోవాలి. వేడి చేసి చల్లార్చిన నీరు లేదా పరిశుభ్రమైన నీటిని తాగాలి. తేలికపాటి వ్యాయామం చేయాలి. ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడే వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలి.



డా.ప్రభుకుమార్ చల్లగాలి, జనరల్ ఫిజిషియన్, లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్



డా.హరికిషన్ గోనుగుంట్ల, చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆసుపత్రి

నీటిని ఎక్కువగా తాగాలి

తీవ్ర ఎండ వేడిమి నుంచి చల్లటి వాతావరణానికి మారినపుడు అనేక జబ్బులు వ్యాపిస్తాయి. ఇంకా తీవ్రమైన ఎండలు కొనసాగుతున్నందున వడదెబ్బ తగులకుండా, డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా నీటిని తాగడంతోపాటు సహజమైన పళ్లరసాలు వంటివి తీసుకోవాలి. దోమలు, ఎలుకలు వంటి వాటి ద్వారా నీరు.. గాలి ద్వారా ఇన్ఫెక్షన్లు, వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. బ్యాక్టీరియల్, ఫంగల్, వైరల్ ఇన్ఫెక్షన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం నీటిలో తడిచిన ప్రతీసారి ఫ్రెష్‌గా స్నానం చేయాలి. ఏడాదికోసారి ఫ్లూవ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి.

ధూపదీప నైవేద్య భృతి రూ.4 వేలు పెంపు

రూ.6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటన

- కొత్తగా 2,796 దేవాలయాలకూ వర్తింపు
- అనువంశిక అర్చకుల సమస్యలకు త్వరలో పరిష్కారం
- వేద పండితుల భృతి రూ. 5 వేలకు పెంపు
- మల్లినాథ సూరి ఊరు కొల్చారంలో సంస్కృత విశ్వవిద్యాలయం



బ్రాహ్మణ సదనాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్వరూపానందేంద్ర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బ్రాహ్మణులపై సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. ఆలనాపాలనా లేని ఆలయాల్లో నిత్య పూజల కోసం ధూపదీప నైవేద్య పథకం కింద అర్చకులకు నెలకు రూ.6 వేల చొప్పున ఇస్తున్న భృతిని రూ.10 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 3,645 దేవాలయాలకు వర్తిస్తున్న ధూపదీప నైవేద్య పథకాన్ని మరో 2,796 ఆలయాలకూ వర్తింపచేయనున్నట్టు చెప్పారు. గోపనపల్లిలో 9 ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదనాన్ని కేసీఆర్ పలువురు పీఠాధిపతుల సమక్షంలో బుధవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగిస్తూ.. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కొన్ని అంశాలనూ పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. అనువంశిక అర్చకుల విధానాన్ని పునరుద్ధరించాలంటూ కొన్నేళ్లుగా అర్చక కుటుంబాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దీనిపై కేబినెట్‌లో చర్చించి త్వరలో పరిష్కరించనున్నట్టు హామీ ఇచ్చారు. వేద పాఠశాలల నిర్వహణకు ఇస్తున్న రూ.2 లక్షలను ఇకనుంచి వార్షిక గ్రాంటుగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఐటీఎం, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. ప్రస్తుతం బ్రాహ్మణ పరిషత్ ద్వారా వేద పండితులకు ప్రతి నెలా ఇస్తున్న గౌరవ భృతిని రూ.2,500 నుంచి రూ.5,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. అలాగే, ఈ భృతిని పొందే అర్హత వయసును 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తున్నట్టు చెప్పారు. తన సంజీవని వ్యాఖ్యతో మహాకవి కాళిదాసు సాహిత్య ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహామహోపాధ్యాయ కోలాచల మల్లినాథ సూరి పేరున ఆయన స్వస్థలమైన మెదక్ జిల్లాలోని కొల్చారంలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

సర్వజన సమాదరణ

'లోకా సమస్తా సుఖినోభవన్తు అన్నది బ్రాహ్మణుల నోట పలికే జీవనాదర్శం. సర్వజన సమాదరణ అన్నది తెలంగాణ ప్రభుత్వ విధానం, పేదరికం ఎవరి జీవితాల్లో ఉన్నా వారిని ఆదుకోవాలనే మానవీయ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. కులానికి పెద్దలైనా బ్రాహ్మణుల్లో ఎంతోమంది పేదలున్నారు. వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతగా భావించింది. అందుకే 2017లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటు చేసింది. ఏడాదికి రూ.వంద కోట్ల నిధులను దానికి కేటాయిస్తున్నాం. ఈ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. పేద బ్రాహ్మణుల జీవనోపాధి నిమిత్తం బెస్ట్ (బ్రాహ్మణ ఎంపవర్‌మెంట్ స్కీం ఆఫ్ తెలంగాణ స్టేట్) పథకం కింద రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఇప్పటివరకు రూ.150 కోట్లను వెచ్చించింది' అని సీఎం కేసీఆర్ వెల్లడించారు. సనాతన సంస్కృతి కేంద్రంగా 'బ్రాహ్మణ సదనం'ను నిర్మించిన తొలి రాష్ట్రం తెలంగాణనే అని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చే పీఠాధిపతులు, ధర్మాచార్యుల విడిది కేంద్రంగా, పేద బ్రాహ్మణ వివాహాలకు ఉచిత కల్యాణ వేదికగా, కులాలతో ప్రమేయం లేకుండా పేదలు తమ ఇంట్లో శుభాశుభ కార్యక్రమాలకు పురోహితులను ఉచితంగా పంపే సేవాకేంద్రంగా విలసిల్లాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. వివిధ క్రతువులు, ఆలయ నిర్మాణాలు, ఆగమశాస్త్ర నియమాలు, దేవతా ప్రతిష్టలు వివిధ వ్రతాలకు సంబంధించిన పుస్తకాలతో సమగ్రమైన లైబ్రరీ ఈ సదనంలో ఏర్పాటు చేయాలని కోరారు. వైదిక కార్యక్రమాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలు, డిజిటల్ వీడియోలు అందులో ఉంచాలన్నారు. సూర్యాపేటలో డాక్టర్ ఎ.రామయ్య ఇచ్చిన ఎకరం స్థలంలో నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఖమ్మం, మధిర, బీచుపల్లి ప్రాంతాల్లోనూ బ్రాహ్మణ భవనాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. బ్రాహ్మణ సదనం ప్రారంభం సందర్భంగా శృంగేరీ పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామి, కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆడియో సందేశ రూపంలో ఆశీర్వదించారంటూ వారితోపాటు ప్రత్యక్షంగా విచ్చేసిన ఇతర పీఠాధిపతులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మస్య జయోస్తు!
అధర్మస్య నాశోస్తు
ప్రాణిషు సద్భావనాస్తు
విశ్వస్య కళ్యాణమస్తు..

ఓం శాంతి.. శాంతి.. శాంతిః అన్న శ్లోకంతో సీఎం ప్రసంగాన్ని ముగించారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి సబిత, సీఎస్ శాంతికుమారి, స్వరూపానందేంద్ర స్వామి తదితరులు

యాగంలో పాల్గొన్న సీఎం

బుధవారం ఉదయం తొలుత సదనానికి చేరుకున్న సీఎం కేసీఆర్ నేరుగా యాగశాలకు వచ్చి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎంకు శంఖనాదం, వేద పఠనం మధ్య వారు తలపాగా, శాలువాలతో ఆశీర్వదించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులను పలకరించారు. ప్రాంగణంలో కొనసాగుతున్న చండీయాగం, సుదర్శనయాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. తర్వాత వాస్తుపూజ నిర్వహించారు. బ్రాహ్మణ సదనం శిలాఫలకాన్ని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆవిష్కరించగా సీఎం పాల్గొన్నారు. ఆ తర్వాత భవన ప్రారంభానికి సూచికగా కేసీఆర్ రిబ్బన్ కత్తిరించి లోనికి వెళ్లి పరిశీలించారు. సభాస్థలిలో పీఠాధిపతులను సత్కరించి వారికి పాదాభివందనం చేశారు. పుష్పగిరి పీఠం విద్యానృసింహ భారతీస్వామి, మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం సుభుధేంద్ర తీర్థస్వామి, మదనానంద సరస్వతీ పీఠం మాధవానంద స్వామి, హంపీ విరూపాక్ష పీఠం విద్యారణ్య భారతీ స్వామి, ధర్మపురి పీఠం సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి, సీతారాంబాగ్ జగన్నాథ మఠం వ్రతధర రామానుజ జీయర్ స్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి సబిత, ఎంపీలు సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా, వాణీదేవి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, సతీశ్, బాల్క సుమన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జస్టిస్ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ శ్రీశారదా పీఠాధిపతితో సీఎం కేసీఆర్ భేటీ

మియాపూర్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం గోపన్‌పల్లిలో స్వామీజీలతో కలసి బ్రాహ్మణ సేవా సదన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మరోసారి ప్రత్యేకంగా స్వరూపానందేంద్ర స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసేందుకు చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వచ్చారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ఆలయానికి చేరుకొని స్వామీజీతో ఆధ్యాత్మిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. స్వరూపానందేంద్ర స్వామీజీ, సీఎం కేసీఆర్‌కు ఆశీస్సులతోపాటు వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. కేసీఆర్ చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రావడం.. స్వామీజీతో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎంపీ సంతోష్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వరూపానందేంద్ర స్వామితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



బుధవారం శంషాబాద్‌లోని జేడీ కన్వెన్షన్స్‌లో జరిగిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి కుమారుడు అభిలాష్ రెడ్డి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్

జూన్ రెండో వారంలో రాష్ట్రానికి నైరుతి రాక!

- వచ్చే వారంలో కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఈసారి సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు కాస్త ఆలస్యంగా ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ అంచనావేస్తోంది. గత రెండు సీజన్లతో పోలిస్తే ప్రస్తుతం పది నుంచి పదిహేను రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా విశ్లేషిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈనెల రెండో వారంలో రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. ఈనెల మొదటి వారంలో కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు సాగుతూ తెలంగాణకు చేరుకునేందుకు వారం రోజుల నుంచి పది రోజుల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ సైతం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. గత రెండు సీజన్లలో రుతుపవనాల రాకను పరిశీలిస్తే.. 2021 వర్షాకాలంలో నైరుతి రుతుపవనాలు మే నెలాఖరులో కేరళను తాకగా.. జూన్ మూడో తేదీ నుంచి ఆరో తేదీ మధ్య రాష్ట్రాన్ని తాకాయి. అదేవిధంగా గతేడాది మే 30వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు రాష్ట్రానికి జూన్ 8వ తేదీకి చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఐదు రోజులు ఆలస్యంగా రానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు.

సాధారణ వర్షపాతం..

జూన్ ఒకటవ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ మధ్య కాలాన్ని నైరుతి సీజన్(వానాకాలం)గా భావిస్తారు. ఈ క్రమంలో నాలుగు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సగటున 75.19 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలు తయారు చేసింది. అయితే గత రెండేళ్లుగా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 50 శాతం అధిక వర్షాలు కురిశాయి. 2021లో రాష్ట్రంలో 111.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, 2022 సీజన్‌లో 109.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే అధిక వర్షాలు నమోదు కావడంతో రాష్ట్రంలో చెరువులు, కుంటలు నీటితో నిండుకుండలుగా మారాయి.

స్థిరంగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

రెండు రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ విదర్భ నుంచి మరాఠ్వాడ, ఉత్తర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ఉపరితలద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా చెదురుమదురుగా, కొన్ని చోట్ల మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదు కావచ్చని వివరించింది. కాగా, వివిధ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల సెల్సియస్ నుంచి 42 డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదు కావొచ్చని, గ్రేటర్ హైదరాబాద్ పరిసర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 41 డిగ్రీల మధ్యన నమోదు కావచ్చని తెలిపింది.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	41.5	22.4	మహబూబ్‌నగర్	40.0	26.1
నిజామాబాద్	40.9	28.3	రామగుండం	39.2	24.4
భద్రాచలం	40.8	26.0	హైదరాబాద్	38.9	25.4
మెదక్	40.8	24.0	హకీంపేట్	38.5	24.9
ఆదిలాబాద్	40.3	26.2	దుండిగల్	38.0	23.1
ఖమ్మం	40.2	25.2	హనుమకొండ	38.0	23.0

కేంద్రం ఆధ్వర్యంలో ఆవిర్భావ ఉత్సవాలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- రాష్ట్రంలో 'కల్వకుంట్ల' వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్–బీఆర్ఎస్ కుట్ర




సాక్షి, న్యూఢిల్లీ: గతేడాది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఢిల్లీలో నిర్వహించామని, ఈసారి గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహిస్తున్నామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. రేపు గోల్కొండ కోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతోపాటు సాయుధ బలగాల పరేడ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో శంకర్ మహదేవన్, డాక్టర్ ఆనంద శంకర్ బృందం, మంజులా రామస్వామి బృందం ప్రదర్శనలు ఉంటాయన్నారు అలాగే, మంగ్లీ, మధుప్రియలు తెలంగాణ సంప్రదాయాన్ని, ఉద్యమాన్ని ప్రతిబింబించే పాటలు పాడతారని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాజ్‌భవన్లలోనూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

కుటుంబపాలనకు చరమగీతం

రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడితే తమకు నష్టమని బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. అయితే, అవినీతి, నియంతృత్వ, కుటుంబపాలనకు చరమగీతం పాడాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో బీజేపీ నేతల మధ్య విభేదాల్లేవని, కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ వివాదాలను సృష్టిస్తున్నారన్నారు. బీజేపీలో చేరిన నాయకులు బీజేపీలోనే ఉంటారని, పార్టీ కోసమే రోజూ పోరాడుతున్నారని స్పష్టత ఇచ్చారు. రాబోయే రోజుల్లో అనేక మంది నాయకులు తమ పార్టీలో చేరనున్నారని చెప్పారు. తొమ్మిదేళ్లలో తెలంగాణకు కేంద్రం అందించిన సహకారాన్ని వివరిస్తూ త్వరలోనే ప్రజలముందు పూర్తి వివరాలతో ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని.. ఈ విషయంలో విభేదాలకు తావిచ్చేలా, ప్రజలను రెచ్చగొట్టేలా ఎవరూ వ్యాఖ్యానించవద్దని హితవు పలికారు. దక్షిణ భారతం–ఉత్తర భారతం అంటూ విభేదాలను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న వారికి.. కేంద్ర ప్రభుత్వం 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'పేరుతో చేపడుతున్న కార్యక్రమాలు కనిపించడం లేదా? అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాగా, ఇటీవల పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతిష్ఠించిన పవిత్ర రాజదండం 'సెంగోల్'రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన తమిళనాడులోని తిరువడుత్తురై ఆధీనానికి ప్రస్తుత పీఠాధిపతి శ్రీ అంబలవాన పండారా సన్నిధి స్వామి కిషన్‌రెడ్డిని కలిసి ఆశీర్వదించారు.

నేడు హైదరాబాద్‌కు కేటీఆర్

- 20 రోజులపాటు యూకే, యూఎస్‌లో సాగిన పర్యటన
- విదేశీ పర్యటన, దశాబ్ది ఉత్సవాలపై నేడు మీడియాతో భేటీ



సాక్షి, హైదరాబాద్: సుమారు 20 రోజులపాటు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికాలో పర్యటించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, కేటీ రామారావు గురువారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ నెల 10న యూకే పర్యటనకు వెళ్లిన కేటీఆర్ తిరిగి 15న హైదరాబాద్‌కు వచ్చి ఫాక్స్‌కాన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 16న అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. సుమారు పది రోజులపాటు పదుల సంఖ్యలో వివిధ కంపెనీలతో కేటీఆర్ నేతృత్వంలోని బృందం సమావేశమైంది. తన పర్యటనలో యూకే, యూఎస్ పర్యటనల్లో భాగంగా లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, హ్యూస్టన్, హెండర్సన్, బోస్టన్‌లలో 80కి పైగా సమావేశాల్లో కేటీఆర్ పాల్గొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఐటీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, ఏరోస్పేస్, రక్షణ, లైఫ్ సైన్సెస్, మెడికల్ డివైజెస్, డిజిటల్ సొల్యూషన్స్, ఇన్నోవేషన్, డేటా సెంటర్, ఆటోమోటివ్, ఈవీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఈ భేటీల్లో చర్చించారు. ఆయా కంపెనీల పెట్టుబడి ప్రకటనలతో 42,000 మందికి రాష్ట్రంలో ప్రత్యక్ష, ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించారు. యూకే, యూఎస్ పర్యటన విశేషాలతోపాటు దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ఇతర అంశాలపై గురువారం మధ్యాహ్నం కేటీఆర్ మీడియాతో భేటీ అవుతారు.

సమాధానాలు లేకుంటే పరుగెత్తడమే: కేటీఆర్

'భాగ్ మిల్కా భాగ్' గురించి విన్నా.. కానీ ఇదేంటి 'భాగ్ మంత్రి భాగ్'.. నీ వద్ద సమాధానాలు లేనప్పుడు ప్రజలను, మీడియాను ఎదుర్కోలేవు'అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. రెజ్లర్ల అంశంపై మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి పరిగెత్తిన వీడియోను ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇంతగా ఆరాటపడుతోంది. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా రక్షిస్తున్నారు. మరోవైపు రెజ్లర్లు తమ ఒలింపిక్ పతకాలను గంగా నదిలో నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది సిగ్గుపడాల్సిన విషయం'అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

WORLD MILK DAY
JUNE 1, 2023

వరల్డ్ మిల్క్ డే


● అక్షాలి షా

విజయంలో సగపాలు

'పాడి రంగంలో మన దేశంలో మూడొంతుల మంది స్త్రీలే పని చేసి విజయం సాధిస్తున్నారు' అని గత సంవత్సరం 'వరల్డ్ డెయిరీ సమ్మిట్'లో ప్రధాని నరేంద్రమోడి అన్నారు. పశు పోషణ చేసి, పాలు పితికి, ఆదాయ మార్గాలు వెతికి విజయం సాధిస్తున్న మహిళలు ఎందరో నేడు ఆ మాటను నిజం చేస్తున్నారు. నేడు 'వరల్డ్ మిల్క్ డే' 'ఎంజాయ్ డెయిరీ ప్రాడక్ట్' అనేది థీమ్. 'పరాగ్ మిల్క్ ఫుడ్స్' పేరుతో డెయిరీ ప్రాడక్ట్స్ దేశంలోనే అగ్రశ్రేణిగా నిలిచింది అక్షాలి షా.

32 ఏళ్ల అక్షాలి షా నేడొక దేశంలో ఉంటే రేపు మరో దేశంలో ఉంటుంది. ఏ దేశంలో పాడి రంగం ఎలా అభివృద్ధి చెందుతున్నదో, పాడి ఉత్పత్తులలో ఎలాంటి సాంకేతికత చోటు చేసుకుంటున్నదో నిత్యం అధ్యయనం చేస్తూ ఉంటుంది. ఆ మార్పులను తాను అధినాయకత్వం వహిస్తున్న 'పరాగ్ మిల్క్ ఫుడ్స్' సంస్థలో ప్రవేశపెడుతూ ఉంటుంది. అందుకే ఇవాళ ప్యాకేజ్డ్ పాల రంగంలో, డెయిరీ ఉత్పత్తుల రంగంలో పరాగ్ సంస్థ అగ్రగామిగా ఉంది. అందుకు పూర్తి క్రెడిట్ అక్షాలి షాకు దక్కుతుంది.

గడప చెంతకు ఆవుపాలు

అక్షాలికి పూణెలో గోక్షేత్రం ఉంది. 2011 నాటికి అక్కడి ఆవుల నుంచి పాలు పితికి, కేవలం ఆవుపాలు కోరే 172 మంది ఖాతాదారులకు అందించేవారు. అక్షాలి రంగంలోకి దిగాక శ్రేష్ఠమైన ఆవు పాల కోసం దేశంలో కోట్ల మంది ఖాతాదారులు ప్రయత్నిస్తుంటారని అర్థం చేసుకుంది. 'ప్రైడ్ ఆఫ్ కౌస్' పేరుతో ప్రీమియమ్ ఆవుపాలను అందించడానికి ముందుకు వచ్చింది. మానవ రహితంగా ఆవుల నుంచి పాలను పితికి, ప్యాక్ చేసి, విమానాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చి తాజాగా ఖాతాదారుల గడప దగ్గరకు ప్యాకెట్లు పడేలా నెట్‌వర్క్ సిద్ధం చేసింది. ఇంత శ్రేష్ఠత పాటించడం వల్ల మార్కెట్‌లో ఆవు పాల కంటే ఈ పాలు రెట్టింపు ధర ఉంటాయి. అయినా సరే కస్టమర్లు తండోప తండాలుగా ఈ పాలను కోరుకున్నారు. ఇవాళ అక్షాలి సరఫరా చేస్తున్న ఆవుపాలు ఢిల్లీ, ముంబై, పూణె, సూరత్‌లలో విశేషంగా అమ్ముడుపోతున్నాయి. 2027 నాటికి కేవలం ఈ ఆవుపాల టర్నోవర్ 400 కోట్లకు చేరుకుంటుందని అక్షాలి అంచనా.

2010లో పగ్గాలు చేపట్టి

ఎం.బి.ఎ.లో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన అక్షాలి షా తన తండ్రి దేవేంద్ర షా స్థాపించి నిర్వహిస్తున్న పాడి పరిశ్రమ రంగంలో 2010లో అడుగుపెట్టింది. అయితే తండ్రి ఆమెకు వెంటనే సంస్థ పగ్గాలు అప్పగించకుండా పెరుగు తయారు చేసే ఒక చిన్న ప్లాంట్‌ను ఇచ్చి దానిని డెవలప్ చేయమన్నాడు. అక్షాలి విజయం సాధించేసరికి మెల్ల మెల్లగా సంస్థలో ఆమె స్థానం, స్థాయి పెరుగుతూ పోయాయి. 'భారతీయుల సంస్కృతిలో పాలు, గోవు చాలా విశిష్టమైన స్థానంలో ఉంటాయి. మన పురాణాల్లో క్షీరం ప్రస్తావన ప్రముఖంగా ఉంటుంది. అందుకే నేను ఈ రంగాన్ని ఆషామాషీగా నిర్వహించదలుచుకోలేదు. నాణ్యమైన పాల ఉత్పత్తులు అందించగలిగితే కనుక సెంటిమెంట్ కనెక్ట్ అవుతుందనుకున్నాను' అంటుంది అక్షాలి.

ప్రొటీన్ ఉత్పత్తులు

శాకాహారంలో 84 శాతం, మాంసాహారంలో 65 శాతం ప్రొటీన్ లోపం ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 'ఆరోగ్య, క్రీడా రంగంలో ప్రొటీన్ ప్రాడక్ట్స్‌కు నేడు దేశంలో ఏటా 2000 కోట్ల మార్కెట్ ఉంది. ప్రొటీన్ పౌడర్లు తీసుకునే ఫిట్‌నెస్ ప్రియులు చాలామంది ఉంటారు. అందుకే పాల నుంచి సేకరించిన ప్రొటీన్ ప్రాడక్ట్‌లను తయారు చేసి విక్రయిస్తున్నాం. అవతార్, గో ప్రొటీన్ పేరుతో మా ప్రాడక్ట్‌లు ఉన్నాయి' అంటుంది అక్షాలి. పరాగ్ సంస్థ నుంచి 'గోవర్ధన్' పేరుతో నెయ్యి దొరుకుతోంది. ఇక చీజ్ అమ్మకాల్లో అక్షాలి సంస్థ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఫ్లేవర్డ్ మిల్క్, పెరుగు... ఈ అన్ని ఉత్పత్తుల్లో సంస్థ మంచి అమ్మకాలు సాధిస్తోంది.

పూర్వం పాలు, పెరుగు స్త్రీలే అమ్మేవారు. వారికి పాలను ఎలా ఆదాయవనరుగా చేసుకోవాలో తెలుసు. అక్షాలి లాంటి నవతరం డెయిరీ లీడర్లు అదే నిరూపిస్తున్నారు.

ఫస్ట్ టైమ్


● శాలిని సింగ్

పర్వతాలు పిలిచాయి

'అదిగో పర్వతాలు పిలుస్తున్నాయి. నేను తప్పక వెళ్లాలి' అంటాడు ప్రకృతి ప్రేమికుడు, తత్వవేత్త జాన్ మ్యూర్. ఒకానొక సమయంలో శాలిని సింగ్‌కు కూడా పర్వతాల పిలుపు వినిపించింది. పర్వతాలు ఆప్యాయంగా పలకరిస్తాయి. సాహసాలు చేయమంటాయి. అనురక్తి ఉన్నచోట ధైర్యం ఉంటుంది. ఆ రెండు ఉన్నచోట అపురూపమైన సాహసం ఆవిష్కారం అవుతుంది. ఉత్తరఖండ్‌లోని హిమాలయప్రాంతం ఉత్తరకాశీలో అధునాతనమైన మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసిన తొలి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా చరిత్ర సృష్టించింది లక్నోకు చెందిన శాలిని సింగ్....

లక్నోకు చెందిన బప్పశ్రీ నారాయణ్ పీజీ కాలేజీలో శాలిని సింగ్ బీఏ స్టూడెంట్.

పాఠాలే కాదు పర్వతారోహకుల గురించి ఎన్నో విషయాలు విన్నది శాలిని.

19 శతాబ్దానికి చెందిన ప్రపంచ ప్రసిద్ధ పర్వతారోహకుల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు విన్నది. బచేంద్రిపాల్, ప్రేమలత అగర్వాల్, అరునిమ సిన్హా, శివాంగి పాఠక్, మాలావత్ పూర్ణ....వరకు ఎంతో మంది సాహసికులు తనలో ఉత్తేజం నింపారు.

ఎన్‌సీసీలో చేరిన తరువాత శాలిని సింగ్ ప్రపంచం విస్తృతం అయింది. కొత్త దారులు ఎన్నో కనిపించాయి.

యూపీ బెటాలియన్‌లో శాలిని సింగ్ సీనియర్ వింగ్ ఎన్‌సీసీ క్యాడెట్. అడ్వాన్స్‌డ్ మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసి సత్తా నిరూపించుకోవాలనేది ఎంతో మంది కల. అయితే అది అంత తేలికైన విషయం కాదు.

దానికి ముందు బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

జమ్ములోని పహల్‌గామ్‌లో గత సంవత్సరం బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసిన శాలిని అడ్వాన్స్‌డ్ కోర్సుకు అర్హత సంపాదించింది. మౌంటెనీరింగ్ కోర్సులో భాగంగా ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది శాలిని. అవి తన జీవితంలో విలువైన అనుభవాలు.

మరిన్ని సాహసాలకు దారి చూపే అరుదైన పాఠాలు.

దట్టమైన మంచుతో ఉండే హుమ్రా శిఖరాన్ని అధిరోహించడం అనేది సాధారణ విషయం కాదు.

కోర్సులో భాగంగా ప్రతికూలమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొని డ్రింజ్ వ్యాలీలోని 15,000 అడుగుల ఎత్తయిన హుమ్రాను అధిరోహించింది శాలిని.

ఉత్సాహం, అంకితభావం, సాహసాలను మేళవించి ఎన్నో సవాళ్లతో కూడిన అధునాతనమైన మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసి, తొలి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా చరిత్ర సృష్టించింది శాలిని సింగ్.

'నువ్వు చేయగలవు. కచ్చితంగా చేస్తావు' అంటూ శాలినిలో ఉత్సాహాన్ని నింపాడు కల్నల్ పునీత్ శ్రీవాస్తవ.

'శాలిని విజయం ఎన్‌సీసీకి మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఆమెలా కలలు కనే ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చే విజయం' అంటున్నాడు పునీత్ శ్రీవాస్తవ.

'నా విజయం ఎంతమంది అమ్మాయిలకు స్ఫూర్తినిస్తే అంతగా సంతోషిస్తాను' అంటుంది శాలిని సింగ్.

'మనం యాంత్రికంగా జీవిస్తున్నామా, జీవనోత్సాహంతో ఉన్నామా అనే దానికి సాహసాలే ప్రమాణం అనే మాట ఎన్నో సార్లు విన్నది శాలిని.

ఆ మాటలే సాహస బాటను ఎంచుకోవడానికి తనకు ప్రేరణ ఇచ్చాయి.

సివిల్ సర్వీసెస్‌లో చేరాలనేది శాలిని సింగ్ కల.

అయితే అంతకంటే బలమైన కల....

ప్రపంచంలోని ప్రతి శిఖరాన్ని అధిరోహించాలని!

బ్యూటిప్స్

ముఖకాంతికి

ఎండాకాలం చెమట వల్ల ముఖ చర్మం జిడ్డుగా అవుతుంది. ముఖకాంతి పెరగాలంటే...

● మూడు టీ స్పూన్ల దోస రసం, రెండు టీ స్పూన్ల అలోవెరా జెల్, టీ స్పూన్ పెరుగు కలిపి ముఖానికి, మెడకు పట్టించి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండవల్ల కందిపోయిన, రసాయనాల వల్ల ర్యాష్ ఏర్పడిన చర్మానికి సహజమైన ఫేస్‌ప్యాక్‌లా పనిచేస్తుంది.

● దోస లేదా కీరా రసంలో పచ్చి పాలు కలిపి చర్మానికి రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండ వల్ల కమిలిన చర్మం వెంటనే సాధారణ రంగులోకి వస్తుంది.



రంగస్థలం

అమావాస్య పున్నముల అరుదైన కళ

సంవత్సరాలు గడిచినా రంగస్థలం పులకరించే పేరు..... బినోదిని దాసి. బెంగాలీ నాటకకళకు కొత్త అడుగు నేర్పిన పేరు అది. బినోదినీ జీవితం నాటకాల నుంచి సినిమాల వరకు ఎన్నో సృజనాత్మక రూపాల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా...మ్యూజిక్ బేస్డ్ డ్రామా 'బినోదిని ఒపెరా' సాహిత్య,సంగీత, దృశ్య సమ్మేళనంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరిస్తోంది. అలనాటి కాలానికి తీసుకెళ్లి 'ఔరా' అనిపిస్తోంది...


● బినోదినీ పాత్రలో సుదీప్త చక్రవర్తి...

బినోదిని దాసి పన్నెండవ ఏట నుంచే నటన మొదలు పెట్టింది. 1874లో కోల్‌కత్తా నేషనల్ థియేటర్ తరపున తొలిసారిగా ఒక సీరియస్ డ్రామాలో నటించింది. ఈ డ్రామా కంపెనీ వ్యవస్థాపకుడైన గిరీష్ చంద్ర ఘోష్ మాటలనే పాఠాలుగా చేసుకొని యూరోపియన్ థియేటర్ నుంచి ఇండియన్ థియేటర్ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది. నటనలో తనను తాను మెరుగుపరుచుకుంది. పన్నెండవ యేట మొదలు పెట్టిన నటనకు 23వ యేట స్వస్తి పలికినప్పటికీ ఎన్నో అపురూపమైన పాత్రలు పోషించింది. నటనకు సంబంధించి ఎన్నో విలువైన అనుభవాలను సొంతం చేసుకుంది.

జీవిత చరిత్ర రాసుకున్న దక్షిణ ఆసియాకు చెందిన తొలి నటిగా చరిత్రకెక్కింది. సంప్రదాయ బెంగాలీ నాటకరంగానికి ఆధునిక ధోరణులను పరిచయం చేసిన నటిగా పేరు తెచ్చుకుంది.

తన జీవిత చరిత్ర 'అమర్ కథ' ఒక సంచలనం. బినోదినీ ఉన్నట్టుండీ నాటకాలకు ఎందుకు దూరమైంది అనే దాని గురించి రకరకాల కారణాలు వినిపిస్తున్నప్పటికీ అసలు సిసలు కారణం ఏదో తెలియాల్సి ఉన్నది అనిపిస్తుంది.

కాలాతీతుల గురించి ఎప్పుడూ మాట్లాడుకున్నా, ఏంమాట్లాడుకున్నా అమిత ఆసక్తిగా ఉంటుంది. బినోదినీ ఈ కోవకు చెందిన నటి. 'నటి బినోదినీ' పేరుతో బెంగాలీ సినిమా వచ్చింది. ఆమె జీవిత చరిత్ర ఆధారంగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) రూపొందించిన 'నటి బినోదినీ' బాగా పాపులర్ అయింది.

తుహినభ మజుందార్ బినోదిని జీవితచరిత్ర ఆధారంగా 'అమర్‌కథ: స్టోరీ ఆఫ్ బినోదినీ' పేరుతో డాక్యుమెంటరీ తీశారు.


● బినోదినీ దాసి

తాజాగా... బినోదినీ జీవితంపై అబంతి చక్రవర్తి మ్యూజిక్ బేస్డ్ డ్రామా 'బినోదిని ఒపెరా' రూపొందించారు. ఈ ఒపెరాకు ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. దీనిలో బినోదినీ ప్రేమ, వివాహం, బంధాలు...ఇలా ఎన్నో అంశాలు కనిపిస్తాయి.

150 నిమిషాల ఈ ఒపెరా మంత్రముగ్ధులను చేస్తోంది. బినోదినీ పాత్రకు సుదీప్త చక్రవర్తి ప్రాణం పోసింది.

ఈ ఒపెరాను ప్రేక్షకులు సృజనాత్మక ప్రక్రియగా మాత్రమే చూడడం లేదు. గత, వర్తమానాల సామాజిక, సాంస్కృతిక విశ్లేషణకు ఒక వేదికలా చూస్తున్నారు.

'ఎన్ని సుడిగుండాలు దాటుకొని నిలబడితే.... ఒక నటి

చిమ్మ చీకట్లో ఎన్ని తేజాలతో వెలిగిపోతే... ఒక నటి!' అనే మాటలను కళ్లకు కట్టే కళా రూపం.... బినోదినీ ఒపెరా.

సైబర్ టాక్

ఫేక్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్త!


మెరిసేవన్నీ బంగారం కానట్టే, మనం చూసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అందరూ నిజమైన వారు కాకపోవచ్చు. వారు చూపే ఉత్పత్తులు నమ్మదగినవి అయిఉండకపోవచ్చు. ఎందుకంటే, రూ.100 పెట్టి, వంద అంతకంటే ఎక్కువ మంది ఫాలోవర్లను కొనుగోలు చేసే కొత్త మార్కెట్ ప్లేస్‌గా ప్రస్తుత సోషల్‌మీడియా తయారైంది. సరైన అవగాహన లేకపోతే పెయిడ్ పోస్ట్-వ్యక్తిగత అభిప్రాయం మధ్య తేడాను గుర్తించడం కష్టం. సెలబ్రిటీలు, ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నవారు చెబుతున్నారు కదా అని నాసిరకం వస్తుసేవలను కొనుగోలు చేసి మోసపోవద్దు.

ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేయడానికి కంపెనీలు ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ వైపు మళ్లుతున్నాయని ఆన్‌లైన్ ట్రెండ్ నివేదికలు చూపుతున్నాయి. ఇన్‌ఫ్లుయెన్సర్ ఎండార్స్‌మెంట్ పెరగడానికి ప్రధాన కారణాలి ..

- ఇన్‌ఫ్లుయెన్సర్ సపోర్ట్ చేసే ఉత్పత్తులను వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశాలు ఎక్కువ.
- వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ అకౌంట్ చూపించే వ్యూస్, కామెంట్స్‌ను చూసి నమ్ముతారు.
- ఎక్కువ షేర్ అయిన కంటెంట్‌ను చదవడానికి అధిక సమయం కేటాయిస్తారు. అలాగే ఆ సమాచారాన్ని వినియోగదారులు నమ్మే అవకాశాలు ఎక్కువ.
- ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి ఫాలోవర్స్ కామెంట్స్‌కు ప్రతిస్పందించడం, ఉత్పత్తులు, సేవలపై వారి అభిప్రాయాలను చెప్పడం.. మొదలైన వాటితో వినియోగదారుడు నమ్మకం పెంచుకుంటాడు. ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి ఫాలోవర్స్‌తో ఎప్పుడూ మాట్లాడుతూ ఉండటం కూడా దీనికి ఒక కారణం.

ఇలాంటి వాటిలో ఎక్కువ...

- నకిలీ కంపెనీలు ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడి, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ .. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సహాయంతో ఇంటర్నెట్‌లో గుర్తుతెలియని విధంగా పనిచేస్తాయి. వారి యాప్‌లలో పెట్టుబడులు పెట్టడానికి సగటు మధ్యతరగతిని ప్రలోభ పెట్టడానికి ఖరీదైన మార్కెటింగ్ ప్రచారాలను ప్రారంభించాయి.
- ఆపిల్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేయని యాప్‌లు చాలా వరకు చట్టబద్ధమైనవి కావు. వీటి ఉద్ధృతికి అడ్డుకట్ట వేయాలంటే మన దేశంలో చట్టబద్ధత తీసుకురావాల్సిన అవసరం ఉంది. అందుకు పట్టే సమయం ఎంతో తెలియదు కాబట్టి మనమే జాగ్రత్త వహించడం ముఖ్యం.


ప్రతీకాత్మక చిత్రం

సోషల్ మీడియాను ప్రభావితం చేసేవారు..

- నకిలీ ఉత్పత్తులు/సేవలు/ యాప్‌లు అందించే డబ్బును చూసి ఆశపడవద్దు. వాటి వల్ల మీపైన కూడా యూజర్లకు నమ్మకం పోయే అవకాశం ఉంది.
- ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా గూగుల్‌లో శోధించండి. చట్టబద్ధమైన సమాచారం ఉందో లేదో రివ్యూలు చదివి నిర్ధారించండి.
- మీ ఫోన్ నెంబర్ లేదా చిరునామాను సోషల్ మీడియాలో ఉంచవద్దు. ఎందుకంటే వీటిని వ్యాపార ఉపయోగాల కోసం ఇతరులు సేకరించే అవకాశం ఉంది.
- యాప్‌లకు ఇచ్చిన యాక్సెస్‌ను ఒకటికి పదిసార్లు చెక్ చేసి గాని నిర్ధారణకు రాకండి.
- ఫోన్‌లో అవసరమైన ప్రైవసీ సెట్టింగ్స్‌ను సెట్ చేయండి. అందుకు.. ఫోన్‌లో జీపీఎస్, బ్లూ టూత్, పాస్‌వర్డ్‌లు, పిన్‌లను సెట్ చేయండి.
- నమ్మకమైన ప్రొవైడర్ల నుండి మాత్రమే కావల్సినవాటిని డౌన్‌లోడ్ చేసుకోండి.
- అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరస్పర చర్యల కోసం సమ్మతిని ఒకే విధంగా పరిగణించాలి.
- మీ వ్యక్తిగత జీవితాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి ట్రోలింగ్‌కి ఆస్కారమిచ్చే వ్యక్తిగత కథనాలు, అభిప్రాయాల వ్యక్తీకరణలు, ఫొటోలు/వీడియోల ... వంటివి పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్తపడటం మంచిది.
- అన్ని ఫొటోలపై వాటర్‌మార్క్‌లను ఉపయోగించండి.
- హద్దులను సృష్టించుకోండి. అంటే, భవిష్యత్తులో మిమ్మల్ని ఇబ్బంది పెట్టే వ్యక్తిగత కథనాల జోలికి వెళ్లకండి.
- ఎదుటివారి మనోభావాలను దెబ్బతీసేలా పోస్ట్ చేయవద్దు.
- జాత్యాహంకార, రాజకీయ, మతపరమైన వ్యాఖ్యాలను నివారించడం మంచిది.
- మీ డేటాను రక్షించుకోవడం ముఖ్యం. మాల్వేర్, ట్రాకర్లను నిరోధించే పెయిడ్ టూల్స్‌ను ఉపయోగించండి.
- పాస్‌వర్డ్‌లు, ఇమెయిల్, నగదు చెల్లింపులను రక్షించడానికి రెండు రకాల ప్రామాణికతను పాటించాలి.
- ఫాలోవర్లను ఆకట్టుకోవడానికి నకిలీ సమీక్షలు, కామెంట్స్, లైక్స్‌ను కొనుగోలు చేయకూడదు.

గుర్తించడం ఇలా?

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంటెంపరరీ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ చేసిన సర్వే ప్రకారం 50 శాతం ఫాలోవర్లు నకిలీలే అని తేలింది. చాలా మంది ప్రముఖ బాలీవుడ్ నటులు, నటీమణులు, ర్యాపర్లను కూడా నకిలీ ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మోసగాళ్లు వాడుకుంటున్నారు.

- పోస్టింగ్‌కు ఉన్న ఫాలోవర్ల ట్రెండ్‌ను చూడాలి.
- ఇన్‌ఫ్లుయెన్సర్లు తరచూ చేసే పోస్టింగ్‌లపై దృష్టి పెట్టండి. ఫాలోవర్స్ ఎక్కువ, పోస్ట్‌లు తక్కువ ఉంటే అవి రెడ్ ఫ్లాగ్స్ అని గుర్తించాలి.
- కొన్ని నకిలీ ఇన్‌ఫ్లుయెన్సర్ల అకౌంట్స్ చూస్తే ఒకే విధమైన కామెంట్స్, ఒకే విధమైన ఫాలోవర్లు ఉంటారు.
- ఇన్‌ఫ్లుయెన్సర్ల మానిటరింగ్ టూల్స్ అంటే కూపన్‌కోడ్‌లు, లింక్, బయో డిస్క్రిప్షన్‌లు... మొదలైనవి పర్యవేక్షించడం ద్వారా మోసపూరితమైన వాటిని కనిపెట్టవచ్చు.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



సౌజన్య శుభారంభం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి బవిశెట్టి సౌజన్య శుభారంభం చేసింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సౌజన్య 7-6 (7/5), 6-3తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌పై గెలిచింది. గంటా 59 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సౌజన్య రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సౌజన్య-దశ ఇవనోవా (అమెరికా) జోడీ 2-6, 4-6తో శ్రీవల్లి రష్మిక-వైదేహి (భారత్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

హేమలతకు రెండు పతకాలు



ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన బి.హేమలత రోయింగ్‌లో రెండు పతకాలు సాధించింది. ఉత్తర ప్రదేశ్‌లో బుధవారం జరిగిన లైట్ వెయిట్ 500 మీటర్ల సింగిల్ స్కల్ విభాగంలో స్వర్ణ పతకం... 2000 మీటర్ల లైట్ వెయిట్ సింగిల్ స్కల్ విభాగంలో రజత పతకం గెల్చుకుంది. హేమలత సరోజినినాయుడు వనితా మహావిద్యాలయలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది.

రెండో రౌండ్‌లో సాకేత్-యూకీ జోడీ



ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలిసారి ఆడుతున్న సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ అద్భుత ప్రదర్శనతో తొలి రౌండ్‌ను దాటి రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్-యూకీ ద్వయం 6-3, 6-2తో ఎంజా క్వాకు-రిండర్‌నీచ్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. 64 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ మూడు ఏస్‌లు సంధించారు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) 5-7, 6-7 (5/7)తో సాదియో డుంబియా-రెబూల్ (ఫ్రాన్స్) చేతిలో... శ్రీరామ్ బాలాజీ-జీవన్ నెడుంజెళియన్ 3-6, 4-6తో లవష్కా (బెలారస్)-పాపిరిన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయారు. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న-ఎబ్డెన్, బాలాజీ-జీవన్ జోడీలకు 17,000 యూరోల (రూ. 14 లక్షల 95 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

గార్సియాకు షాక్

- రెండో రౌండ్‌లోనే ఓడిన ఫ్రాన్స్ స్టార్
- మాజీ విజేత ఒస్టాపెంకో కూడా ఇంటిదారి

పారిస్: మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన కరోలిన్ గార్సియాకు అనూహ్య ఓటమి ఎదురైంది. సొంతగడ్డపై జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఈ ఫ్రాన్స్ స్టార్ రెండో రౌండ్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్, ఐదో సీడ్ గార్సియా 6-4, 3-6, 5-7తో ప్రపంచ 56వ ర్యాంకర్ అనా బ్లింకోవా (రష్యా) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో గార్సియా ఏడు డబుల్ ఫాల్ట్‌లు, 50 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. వరుసగా నాలుగో ఏడాది ఈ టోర్నీలో ఆడుతున్న బ్లింకోవా ఐదుసార్లు గార్సియా సర్వీస్‌ను బ్రేక్ చేసి రెండోసారి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. 2017 చాంపియన్, 17వ ర్యాంకర్ ఎలెనా ఒస్టాపెంకో (లాత్వియా) కూడా రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఒస్టాపెంకో 3-6, 6-1, 2-6తో పేటన్ స్టెర్న్స్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 7-5, 6-2తో ఇరీనా షిమనోవిచ్ (బెలారస్)పై, తొమ్మిదో సీడ్ కసత్‌కినా (రష్యా) 6-3, 6-4తో వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)పై, స్వితోలినా (ఉక్రెయిన్) 2-6, 6-3, 6-1తో స్టార్మ్ హంటర్ (ఆస్ట్రేలియా)పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) తొలి సెట్‌ను 6-2తో గెల్చుకున్నాక ఆమె ప్రత్యర్థి కామిల్లా జియార్జి (ఇటలీ) గాయం కారణంగా వైదొలిగింది.





అల్‌కరాజ్ ముందుకు...

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. అల్‌కరాజ్ 6-1, 3-6, 6-1, 6-2తో టారో డానియల్ (జపాన్)పై, సిట్సిపాస్ 6-3, 7-6 (7/4), 6-2తో కార్బెలాస్ బేనా (స్పెయిన్)పై, ఖచనోవ్ 6-3, 6-4, 6-2తో రాడూ అల్బోట్ (మాల్డోవా)పై గెలిచారు. 2015 చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 4 గంటల 38 నిమిషాల పోరులో 6-3, 5-7, 3-6, 7-6 (7/4), 3-6తో కొకినాకిస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు.

‘విచారణ కొనసాగుతోంది’



రెజ్లర్లు బజరంగ్ పూనియా, సంగీత ఫొగాట్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్

- బ్రిజ్‌భూషణ్ కేసుపై ఢిల్లీ పోలీసుల వివరణ
- త్వరలోనే నివేదిక ఇస్తామని వెల్లడి

న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు సంబంధించి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై నమోదైన కేసు వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు స్పష్టతనిచ్చారు. దీనిపై విచారణ ఇంకా కొనసాగుతోందని వారు వెల్లడించారు. బుధవారం ఉదయం ‘మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణల విషయంలో బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు’ అని పోలీసులు చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. దాంతో కాస్త గందరగోళం నెలకొంది. దాంతో పోలీసులు ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. ‘ఆ వార్తలు పూర్తిగా తప్పు. చాలా సున్నితమైన ఈ కేసు విషయంలో అంతే జాగ్రత్తగా విచారణ జరుపుతున్నాం. తాజా పరిస్థితిపై కోర్టుకు సమాచారం ఇస్తూనే ఉన్నాం. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతూనే ఉంది కాబట్టి నివేదిక కోర్టుకు సమర్పించక ముందు బహిరంగంగా వెల్లడి చేయడం సరైంది కాదు’ అని పోలీసులు స్పష్టం చేశారు. తాజా పరిణామాల్లో దేశంలోని వేర్వేరు రాజకీయ పార్టీలు రెజ్లర్లకు మద్దతు ప్రకటించాయి. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రెజ్లర్లకు న్యాయం చేయాలంటూ స్వయంగా ప్లకార్డ్ పట్టి ర్యాలీలో పాల్గొనగా... బ్రిజ్‌భూషణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బేటీ బచావో, బేటీ పడావో మాత్రమే కాదు...ఇకపై బీజేపీ నాయకుల నుంచి ఆడబిడ్డలను కాపాడుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ ‘బేటీ బీజేపీ కే నేతావోంసే బచావో’ అంటూ కొత్త నినాదాన్ని ఇచ్చింది. మరోవైపు మంగళవారం హరిద్వార్‌లో గంగలో పతకాలు వేయాలని సంకల్పించిన ఆ తర్వాత మనసు మార్చుకున్న రెజ్లర్లు స్వస్థలం హరియాణా చేరుకోగా, సాక్షి మలిక్ మాత్రం ఢిల్లీలోనే ఉండిపోయింది. తీవ్ర బాధలో ఉండటంతో పాటు మౌనంగా ఉండాలని ఒట్టేసుకోవడం వల్లే మంగళవారం వారు ఎవరితో మాట్లాడలేదని సన్నిహితులు వెల్లడించారు.

తీవ్ర చర్యలకు పాల్పడవద్దు: ఠాకూర్



క్రీడల గొప్పతనాన్ని తగ్గించే ఎలాంటి తీవ్ర చర్యలకు పాల్పడవద్దని కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ రెజ్లర్లకు సూచించారు. విచారణ పూర్తయ్యే వరకు కాస్త ఓపిక పట్టమని ఆయన కోరారు. మరోవైపు ఆదివారం భారత రెజ్లర్ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రెజ్లర్లను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన దృశ్యాలు కలిచివేసే విధంగా ఉన్నాయని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది.

‘ఆరోపణలు రుజువైతే ఉరి వేసుకుంటా’




కేసుకు సంబంధించి తనపై ఆరోపణలు రుజువైతే ఉరి వేసుకుంటానని బ్రిజ్‌భూషణ్ సింగ్ మరోసారి చెప్పారు. ‘వారు నాపై ఆరోపణలు చేసి నాలుగు నెలలైంది. ఒక్కదానినీ రుజువు చేయలేకపోయారు. నాకు ఉరిశిక్ష విధించాలని వారు కోరారు. గంగలో పతకాలు వేయడం ద్వారా నన్ను శిక్షించలేరు. సాక్ష్యాలుంటే కోర్టుకు ఇచ్చి నాకు ఉరిశిక్ష వేయించండి. నా బిడ్డల్లాంటివారైన రెజ్లర్లపై నాకు ఇప్పటికీ కోపం లేదు’ అని ఆయన అన్నారు. మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదు చేసిన మైనర్ రెజ్లర్ వివరాలు బహిర్గతం చేసిన ఆమె బంధువు ఒకరిపై కేసు నమోదు చేయాలని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్మన్ స్వాతి మలివాల్ పోలీసులకు సూచించింది.

సింధు, శ్రీకాంత్‌లకు చుక్కెదురు

- తొలి రౌండ్‌లోనే నిష్క్రమణ
- సైనా, లక్ష్య సేన్ ముందంజ





బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, మాళవిక తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మరోవైపు కిరణ్ జార్జ్, లక్ష్య సేన్, సైనా నెహ్వాల్, అష్మిత చాలిహా తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్‌కు కిరణ్ షాక్

పురుషుల సింగిల్స్‌లో 26వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో 21వ ర్యాంకర్ శ్రీకాంత్ 8-21, 21-16, 14-21తో ఓడిపోయాడు. సాయిప్రణీత్ 14-21, 16-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, ప్రియాన్షు 19-21, 10-21తో ఎన్జీ జె యోంగ్ (మలేసియా) చేతిలో, సమీర్ వర్మ 15-21, 15-21తో జొహాన్సన్ (డెన్మార్క్), మిథున్ (భారత్) 21-17, 8-21, 15-21తో కున్లావుత్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. ప్రపంచ 59వ ర్యాంకర్ కిరణ్ జార్జ్ 21-18, 22-20తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, 2018 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ షి యు కి (చైనా)పై సంచలన విజయం సాధించగా... లక్ష్య సేన్ 21-23, 21-15, 21-15తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై కష్టపడి గెలిచాడు.

26 నిమిషాల్లోనే...

దాదాపు రెండు నెలల తర్వాత మరో అంతర్జాతీయ టోర్నీలో బరిలోకి దిగిన భారత స్టార్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో కేవలం 26 నిమిషాల్లో 21-13, 21-7తో వెన్ జు జాంగ్ (కెనడా)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ అష్మిత 21-17, 21-14తో భారత్‌కే చెందిన మాళవికను ఓడించింది.

తొమ్మిదేళ్ల తర్వాత...

కెనడా ప్లేయర్, ప్రపంచ 15వ ర్యాంకర్ మిచెల్లి లీతో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ పీవీ సింధు 8-21, 21-18, 18-21తో ఓటమి చవిచూసింది. మిచెల్లి చేతిలో సింధు ఓడిపోవడం తొమ్మిదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-13, 18-21, 21-17తో రస్మస్ జెర్ -సాగార్డ్ (డెన్మార్క్) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.


ఫైనల్లో భారత్

సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణ కొరియాతో బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో టీమిండియా 9-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ధామి బాబీ సింగ్ (31వ, 39, 55వ ని.లో) మూడో గోల్స్ సాధించగా... సునీల్ లాక్రా (13వ ని.లో), అరైజీత్ సింగ్ (19వ ని.లో), అంగద్‌బీర్ సింగ్ (34వ ని.లో), ఉత్తమ్ సింగ్ (38వ ని.లో), విష్ణుకాంత్ సింగ్ (51వ ని.లో), శ్రద్ధానంద్ తివారీ (57వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. కొరియా తరఫున కియోన్‌యోల్ వాంగ్ (46వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. పాకిస్తాన్, మలేసియా జట్ల మధ్య రెండో సెమీఫైనల్ విజేత జట్టుతో నేడు జరిగే ఫైనల్లో భారత్ తలపడతుంది.



సినిమా

గుంటూరు కారం ఫిక్స్



● మహేశ్‌బాబు

గళ్ల చొక్కా, తలకి ఎర్ర కండువాతో మహేశ్‌బాబు ఊర మాస్ లుక్ సూపర్ స్టార్ కృష్ణ జయంతి (మే 31) సందర్భంగా బుధవారం విడుదలైంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రంలోని లుక్ ఇది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘ఊరికి మొనగాడు’, ‘గుంటూరు కారం’.. వంటి టైటిల్స్‌ని చర్చిస్తున్నారని వార్తలు వచ్చాయి. ఫైనల్‌గా ‘గుంటూరు కారం’ టైటిల్ ఫిక్స్ చేసి, బుధవారం హైదరాబాద్‌లో ఫ్యాన్స్ సమక్షంలో టైటిల్ ప్రకటించి, ‘మాస్ స్ట్రైక్’ పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో రౌడీ గ్యాంగ్‌ని చితకబాదుతూ, బీడీ వెలిగించి, ‘ఏంది అట్టా చూస్తున్నావు.. బీడీ త్రీడీలో కనపడుతుందా’ అంటూ మహేశ్ చెప్పే డైలాగ్‌తో ఈ గ్లింప్స్ సాగుతుంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలు. జనవరి 13న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: పీఎస్ వినోద్.

ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేనివాళ్లకు నేనున్నా



- డైరెక్టర్ తేజ

"నేను ఫుట్‌పాత్ నుంచి ఈ స్థాయికి వచ్చాను. ప్రతిభ ఉన్నా ఇండస్ట్రీకి ఎలా రావాలో తెలియనివాళ్లు చాలామంది ఉన్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేని వాళ్లకు నేను బ్రేక్ ఇస్తాను.. నేనున్నంత వరకూ అవకాశాలు ఇస్తాను.. స్టార్ హీరోలతో సినిమా చేసినా అందులో కొత్తవారికి చాన్స్ ఇస్తాను" అని డైరెక్టర్ తేజ అన్నారు. అభిరామ్, గీతికా తివారీ జంటగా రూపొందిన చిత్రం ‘అహింస’. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజ చెప్పిన విశేషాలు.

● అభిరామ్‌ని హీరోగా పరిచయం చేస్తానని రామానాయుడుగారికి మాట ఇచ్చాను.. ఆ మాట కోసమే తనతో ‘అహింస’ చేశాను. సినీ నేపథ్యంలో ఉన్న పెద్ద కుటుంబాల్లోని వ్యక్తులతో చేసినప్పుడు సహజంగానే పోలికలు వస్తాయి. ఇప్పటికే స్టార్స్ అయిన వెంకటేశ్, రానాలతో అభిరామ్‌ని పోల్చకూడదు. ఎక్కువ డబ్బులు, పేరు కోసం పెద్ద స్టార్స్‌తో పని చేయాలి. నేను డబ్బులు, పేరు చూశాను.. నాకు ఇంకేం కావాలి? ● ప్రేక్షకులు చాలా తెలివైనవారు. ట్రైలర్‌ని చూసి సినిమాకి వెళ్లాలా? వద్దా అని నిర్ణయించుకుంటున్నారు. స్టార్ హీరోని బట్టి థియేటర్‌కి వెళతారనుకుంటే.. అప్పుడు పెద్ద స్టార్స్‌కి అపజయాలే రాకూడదు కదా! సినిమాలో ఎమోషన్ ఉంటే ట్రైలర్‌లో కనిపిస్తుంది. ప్రేక్షకులు ఆ ఎమోషన్‌కి కనెక్ట్ అయితే స్టార్ సినిమానా? కొత్తవారిదా అనే తేడా లేకుండా వచ్చేస్తారు. ● ఒక ఫిలాసఫీని బేస్ చేసి తీసిన చిత్రమిది. అహింసని ఎలా ఫాలో అవ్వాలి? అనే కాన్సెప్ట్‌తో మంచి కమర్షియల్ కథతో ఈ సినిమా చేశాం. ఇందులో దాదాపు 14 యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. ఓ నాలుగు ఎపిసోడ్స్‌కి నేనే ఫైట్ మాస్టర్‌గా చేశాను. ● అభిరామ్‌కి సినీ నేపథ్యం ఉంది. తనని పరిచయం చేస్తున్నప్పుడు నాకంటే అభీపైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. సురేశ్‌బాబుగారు ఒకసారి సెట్‌కి వచ్చారు. ‘నాన్నా.. నువ్వుంటే నేను చేయను’ అని అభి అనడంతో మానిటర్ వద్దకెళ్లి కూర్చున్నారాయన. ఇన్ని సినిమాలు చేసిన వెంకటేశ్‌గారు, రానాకి కూడా సురేశ్‌గారు సెట్‌కి వస్తే టెన్షన్ వచ్చేస్తుంది (నవ్వుతూ).. సురేశ్‌గారి దృష్టి వేరుగా ఉంటుంది. కిరణ్‌గారు రాజీ పడకుండా ఈ సినిమా తీశారు. ఈ మూవీకి ఆర్పీ పట్నాయక్ సంగీతం, అనూప్ రూబెన్స్ నేపథ్య సంగీతం ప్లస్ అయ్యాయి. ● ‘అహింస’ విజయం సాధించి డబ్బులు వస్తే ఆ డబ్బుతో మళ్లీ సినిమాలు తీస్తాను. నా చిత్రం మూవీస్ బేనర్‌లో కొత్త దర్శకులని పరిచయం చేస్తాను. నా తర్వాతి సినిమా ‘రాక్షస రాజు’ని రానాతో చేస్తాను. ఆ తర్వాత మా అబ్బాయిని హీరోగా పరిచయం చేసే సినిమా చేస్తాను.

ఎమోషనల్ కానిస్టేబుల్



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా ‘ది కానిస్టేబుల్’ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ‘బలగం’ జగదీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహూర్తపు సన్నివేశానికి బి. నిఖితా జగదీష్ కెమెరా స్విచ్చాన్ చేయగా బీజే రిథిక క్లాప్ కొట్టారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ – ‘‘ఈ చిత్రంలో ఎమోషనల్ కానిస్టేబుల్‌గా నటిస్తున్నాను. దర్శకుడు చెప్పిన కథ, కథనం నాకు బాగా నచ్చాయి’’ అన్నారు. ‘‘సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం’’ అన్నారు ఆర్యన్ సుభాన్, ‘బలగం’ జగదీష్. దువ్వాసి మోహన్, సూర్య, కల్పలత తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : సుభాష్ ఆనంద్, కెమెరా: హాజరత్ షేక్ (వలి).

హతవిధి.. ఏంటిది...



● నవీన్ పొలిశెట్టి

‘హతవిధి.. ఏంటిది.. ఊహలో లేనిది.. బుల్లిచీమపై బుల్‌డోజరైనది..’ అంటూ నిరాశగా పాడుతున్నాడు మిస్టర్ పొలిశెట్టి. ఇంతకీ విషయం ఏంటంటే... పొలిశెట్టి తన భవిష్యత్తు తెలుసుకోవాలని ఒక చిలక దగ్గరకు వెళితే ఆ చిలక కూడా పారిపోతుంది. తన జీవితంలో ఏదైనా గొప్పగా చేయాలనుకుంటే అది జరగదు... ఆ బాధని ఇలా పాట రూపంలో వెళ్లగక్కాడు. ఆ మిస్టర్ శెట్టి ఎవరంటే.. నవీన్ పొలిశెట్టి. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ముఖ్య తారలుగా రూపొందుతున్న ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ చిత్రంలోని పాట ఇది. నవీన్ పొలిశెట్టిపై సాగే ఈ పాటను హీరో ధనుష్ పాడారు. రధన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

స్టూడెంట్ క్యారెక్టర్ నా కెరీర్‌కి ప్లస్



- బెల్లంకొండ గణేశ్

"‘స్వాతిముత్యం’లో నా పాత్ర మొదటి నుంచి చివరి వరకు అమాయకంగానే ఉంటుంది. కానీ ‘నేను స్టూడెంట్ సర్’లో డిఫరెంట్ షేడ్స్ ఉన్నాయి. సంతోషం, బాధ, టెన్షన్ ఉంటాయి. చివరికి తన కష్టం నుంచి హీరో ఎలా బయటపడ్డాడు?’ అనేది ఆసక్తిగా ఉంటుంది" అని హీరో బెల్లంకొండ గణేశ్ అన్నారు. రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో బెల్లంకొండ గణేశ్, అవంతిక దస్సాని జంటగా నటించిన చిత్రం ‘నేను స్టూడెంట్ సర్’. ‘నాంది’ సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బెల్లంకొండ గణేష్ పంచుకున్న విశేషాలు...

● ‘నేను స్టూడెంట్ సర్’ కథని కృష్ణ చైతన్యగారు రాశారు. అయితే ఆయన వేరే సినిమాలతో బిజీగా ఉండటంతో రాకేష్‌గారు దర్శకత్వం వహించారు. న్యూ ఏజ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో నిజ జీవితంలో జరిగే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. క్లైమాక్స్ వచ్చే వరకూ అసలు విలన్ ఎవరనేది ఊహించలేరు. చాలా మంది పెద్ద హీరోలు వారి రెండో సినిమాలో స్టూడెంట్ పాత్ర చేశారు.. వారిలా నేనూ స్టూడెంట్ పాత్ర చేశాను.. ఇది నా కెరీర్‌కి చాలా ప్లస్ అవుతుంది. ● ఈ సినిమాని నిర్మాత సతీష్‌గారు ప్యాషన్‌తో తీశారు. మహతి స్వరసాగర్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. మంచి సినిమా చూశామనే అనుభూతితో పాటు మంచి ఆర్ఆర్ విన్నామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు బయటికి వస్తారు. ● చిరంజీవిగారి ‘గాడ్‌ఫాదర్’, నాగార్జునగారి ‘ది ఘోస్ట్’ సినిమాలు విడుదలైన రోజే (2022 అక్టోబర్ 5) నా తొలి చిత్రం ‘స్వాతిముత్యం’ రిలీజ్ అయింది. అప్పుడు బ్యాడ్ రిలీజ్ డేట్ అనే మాట వినిపించింది. థియేటర్లో ఆ మూవీ ఇంకా బాగా ఆడాల్సింది. అయితే ఓటీటీలో అద్భుతమైన స్పందన వచ్చింది. ఎక్కడికి వెళ్లినా చాలా మంచి సినిమా చేశానని ప్రశంసిస్తున్నారు. ఈ విషయంలో నటుడిగా నేను సక్సెస్ అయ్యాను. మొదటి పది సినిమాలు పది డిఫరెంట్ జోనర్స్‌లో చేసి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలి.. దర్శక-నిర్మాతల్లో నమ్మకం కలిగించాలని ఉంది. నా తర్వాతి సినిమా కొత్త డైరెక్టర్‌తో క్రైమ్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది.

జిందగీ షురూ



● రాజా రవీంద్ర, వీవీ వినాయక్

రాజా రవీంద్ర, శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, నీల ప్రియా, ‘మిర్చి’ కిరణ్, హర్ష వర్ధన్ ప్రధాన పాత్రల్లో ‘డియర్ జిందగి’ అనే సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా పద్మారావ్ అబ్బిశెట్టి (పండు) దర్శకునిగా పరిచయమవుతున్నారు. రాజా రవీంద్ర సమర్పణలో ఉమాదేవి, శరత్ చంద్ర చల్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభం అయింది. తొలి సీన్‌కి దర్శకుడు కల్యాణ్ కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించగా, డైరెక్టర్ వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ– ‘ఇందులో ముగ్గురు పిల్లల తండ్రి పాత్రలో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ చేస్తున్నాను’’ అన్నారు. ‘‘ప్రేక్షకులకు మంచి కాన్సెప్ట్ సినిమాలను అందించాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి ఈ బ్యానర్‌ని స్థాపించాను’’ అన్నారు శరత్ చంద్ర చల్లపల్లి. ‘‘మధ్య తరగతి వారికి మా సినిమా కచ్చితంగా నచ్చుతుంది’’ అన్నారు పద్మారావ్ అబ్బిశెట్టి (పండు).

నీలా.. నన్నిలా..



● సాహస్, దీపిక

సాహస్, దీపిక జంటగా చైతు మాదాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘7:11’. నరేస్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించారు. ఈ చిత్రంలోని ‘నీలా.. నన్నిలా...’ అంటూ సాగే తొలి పాటను విడుదల చేశారు. గ్యానీ స్వరపరచిన ఈ మెలోడీ సాంగ్‌కు మణి దీపక్ కడిమిశెట్టి సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ‘‘ఇది టైమ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే సైన్స్ ఫిక్షన్ క్రైమ్ డ్రామా. 1999లో ఒక ముఖ్యమైన రోజున భవిష్యత్తులో 400 సంవత్సరాలలో వేరే గ్రహం నుండి మానవుల మనుగడకు సంబంధించిన కీలకమైన సమాధానాల కోసం ‘హంసలదీవి’ అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు. అదే రోజున ఆ టౌన్‌ని నాశనం చేయడానికి కొన్ని ఘటనలు జరుగుతాయి’’ అని యూనిట్ పేర్కొంది.

పలాసకి మించి ఆపరేషన్ రావణ్

- రక్షిత్ అట్లూరి



● వెంకట సత్య, రాధిక, రక్షిత్ అట్లూరి

‘‘‘పలాస’ నచ్చకపోతే నా కాలర్ పట్టుకోండి’ అంటూ గతంలో చెప్పాను. ఇప్పుడు అంతకు మించిన నమ్మకంతో చెబుతున్నాను. ‘పలాస’కి మించి ‘ఆపరేషన్ రావణ్’ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. మా నాన్న వెంకట సత్య వరప్రసాద్‌గారు బాగా డైరెక్ట్ చేశారు’’ అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటించిన చిత్రం ‘ఆపరేషన్ రావణ్’. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఈ మూవీ ఫస్ట్ థ్రిల్‌ను దర్శకులు మారుతి, కల్యాణ్ కృష్ణ విడుదల చేశారు. దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ‘‘ప్రసాద్‌గారు డైరెక్షన్ చేస్తా అన్నప్పుడు నవ్వుకున్నా. కానీ ట్రైలర్ చూశాక చాలా బాగుంది’’ అన్నారు. ‘‘ఈ సినిమా బాగా రావడానికి కారణం రాధికగారు’’ అన్నారు వెంకట్ సత్య. ‘‘ఆపరేషన్ రావణ్’ మంచి చిత్రం’’ అన్నారు నటి రాధిక. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	347	62,622
నిఫ్టీ ▽	99	18,534

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాలి రెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,927	▽ 91
డోజోన్స్	32,840	▽ 202
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,446	▽ 76
డాక్స్	15,664	▽ 245
షాంఘై	3,205	▽ 20
నికాయ్	30,888	▽ 440

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,390	▽ 12
బంగారం (99.5 స్వచ్ఛత)	60,148	▽ 12
వెండి (కిలో)	70,988	△ 127

కార్వీ స్టాక్ బ్రోకింగ్ రిజిస్ట్రేషన్ రద్దు



న్యూఢిల్లీ: క్లయింట్ల నిధులు, సెక్యూరిటీలను దుర్వినియోగం చేసినందుకు గాను బ్రోకరేజ్ సంస్థ కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) రిజిస్ట్రేషన్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రద్దు చేసింది. కేఎస్‌బీఎల్ క్లయింట్ల నిధులను గ్రూప్ కంపెనీల ఖాతాల్లోకి బదిలీ చేసుకుందని, అలాగే రూ. 2,700 కోట్ల విలువ చేసే క్లయింట్ల సెక్యూరిటీలను తనఖా పెట్టి దాదాపు రూ. 2,033 కోట్ల నిధులు సేకరించిందని బుధవారం జారీ చేసిన ఆదేశాల్లో సెబీ పేర్కొంది. ఆయా క్లయింట్లకు నిధులు, సెక్యూరిటీలను తిరిగి ఇవ్వకపోగా.. ఖాతాల మదింపు విషయంలో ఫోరెన్సిక్ ఆడిటర్లకు సరిగ్గా సహకరించలేదని కూడా తెలిపింది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు ఇప్పటికే కేఎస్‌బీఎల్‌ను డిఫాల్టరుగా ప్రకటించి, బహిష్కరించిన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు సెబీ పేర్కొంది. క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు గాను కార్వీ, దాని ప్రమోటర్ కొమండూర్ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ లావాదేవీలు జరపకుండా సెబీ గత నెలలో నిషేధం విధించింది.

భారత్ జీడీపీ జూమ్!



మార్చి త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధి • 2022-23 పూర్తి ఏడాదికి 7.2 శాతం
అంచనాలకు మించిన లెక్కలు • వ్యవసాయం, తయారీ, మైనింగ్, నిర్మాణం భేష్

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 6.1 శాతంగా నమోదయ్యింది. దీనితో 2022-23 ఆర్థిక సంవత్సరం మొత్తంగా జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదయ్యింది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ఫిబ్రవరిలో విడుదల చేసిన రెండవ అడ్వాన్స్ అంచనాలు 7 శాతం కన్నా ఇది అధికం కావడం గమనార్హం. వ్యవసాయం, తయారీ, మైనింగ్, నిర్మాణ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించినట్లు బుధవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. చైనా వృద్ధి రేటు చివరి త్రైమాసికంలో 4.5 శాతంగా నమోదయ్యింది. దీనితోపాటు ప్రపంచంలోని పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను పోల్చితే భారత్ ఎకానమీ వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తోంది. తాజా గణాంకాలతో గణనీయమైన పురోగతితో వార్షికంగా 3.3 ట్రిలియన్ డాలర్లకు ఎగసిన ఎకానమీ విలువ వచ్చే కొద్ది సంవత్సరాల్లో 5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

జీడీపీ లెక్కలు ఇలా..

2011-12 స్థిర ధరల వద్ద (ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసి) 2021-22 జనవరి-మార్చి త్రైమాసికంలో జీడీపీ విలువ రూ.41.12 లక్షల కోట్లు. తాజా సమీక్షా త్రైమాసికంలో (2022-23 జనవరి-మార్చి) ఈ విలువ రూ.43.62 లక్షల కోట్లు. వెరసి నాల్గవ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.1 శాతమన్నమాట. ఇక మొత్తం ఆర్థిక సంవత్సరంలో చూస్తే... ఈ విలువలు 2021-22తో పోల్చి చూస్తే 2022-23లో రూ.149.26 లక్షల కోట్ల నుంచి రూ.160.06 లక్షల కోట్లకు పెరిగాయి. వెరసి ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతంగా ఉంది. 2021-22లో వృద్ధి రేటు 9.1 శాతం అయినప్పటికీ, బేస్ తక్కువగా ఉండడం (2020-21లో కరోనా కష్టకాలంలో వృద్ధిరేటు భారీగా పడిపోవడం) దీనికి ప్రధాన కారణం. అయితే 2021-22 చివరి త్రైమాసికం 4 శాతంతో పోల్చితే తాజా లెక్కలు మెరుగ్గా ఉండడం గమనార్హం.

2022-23 వృద్ధి (%)	
క్యూ1	13.1
క్యూ2	6.2
క్యూ3	4.5
క్యూ4	6.1

జీవీఏ లెక్క ఇదీ...

కేవలం వివిధ రంగాల ఉత్పత్తి విలువకు సంబంధించిన- గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ) వృద్ధి రేటు 2022-23లో 7%గా ఉంది. 2021-22లో రేటు 8.8 శాతం. జీవీఏ ప్రకారం మార్చి త్రైమాసికం వృద్ధి రేటు పరిశీలిస్తే...

- తయారీ రంగం పురోగతి 2021-22 మార్చి త్రైమాసికంలో 0.6% ఉంటే, 2022-23 మార్చి త్రైమాసికంలో 4.5%గా నమోదయ్యింది.
- మైనింగ్ ఉత్పత్తి వృద్ధి ఇదే కాలంలో 2.3 శాతం నుంచి 4.3 శాతానికి ఎగసింది.
- నిర్మాణ రంగం విషయంలో భారీగా 4.9 శాతం నుంచి 10.4 శాతానికి చేరింది.
- వ్యవసాయ రంగం పురోగతి 4.1 శాతం నుంచి 5.5 శాతానికి చేరింది.

సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది



ప్రపంచ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ 7.2 శాతం వార్షిక వృద్ధిని నమోదుచేసుకోవడం హర్షణీయ పరిణామం. ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని, సూచీల దృఢమైన పనితీరును, ఆశాజనక పరిస్థితిని గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి.

– ప్రధాని నరేంద్ర మోదీ

అంచనాలకు మించి..



తాజా ఆర్థిక పురోగతిని పరిశీలిస్తే, ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ తొలి 6.5% అంచనాలను మించి వృద్ధి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వివిధ అంతర్జాతీయ సంస్థల అంచనాలను మించి 2022-23 ఎకానమీ గణాంకాలు నమోదుకావడం భారత్ సవాళ్లను ఎదుర్కొనగలిగిన పరిస్థితికి అద్దం పడుతోంది.

– వి. అనంత నాగేశ్వరన్, సీఈఏ

విజయవాడలో లుపిన్ ల్యాబొరేటరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డయాగ్నోస్టిక్స్ సేవల్లో ఉన్న లుపిన్ తాజాగా విజయవాడలో కేంద్రాన్ని నెలకొల్పింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్ ఏర్పాటైందని, నిపుణులైన సిబ్బంది ఇక్కడ కొలువుదీరారని కంపెనీ తెలిపింది. దేశవ్యాప్తంగా లుపిన్ డయాగ్నోస్టిక్స్‌కు 27 ల్యాబొరేటరీలు, 410 కలెక్షన్ సెంటర్స్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-6-2023	
విశాఖ	510-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
31-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

లాభాల స్వీకరణ.. ర్యాలీకి బ్రేక్

- సెన్సెక్స్ 347 పాయింట్లు పతనం
- నిఫ్టీ 99 పాయింట్ల క్షీణత
- ప్రపంచ మార్కెట్ల ప్రభావం




ముంబై: నాలుగు రోజులు ర్యాలీ బాటలో సాగిన దేశీ స్టాక్ మార్కెట్లు ఉన్నట్టుండి కుదుపునకు లోనయ్యాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇవ్వడంతో నష్టాలతో నిలిచాయి. సెన్సెక్స్ 347 పాయింట్లు క్షీణించి 62,622 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు తక్కువగా 18,534 వద్ద స్థిరపడింది. మార్కెట్లు గత 4 రోజుల్లో 1,200 పాయింట్లు పుంజుకోవడంతో ట్రేడర్లు లాభాల స్వీకరణ చేపట్టినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు చైనా ఆర్థిక మందగమనం, యూఎస్ రుణ పరిమితి పెంపు వంటి అంశాలు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమైనట్లు తెలియజేశారు. ఫలితంగా విదేశీ మార్కెట్లు సైతం డీలా పడినట్లు ప్రస్తావించారు. దీంతో కొంతమేర సెంటిమెంటు బలహీనపడిందని వివరించారు. ఈ నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు రోజంతా నేలచూపులతోనే కదిలాయి.

హెల్త్‌కేర్ ప్లస్: ఎన్‌ఎస్‌ఈలో ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, బ్యాంకింగ్ 1.3-0.7% మధ్య నీరసించగా.. కన్జూమర్ డ్యూరబుల్స్, ఫార్మా, రియల్టీ 0.7% చొప్పున పుంజుకున్నాయి. ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, యాక్సిస్, ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, పవర్‌గ్రిడ్, గ్రాసిమ్, హిందాల్కో, కోల్ ఇండియా, సిప్లా, టాటా స్టీల్, బజాజ్ ఫిన్, అల్ట్రాటెక్, ఎంఅండ్‌ఎం, టీసీఎస్, ఐటీసీ 3-1% మధ్య క్షీణించాయి. అయితే టెక్‌ఎం, ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా మోటార్స్, బీపీసీఎల్, బ్రిటానియా, నెస్లే 2-1% మధ్య బలపడ్డాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి 8 పైసలు తగ్గి 82.75 వద్ద ముగిసింది.

సీఐటీఐఐఎస్ 2.0కు కేంద్రం ఆమోదముద్ర

న్యూఢిల్లీ: సమగ్ర పట్టణాల నిర్వహణను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టెయిన్ (సీఐటీఐఐఎస్) 2.0కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏఎఫ్‌డీ)తో పాటు కేఎఫ్‌డబ్ల్యూ, యూరోపియన్ యూనియన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్‌ఐయూఏ) భాగస్వామ్యంలో ఇది ఈ ఆర్థిక సంవత్సరంతో ప్రారంభమై నాలుగేళ్ల పాటు అమల్లో ఉంటుంది.



నగరాల స్థాయిలో వ్యర్థాల నిర్వహణ, రాష్ట్రాల స్థాయిలో వాతావరణ మార్పులపరమైన సంస్కరణలు, జాతీయ స్థాయిలో సంస్థలను తత్సంబంధ సంస్థలను పటిష్టం చేసే ప్రాజెక్టులకు ఈ ప్రోగ్రాం ద్వారా మద్దతు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. సీఐటీఐఐఎస్ 2.0కు 200 మిలియన్ యూరోల మేర (సుమారు రూ. 1,760 కోట్లు) రుణ రూపంలో సమకూర్చనున్నట్లు ఠాకూర్ వివరించారు. 2018లో రూ. 933 కోట్లతో సీఐటీఐఐఎస్ 1.0ను అమలు చేశారు.

దశాబ్దంలోనే భారత్‌లో ఎంతో మార్పు

- అంతర్జాతీయంగా స్థానం బలోపేతం
- మోర్గాన్ స్టాన్లీ సానుకూల నివేదిక





న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం కింద భారత్ పదేళ్లలోనే ఎంతో మార్పు చెందినట్లు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. అంతర్జాతీయంగా భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుందని, ఆసియా, ప్రపంచ వృద్ధిని నడిపించే కీలక దేశంగా అవతరించినట్లు తన తాజా నివేదికలో ప్రస్తావించింది. భారత్ తన సామర్థ్యాల మేరకు ఫలితాలను చూపించలేదని, ఈక్విటీ వ్యాల్యుయేషన్లు గరిష్టాల్లో ఉన్నాయన్న విమర్శలను తోసిపుచ్చింది. ఈ తరహా దృక్పథం గత తొమ్మిదేళ్లలో చేపట్టిన వ్యవస్థీకృత సంస్కరణలను విస్మరించడమేనని పేర్కొంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రెండో ఆర్థిక వ్యవస్థకు తోడు, గత 25 ఏళ్లలో గొప్ప పనితీరు చూపిన స్టాక్ మార్కెట్‌ను నిదర్శనాలుగా ప్రస్తావించింది. 2013తో పోలిస్తే ఇప్పుడున్న భారత్ భిన్నమైనదిగా పేర్కొంది.

ఇవీ మార్పులు..: 2014లో ప్రధానిగా మోదీ కొలువుదీరిన తర్వాత చోటు చేసుకున్న పది పెద్ద మార్పులను మోర్గాన్ స్టాన్లీ ప్రస్తావించింది. పోటీ దేశాల స్థాయిలో కార్పొరేటు పన్నును తగ్గింపు, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెంచడం అతిపెద్ద సంస్కరణలుగా పేర్కొంది. జీఎస్‌టీ కింద పన్నుల ఆదాయం క్రమంగా పెరుగుతుండడాన్ని ప్రస్తావించింది. అలాగే, జీడీపీలో డిజిటల్ లావాదేవీలు పెరుగుతుండం ఆర్థిక వ్యవస్థ మరింత క్రమబద్ధీకరణ చెందుతుందనడానికి నిదర్శంగా పేర్కొంది. ఎగుమతుల్లో భారత్ వాటా రెట్టింపై 2031 నాటికి 4.5%కి చేరుకుంటుందని అంచనా వేసింది.

తలసరి ఆదాయంలో వృద్ధి

ప్రస్తుతం భారత్‌లో తలసరి ఆదాయం 2,200 డాలర్లుగా (రూ.1,80,400) ఉంటే, 2032 నాటికి 5,200 డాలర్లకు (రూ.4,26,400) పెరుగుతుందని మోర్గాన్ స్టాన్లీ తన నివేదికలో పేర్కొంది. ఇది భారత్‌లో వినియోగ పరంగా పెద్ద మార్పునకు కారణమవుతుందని అంచనా వేసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 1365 అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) పోస్టులు

భారత్ నౌకాదళంలో అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1365(పురుషులు-1120, మహిళలు-273).
- » **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కెమిస్ట్రీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్‌లో ఏదో ఒక సబ్జెక్టుగా ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** అభ్యర్థి 01.11.2002 నుంచి 31.04.2005 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష(సీబీఈ), రాతపరీక్ష, శారీరక దారుఢ్యపరీక్ష(పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **శిక్షణ:** అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ 2023లో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు కేటాయిస్తారు.
- » **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.35,550, నాలుగో ఏడాది రూ.40,000 ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
- » **శిక్షణ ప్రారంభం:** 2023 నవంబర్ నెలలో
- » **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో 608 అప్రెంటిస్‌లు

జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలోని సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(సీసీఎల్).. ట్రేడ్, ఫ్రెషర్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 608
- » **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌0-536, ఫ్రెషర్ అప్రెంటిస్-72.
- » **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మెషినిస్ట్, టర్నర్, వైర్‌మ్యాన్, సర్వేయర్, వెల్డర్ తదితరాలు.
- » **అర్హత:** ట్రేడును అనుసరించి మెట్రిక్యులేషన్, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 19.04.2023 నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 27 ఏళ్లు, ఫ్రెషర్ అప్రెంటిస్‌కు 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **స్టైపెండ్:** ట్రేడును అనుసరించి స్టయిపెండ్ నెలకు రూ.6000 నుంచి రూ.9000 వరకు ఉంటుంది.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.06.2023.
- » **వెబ్‌సైట్:** www.centralcoalfields.in

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 28 పోస్టులు

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
- » **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, కౌన్సిలర్, లా ఆఫీసర్, సీనియర్ కౌన్సిలర్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/బీఈ /బీటెక్/ఎంఈ /ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ/ఎంఎస్సీ/ఎంసీఏ/ఎంఏ/ఎంఫిల్/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 35 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** స్క్రీనింగ్/రాతపరీక్ష/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.06.2023.
- » **వెబ్‌సైట్:** www.iitkgp.ac.in

ఈఎస్ఐసీ, హైదరాబాద్‌లో 76 పోస్టులు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న ఎంప్లాయిస్ స్టేట్‌ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషలిస్టులు.
- » **విభాగాలు:** ఐసీయూ, జనరల్ మెడిసిన్, హెమటాలజీ, ఈఎన్‌టీ,ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, ఆంకాలజీ, డెర్మటాలజీ, ఫిజికల్ మెడిసిన్, టీబీ/చెస్ట్, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, అనాటమీ, రేడియాలజీ తదితరాలు.

అర్హత

- » **ఫ్యాకల్టీ/సీనియర్ రెసిడెంట్‌లు:** ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం అర్హత ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **సూపర్ స్పెషలిస్ట్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 45 నుంచి 67 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** పోస్టును అనుసరించి నెలకు రూ.67,700 నుంచి రూ.2,00,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **ఇంటర్వ్యూ వేదిక:** అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, సనత్‌నగర్, హైదరాబాద్.
- » **ఇంటర్వ్యూ తేది:** 06.06.2023 నుంచి 10.06.2023.
- » **వెబ్‌సైట్:** www.esic.gov.in

ఉపాధ్యాయ విద్యకు మేటి.. ఆర్ఐఈ

ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే వారు బీఈడీ, ఎంఈడీ వంటి కోర్సులను ఎంచుకుంటారు. వీటిని పూర్తి చేస్తే టీచింగ్ రంగంలో చక్కటి ఉపాధి అవకాశాలు సొంతమవుతాయి. ఇలాంటి టీచింగ్ కోర్సులను ప్రముఖ విద్యాసంస్థ రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ) అందిస్తోంది. ఇటీవల ఆర్ఐఈ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు ఎన్‌సీఈఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆర్ఐఈ-సీఈఈ-2023 వివరాలు, కోర్సులు, క్యాంపస్‌లు, సీట్లు, పరీక్ష విధానం తదితర వివరాలు..

- » ఆర్ఐఈ సీఈఈ 2023 నోటిఫికేషన్ విడుదల
- » ఆర్ఐఈ క్యాంపస్‌ల్లో టీచింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సీఈఈ
- » ఇంటిగ్రేటెడ్ బీఈడీ, బీఈడీ, ఎంఈడీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈడీ
- » తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆర్ఐఈ-మైసూర్‌కు కేటాయింపు



రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్..సంక్షిప్తంగా ఆర్ఐఈలుగా సుపరిచితం. ఉపాధ్యాయ విద్యకు సంబంధించి ఇంటర్మీడియెట్ అర్హతతోనే అందుబాటులో ఉండే ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు మొదలు ఎంఈడీ వరకు పలు కోర్సులను ఆర్ఐఈ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రతి ఏటా కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(సీఈఈ)ను నిర్వహిస్తారు. ఇందులో సాధించిన స్కోర్, అకడమిక్ అర్హతల మార్కులకు వెయిటేజీ కల్పించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

అయిదు క్యాంపస్‌లు

దేశ వ్యాప్తంగా అయిదు ఆర్ఐఈ క్యాంపస్‌లు(అజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, మైసూర్, షిల్లాంగ్) ఉన్నాయి. వీటిలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ, బీఏ-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ, ఎంఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ, ఎంఈడీ అందుబాటులో ఉన్నాయి.

బీఈడీ

అజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, ఆర్ఐఈ మైసూర్, ఎన్ఈఆర్ఐఈ-షిల్లాంగ్ క్యాంపస్‌ల్లో ఒక్కో క్యాంపస్‌లో 110 సీట్లు చొప్పున ఉన్నాయి. వీటిలో ప్రతి క్యాంపస్‌లో సగం సీట్లను సైన్స్, మ్యాథ్స్ గ్రూప్(బీఎస్సీ-బీఈడీ), మిగతా సగం సీట్లను సోషల్ సైన్స్ అండ్ లాంగ్వేజ్ గ్రూప్(బీఏ-బీఈడీ) విద్యార్థులకు కేటాయించారు.

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ

- ఆర్ఐఈలలో ప్రత్యేకంగా గుర్తింపు పొందిన కోర్సు.. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఈ కోర్సులో ప్రవేశం పొందొచ్చు.
- ఆర్ఐఈ-భువనేశ్వర్, మైసూర్ క్యాంపస్‌లలో 55 సీట్లు చొప్పున బీఏ-బీఈడీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ-బీఈడీకి సంబంధించి భువనేశ్వర్, మైసూర్ క్యాంపస్‌లలో ఫిజికల్ సైన్స్ గ్రూప్‌లో 55 సీట్లు చొప్పున, బయలాజికల్ సైన్స్ గ్రూప్‌లో 55 సీట్లు చొప్పున ఉన్నాయి.

మైసూర్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-ఈడీ

ఆర్ఐఈ-మైసూర్ ఆరేళ్ల వ్యవధిలోని ఎమ్మెస్సీ-ఈడీ(ఎమ్మెస్సీ-ఎడ్) కోర్సును అందిస్తోంది. ఇంటర్మీడియెట్ అర్హతతో ఈ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ఫిజిక్స్ విభాగంలో 22, కెమిస్ట్రీ విభాగంలో 22, మ్యాథమెటిక్స్ విభాగంలో 22 సీట్లు చొప్పున ఉన్నాయి.

పీజీ స్థాయిలో.. ఎంఈడీ

పీజీ స్థాయిలో ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/సెకండరీ ఎడ్యుకేషన్/సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్ స్పెషలైజేషన్లలో..ఎంఈడీ కోర్సును ఆర్ఐఈ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. అజ్మీర్‌లో 55, భువనేశ్వర్‌లో 36, భోపాల్‌లో 55, మైసూర్‌లో 55 సీట్లు ఉన్నాయి.

ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ

ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ కోర్సును ఆర్ఐఈ భోపాల్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు. సైన్స్/సోషల్ సైన్స్/హ్యుమానిటీస్ స్పెషలైజేషన్లలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. మొత్తం 55 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాలకు ఆర్ఐఈ మైసూర్

తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆర్ఐఈ-మైసూర్‌లోని కోర్సులకు పోటీ పడాల్సి ఉంటుంది.ఆర్ఐఈ-మైసూర్‌లోని సీట్లలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కోర్సుల వారీగా కేటాయించిన సీట్ల వివరాలు..

- బీఎస్సీ-బీఎడ్, బీఏ-బీఎడ్‌ల్లో.. ఒక్కో కోర్సులో ఏపీ విద్యార్థులకు 9 సీట్లు, తెలంగాణ విద్యార్థులకు 6 సీట్లు చొప్పున కేటాయించారు.
- బీఈడీ కోర్సులకు సంబంధించి ఏపీ విద్యార్థులకు సైన్స్ గ్రూప్‌లో 5, ఆర్ట్స్ గ్రూప్‌లో 4, తెలంగాణ విద్యార్థులకు సైన్స్ గ్రూప్‌లో 3, ఆర్ట్స్ గ్రూప్‌లో 3 సీట్లు చొప్పున కేటాయించారు.
- ఎంఈడీ కోర్సులో ఏపీ విద్యార్థులకు 9, తెలంగాణ విద్యార్థులకు ఆరు సీట్లు ఉన్నాయి.
- ఎమ్మెస్సీ-ఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ కోర్సులకు అన్ని అన్ని రాష్ట్రాల విద్యార్థులకు అర్హత ఉంటుంది.

అర్హతలు

- ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ: 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ: ఫిజికల్ సైన్స్ గ్రూప్ అభ్యర్థులు ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులు; బయలాజికల్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు బైపీసీలో 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంఈడీ:** బీఈడీ లేదా ఇంటిగ్రేటెడ్ బీఈడీ లేదా బీఈఎల్ఈడీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఎమ్మెస్సీ-ఎంఈడీ:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ:** 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి.

సీఈఈ స్కోర్‌తో ప్రవేశం

కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(సీఈఈ)లో స్కోర్ ఆధారంగా ఆర్ఐఈ క్యాంపస్‌ల్లోని కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. సీఈఈ పరీక్ష మూడు విభాగాల్లో(ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ, టీచింగ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ) నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ విభాగంలో 20 ప్రశ్నలు, మిగతా రెండు విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 80 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 160 మార్కులకు సీఈఈ జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

సీఈఈ స్కోర్, అకడమిక్ మార్కులు

సీట్ల కేటాయింపు తుది జాబితా రూపకల్పనలో సీఈఈలో పొందిన స్కోర్‌తోపాటు అకడమిక్ మార్కులకు వెయిటేజీ కల్పించే విధానాన్ని అనుసరిస్తారు. సీఈఈ స్కోర్‌కు 60 శాతం, అకడమిక్ మార్కులకు 40 శాతం వెయిటేజీని గణిస్తారు.

కోర్సుకు అనుగుణంగా సీఈఈ క్లిష్టత

అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న కోర్సుకు అనుగుణంగా సీఈఈ పరీక్ష సిలబస్, ప్రశ్నల సరళి ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఈడీ కోర్సుల అభ్యర్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోని అకడమిక్స్‌పై పట్టు సాధించాలి.

బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు బ్యాచిలర్ స్థాయిలో తాము చదివిన గ్రూప్‌లకు సంబంధించిన సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. టీచింగ్ ఆప్టిట్యూడ్, ఆటిట్యూడ్‌లకు సంబంధించి బోధన పద్ధతులు, పెడగాజి వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

ఉద్యోగాలు

ఆర్ఐఈల్లో బీఈడీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు విస్తృతమని చెప్పొచ్చు. ఈ క్యాంపస్‌ల్లో పలు ఇన్‌స్టిట్యూట్‌లు ప్లేస్‌మెంట్ డ్రైవ్స్‌ను సైతం నిర్వహిస్తున్నాయి. వీటి ద్వారా సగటున రూ.30 వేల వేతనం లభిస్తోంది.

అజ్మీర్, భోపాల్ ఇంటిగ్రేటెడ్ బీఈడీకి ఎన్‌సీఈటీ

అజ్మీర్, భోపాల్ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ) స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పేరుతో ఎన్‌సీఈటీ నాలుగేళ్ల బీఈడీ కోర్సుల కోసం ప్రత్యేక స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. దేశ వ్యాప్తంగా ఉన్న 57 టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఆర్ఐటీ- భోపాల్, అజ్మీర్ క్యాంపస్‌లను కూడా సదరు ఇన్‌స్టిట్యూట్‌ల జాబితాలో చేర్చారు.

సీఈఈ-2023 సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 6, 2023
- **సీఈఈ పరీక్ష తేదీ:** జూలై 2, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cee.ncert.gov.in

క్లుప్తంగా...

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

జంతర్ మంతర్‌లో సంకల్ప దీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి డిమాండు చేసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని పేర్కొంది. తమ డిమాండు వచ్చే వర్షాకాల సమావేశాల్లోనే నెరవేర్చాలంటూ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో బుధవారం జంతర్ మంతర్ వద్ద సంకల్ప దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ, ఢిల్లీ, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హరియాణా, మహారాష్ట్రలకు చెందిన వాల్మీకి నేతలు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

రూ.40 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ ఏఈ అభిషేక్ వంశీ

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ ఏఈ అభిషేక్ వంశీ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే... పిఠాపురానికి చెందిన ఎస్.సత్తిరాజు సివిల్ కాంట్రాక్టర్. బిల్లుల విషయమై ఏఈ అభిషేక్ వంశీని సంప్రదించగా లంచం డిమాండ్ చేశారు. దీంతో సత్తిరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం సివిల్ కాంట్రాక్టర్ సత్తిరాజు నుంచి రూ.40వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ అభిషేక్ వంశీని ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈ నుంచి నగదు స్వాధీనం చేసుకుని, ఆయన్ను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐ వి.పుల్లారావు, వై.సతీష్, డి.వాసుకృష్ణ, బి.శ్రీనివాసరావు, ఎస్సై విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు విద్యుత్ ఉపకరణాలు పంపిణీ

ఈఈఎస్ఎల్ ద్వారా ఇంధన సామర్థ్య ఉపకరణాలు కొనుగోలు

సాక్షి, అమరావతి: 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోన్న గృహాల్లో విద్యుత్ బిల్లులు తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ 4 ఎల్ఈడీ బల్బులు, 2 ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 2 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫ్యాన్లు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. ఇందుకోసం సహకారం అందించాల్సిందిగా బుధవారం తనను కలిసిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ప్రతినిధులు అనిమేష్ మిశ్రా, హెడ్ నితిన్ భట్‌లను అజయ్ జైన్ కోరారు. ఈఈఎస్ఎల్ ద్వారా ఇంధన సామర్థ్య ఉపకరణాలను కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని అజయ్‌జైన్ తెలిపారు. వాటిని ఉపయోగించడం ద్వారా రూ.15.6 లక్షల ఇళ్లకు ఏటా ఇంటికి 734 యూనిట్లు చొప్పున రూ.352 కోట్లు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ జేఎండీ ఎం.శివ ప్రసాద్, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో ఎ.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ వాటర్ అవార్డుల్లో రాష్ట్రానికి 3వ ర్యాంకు

సీఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: జల వనరుల సంరక్షణ, నిర్వహణలో మన రాష్ట్రానికి ర్యాంకు లభించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి వెల్లడించారు. 4వ జాతీయ వాటర్ అవార్డులు–2022లో బెస్ట్ స్టేట్ కేటగిరీ కింద ఏపీకి 3వ ర్యాంకు (సంయుక్త విజేత) లభించిందని తెలిపారు. ఈ అవార్డు లభించినట్లు కేంద్ర జలశక్తిశాఖ, డిపార్టుమెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్‌మెంట్, గంగా రిజువనేషన్‌శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో తెలిపారని పేర్కొన్నారు. మన రాష్ట్రం ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును పొందడం రెండోసారని తెలిపారు. సీఎం జలవనరులశాఖ మంత్రి ఆదేశాలకు అనుగుణంగా జలవనరుల సంరక్షణ, పటిష్ట నిర్వహణకు సంస్కరణలు చేపట్టడమేగాక సాంకేతికతను వినియోగించడం, నిర్దిష్ట కాలవ్యవధిలో వినూత్న విధానాలు చేపట్టడం ద్వారా రాష్ట్రం ఈ అవార్డును సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా జలవనరులను సమర్థంగా వినియోగించడం, ఉపరితల, భూగర్భ జలవనరుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు అందరి భాగస్వామ్యంతో నీటిపారుదల ప్రాక్టీసులను ప్రోత్సహించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టి పూర్తిచేయడం ద్వారా త్వరితగతిన ప్రయోజనాలు పొందే లక్ష్యంతో నిరంతరం పర్యవేక్షించినందున ఈ అవార్డు పొందేందుకు అవకాశం కలిగిందని సీఎస్ పేర్కొన్నారు.

కేంద్ర చట్టం పాటించం... రాష్ట్ర చట్టం వర్తించదు

అయినా ఎవరూ ప్రశ్నించకూడదు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ వితండవాదం

- రూ.793.50 కోట్ల చరాస్తుల అటాచ్‌పై మొసలి కన్నీరు
- బ్రాంచి మేనేజర్ అధికారాలన్నీ ఎండీ శైలజ, మరో 11 మందికే
- చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్ములు నిబంధనలకు విరుద్ధంగా మళ్లింపు
- కేంద్ర చట్టాన్ని పాటించేందుకు నిరాకరణ.. కొత్త చిట్టీల నిలిపివేత
- రూ.400 కోట్ల టర్నోవర్ కోల్పోయిన మార్గదర్శి
- చిట్టీల మొత్తాన్ని సక్రమంగా చెల్లించలేక సతమతం
- హఠాత్తుగా బోర్డు తిప్పేస్తే చందాదారులు మునిగిపోయే ప్రమాదం
- చందాదారుల హక్కుల పరిరక్షణకే ఆస్తుల అటాచ్
- నాడు అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు, అరెస్టులను సమర్థించిన ఈనాడు
- తమదాకా వచ్చేసరికి రామోజీ గగ్గోలు



సాక్షి, అమరావతి : 'కేంద్ర చిట్‌ఫండ్ చట్టం పాటించం.. రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం మాకసలు వర్తించదు.. కంపెనీల చట్టం పేరిట చిట్‌ఫండ్ వ్యాపారం చేస్తున్నాం.. రశీదుల రూపంలో డిపాజిట్లు సేకరిస్తాం.. మేం ఏం చేసినా ప్రభుత్వం ప్రశ్నించకూడదు.. చట్టం అడ్డురాకూడదు.. చందాదారులు నిలువునా మోసపోయే పరిస్థితి ఉన్నా ఎవరూ అడగకూడదు.. ఎందుకంటే రామోజీరావు ఏం చేసినా సరే ప్రశ్నించకూడదన్న అలిఖిత రాజ్యాంగం ఈ రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతోంది'

.. ఇదీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ అడ్డగోలు వాదన. ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలతోసహా దొరికిపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం ఆ సంస్థకు చెందిన రూ.793.50 కోట్ల చరాస్తులను సీఐడీ అటాచ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయాన్ని వక్రీకరిస్తూ మొసలి కన్నీరు కారుస్తోంది. తమ చందాదారులను బెదిరించేందుకే ఇలా చేస్తున్నారంటూ రామోజీరావు ఈనాడు పత్రికలో దుష్ప్రచారానికి తెరతీశారు. అందులో కూడా తాము చట్టానికి అతీతమన్నట్టుగానే వాదించడం విస్మయపరుస్తోంది.

కేంద్ర చట్టాన్ని ఎందుకు పాటించరు..?
రాష్ట్ర చట్టం ఎందుకు వర్తించదు...?

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రామోజీరావు చేస్తోంది చిట్‌ఫండ్ వ్యాపారమన్నది అందరికీ తెలిసిందే. కానీ కేంద్ర ప్రభుత్వం చిట్‌ఫండ్ సంస్థల చందాదారుల హక్కుల ప్రయోజనం కోసం 1982లో చేసిన కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని తాము పాటించబోమని రామోజీరావు, ఆయన కోడలు శైలజ చెప్పడం విడ్డూరంగా ఉంది. అసలు ఆ చట్టాన్ని పాటించబోమని చెప్పడంలోనే ఈ దేశంలో చట్టాలపట్ల వారికి ఏమాత్రం గౌరవం లేదన్నది స్పష్టమైపోయింది. ఇక ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు అన్ని రాష్ట్రాలు డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాలను చేశాయి. ఉమ్మడి ఏపీలో అప్పటి టీడీపీ ప్రభుత్వమే 1999లో రాష్ట్రడిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేసింది. కానీ ఆ చట్టం కూడా తమకు వర్తించదని మార్గదర్శి చిట్‌ఫండ్స్ వాదిస్తోంది. ఎందుకంటే తాము డిపాజిట్లను సేకరించడంలేదంటూ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించింది. కానీ రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో ఆ సంస్థ అనధికారికంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్టు నిగ్గు తేలింది. చిట్టీలు పాడినవారికి ఆ మొత్తాన్ని పూర్తిగా చెల్లించకుండా కొంత మొత్తాన్ని తమ వద్దే అట్టిపెడుతోంది. అందుకు ఓ రశీదు ఇస్తోంది. ఆ రశీదులో పేర్కొన్న మొత్తంపై 4 నుంచి 5 శాతం వడ్డీ చెల్లిస్తోంది. అంటే రశీదు రూపంలో అనధికారికంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్టే. చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లు సేకరించడం ఆర్‌బీఐ మార్గదర్శకాలకు విరుద్ధం. కానీ రశీదు రూపంలో డిపాజిట్లు సేకరిస్తున్నట్టు నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని పలువురు చందాదారులు కూడా సీఐడీకి ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టంగా చెప్పారు. అంటే రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు కచ్చితంగా వర్తిస్తుందని న్యాయ నిపుణులు తేల్చి చెప్పారు.

అక్రమంగా నిధుల మళ్లింపు.. సొంత పెట్టుబడులు

తాము నిధులను మళ్లించలేదని చెబుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రజల్ని మరోసారి మోసగించేందుకు యత్నించింది. కానీ చిట్‌ఫండ్స్ చట్టానికి విరుద్ధంగా బ్రాంచి కార్యాలయాల్లోని నిధులను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి మళ్లించినట్టు సీఐడీ సోదాల్లో వెల్లడైంది. చట్ట ప్రకారం బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలు లేనే లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి.

చందాదారులను భయపెట్టేందుకు కాదు.. వారి హక్కుల పరిరక్షణకు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చరాస్తులను జప్తు చేసేందుకు ప్రభుత్వం అనుమతిఇవ్వడంపైన కూడా ఆ సంస్థ గగ్గోలు పెడుతోంది. తమ చందాదారులను బెదిరించేందుకే ప్రభుత్వం ఇలా చేసిందని వాదించడం విస్మయపరుస్తోంది. అసలు వాస్తవం ఏమిటంటే.. మార్గదర్శి చందాదారుల హక్కుల పరిరక్షణకు ముందస్తు చర్యగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎందుకంటే రాష్ట్రంలో గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు వేయడంలేదు. కేంద్ర చట్టాన్ని పాటించాలని రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్ చెప్పారు. అందుకు సమ్మతించకుండా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు వేయడం నిలిపివేసింది. దాంతో ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల టర్నోవర్ కోల్పోయింది. అప్పటికే కొనసాగుతున్న చిట్టీలను పాడినవారికి చిట్టీల మొత్తాన్ని సక్రమంగా చెల్లించలేకపోతోంది. పలువురు చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. వారిలో పలువురు ఇప్పటికే సీఐడీ అధికారులను కూడా ఆశ్రయించారు. దాంతో పరిస్థితిని విశ్లేషించిన సీఐడీ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ముమ్ముందు చందాదారుల చిట్టీల మొత్తం మరింతగా ఎగవేసే అవకాశాలున్నాయని గుర్తించింది. ఆ సంస్థ హఠాత్తుగా బోర్డు తిప్పేసినా, కార్యకలాపాలు నిలిపివేసినా చందాదారులు నిలువునా మునిగిపోయే ప్రమాదం ఉందని గ్రహించింది. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ కోసమే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన చరాస్తులు రూ.793.50 కోట్లను జప్తు చేసేందుకు సీఐడీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇందులో చందాదారుల ప్రయోజనాలను కాపాడాలనే ఉద్దేశమే తప్ప వారిని బెదిరించాలనే తలంపే ప్రభుత్వానికి లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అగ్రి గోల్డ్ అయితే అలా.. మార్గదర్శి అయితే ఇలానా..!?

చందాదారులు ఎవరూ ఫిర్యాదు చేయనప్పటికీ తమ చరాస్తులను జప్తు చేశారంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ వక్రభాష్యం చెబుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ గతంలో అగ్రిగోల్డ్ సంస్థపై కూడా ఖాతాదారులు ఎవరూ ఫిర్యాదులు చేయలేదు. కానీ అగ్రిగోల్డ్ సంస్థ అక్రమ డిపాజిట్ల సేకరణ, వాటిపై వడ్డీలు సక్రమంగా చెల్లించకపోవడం, డిపాజిట్ల నిధులను అక్రమ పెట్టుబడులుగా తరలించడం మొదలైన వాటిని ప్రభుత్వమే గుర్తించింది. ఆ అంశాలను చూపిస్తూ అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని బ్లాక్‌మెయిల్ చేయడం గమనార్హం. ఏకంగా అమరావతిలో ఉన్న హాయ్‌ల్యాండ్ భూములను తమ పేరిట బదిలీ చేయాలని టీడీపీ ప్రభుత్వంలో ముఖ్య నేత బెదిరించడం అప్పట్లోనే సంచలనం సృష్టించింది. అందుకు అగ్రిగోల్డ్ యాజమాన్యం సమ్మతించలేదు. దాంతో డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ కోసం కేసు నమోదు చేసి అగ్రిగోల్డ్ సంస్థ ప్రతినిధులను అరెస్టు కూడా చేసింది. దీనిపై అప్పట్లో ఈనాడు పత్రిక ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ వార్తలు రాసింది కూడా. అదే రీతిలో ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తమ చందాదారులకు చిట్టీల మొత్తం చెల్లించలేని పరిస్థితి ఉన్నందునే ప్రభుత్వం ఆ సంస్థ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీకి అనుమతిచ్చింది. నాడు అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తును సమర్థించిన ఈనాడు పత్రిక.. ఇప్పుడు మాత్రం మార్గదర్శి ఆస్తుల జప్తును వ్యతిరేకిస్తుండటం గమనార్హం. అంటే.. అగ్రిగోల్డ్ వ్యవహారంలో అయితే ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని, తమ దాకా వచ్చేసరికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకూడదన్నది రామోజీరావు విధానమన్నది స్పష్టంగా అర్థమవుతుందని నిపుణులు అంటున్నారు.

అగ్రిగోల్డ్‌కు వర్తించిన చట్టాలు మార్గదర్శికి వర్తించవా?

'చందాదార్లను భయపెట్టే యత్నం' అంటూ ఈనాడు ప్రచురించిన వార్తలోని అంశాలను ఎవరూ చెప్పలేదు. ఈనాడే ఓన్ చేసుకుంది. అగ్రిగోల్డ్‌పై చర్యలు కూడా ఇలాగే మొదలయ్యాయి. అగ్రిగోల్డ్‌పై ఏ ఫిర్యాదులూ లేకుండానే కేసులు, అరెస్టులు జరిగాయి. అప్పుడు ఇదే పత్రిక మొదటి పేజీలో పుంఖానుపుంఖాలుగా వార్తలు రాసింది. అప్పుడు అగ్రిగోల్డ్‌ను కాపాడేందుకు ఇలాంటి వార్తే ఎందుకు రాయలేదు? అగ్రిగోల్డ్‌కు వర్తించిన చట్టాలు, సూత్రాలు ఇప్పుడు మార్గదర్శికి వర్తించవా? మార్గదర్శిదే వ్యాపారం కానీ, అగ్రిగోల్డుది వ్యాపారం కాదా?

– సీనియర్ జర్నలిస్టు దారా గోపి

6న శైలజాకిరణ్‌ను విచారించనున్న సీఐడీ

- మార్గదర్శి ఆర్థిక అక్రమాల కేసులో నోటీసులు జారీ
- లుక్అవుట్ నోటీసులు జారీ
- ఇప్పటివరకు స్పందించని శైలజాకిరణ్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఆ సంస్థ ఎండీ చెరుకూరి శైలజాకిరణ్‌కు సీఐడీ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయినప్పటికీ ఆమె ఆ నోటీసులపై సీఐడీకి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు, ఏ–2గా ఉన్న శైలజాకిరణ్‌ను ఇప్పటికే సీఐడీ హైదరాబాద్‌లో వారి నివాసంలో వేర్వేరుగా విచారించింది. ఈ కేసులో మరోసారి విచారించాల్సి ఉంటుందని ఆమెకు సీఐడీ విభాగం ఇటీవల సమాచారమిచ్చింది. హైదరాబాద్‌లో ఆమె అందుబాటులో ఉండే తేదీలు తెలపాలని సూచించింది కూడా. జూన్ 3 తరువాత తాను విచారణకు అందుబాటులో ఉంటానని ఆమె సీఐడీకి తెలిపారు. దీంతో జూన్ 6న హైదరాబాద్‌లో శైలజాకిరణ్ నివాసంలోనే ఆమెను విచారిస్తామని సీఐడీ నోటీసులిచ్చింది. కానీ దీనిపై ఇప్పటివరకు ఆమెగానీ ఆమె తరపు న్యాయవాదులుగానీ సీఐడీకి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు ఆమె విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని భావించిన సీఐడీ అధికారులు ఇటీవల ఆమెపై లుక్అవుట్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఆమె విమానాశ్రయానికి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

పునరావాసం కల్పించాకే.. పోలవరంలో నీటి నిల్వ



సాక్షి, అమరావతి: నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర కమిటీ దిశానిర్దేశం చేసింది. తొలి దశలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో లైడార్ సర్వే ప్రకారం ముంపునకు గురయ్యే గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపై ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ ఝా అధ్యక్షతన కేంద్ర జల్ శక్తి శాఖ, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖల కార్యదర్శులు పంకజ్‌కుమార్, సౌరబ్‌గార్గ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, పీపీఏ సీఈవో, రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శ్రీధర్ సభ్యులుగా కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమావేశాన్ని బుధవారం వర్చువల్‌గా చైర్మన్ అనిల్‌కుమార్ ఝా నిర్వహించారు.

నిధులిస్తే మరింత త్వరితగతిన పునరావాసం

పోలవరం తొలి దశ పనుల పూర్తికి సంబంధించి సవరించిన అంచనా వ్యయం రూ.16,952.07 కోట్లకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని.. ఆ మేరకు నిధులిస్తే మరింత త్వరితగతిన పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర అధికారులు కేంద్ర కమిటీకి వివరించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే పోలవరం జలాశయంలో నీటిని నిల్వ చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో తొలుత 123 గ్రామాలు ముంపునకు గురవుతాయని గుర్తించామని.. వాటిలోని 20,946 కుటుంబాలకుగానూ ఇప్పటికే 12,060 కుటుంబాలకు పునరావాసం కల్పించామని రాష్ట్ర అధికారులు వివరించారు. ఇటీవల నిర్వహించిన లైడార్ సర్వేలో వాటితోపాటు మరో 36 గ్రామాలు 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వస్తాయని తేలిందని.. ఆ గ్రామాల్లోని 16,642 కుటుంబాలకు తొలి దశలోనే పునరావాసం కల్పించాల్సి ఉంటుందన్నారు. వెరసి మొత్తం 25,528 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉందని.. ఇందుకు రూ.7,304 కోట్లు అవసరమని.. ఇటీవల కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదించామని చెప్పారు. వాటిని ఆమోదించి నిధులిస్తే పునరావాసాన్ని త్వరితగతిన కల్పిస్తామని చెప్పారు. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ స్పందిస్తూ.. తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేసే ప్రక్రియ తుది దశలో ఉందని.. ఆ మేరకు నిధులు ఇస్తామని చెప్పారు. ఈ క్రమంలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పనపై యాక్షన్ ప్లాన్ రూపొందించి ఇవ్వాలని అధికారులను కేంద్ర కమిటీ ఆదేశించింది. నిర్వాసితుల జీవనోపాధులను మెరుగుపరిచేలా వారికి వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నామని, విద్యార్హత ఆధారంగా వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి వీలుగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్ర అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇచ్చిన వివరణకు కేంద్ర కమిటీకి సంతృప్తి వ్యక్తం చేసింది. పునరావాసం కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో పనిచేస్తోందని ప్రశంసించింది.

అనుమానాల నివృత్తిపై సంప్రదింపులు

ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల ముంపుపై వ్యక్తం చేస్తున్న అనుమానాలను నివృత్తి చేయాలని రాష్ట్ర అధికారులకు కేంద్ర కమిటీ చైర్మన్ అనిల్‌కుమార్ ఝా సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేంద్ర జల్ శక్తి శాఖ నాలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ స్పందిస్తూ.. పోలవరం ముంపుపై మూడు రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేసి, సుప్రీం కోర్టుకు నివేదిక ఇస్తామని చెప్పారు.

రామాపురంలో మత్స్యకారుల ఘర్షణ

సీఐ, ఐదుగురు కానిస్టేబుళ్లు, 12 మందికిపైగా మత్స్యకారులకు గాయాలు



రెండు వర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం మత్స్యకార గ్రామంలో బుధవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక సీఐ, ఐదుగురు కానిస్టేబుళ్లు, 12 మందికిపైగా మత్స్యకారులు గాయపడ్డారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆరునెలల కిందట ఒక కుటుంబంపై చేతబడి చేశారనే అనుమానంతో ఒక వ్యక్తిని గ్రామంలో నిర్బంధించారు. పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి సర్ది చెప్పారు. తరచూ ఘర్షణలు జరుగుతుండటంతో చేతబడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్గానికి చెందిన వంద కుటుంబాలవారు గ్రామం విడిచి పక్కనే ఉన్న కఠారివారిపాలెంలో ఆరునెలలుగా తలదాచుకుంటున్నారు. దీనిపై బాపట్ల, ప్రకాశం జిల్లాల మత్స్యకార గ్రామాల పెద్దకాపులు వచ్చి మే నెల 24వ తేదీన ఇరువర్గాలకు రాజీ కుదిర్చారు. వంద కుటుంబాలవారిని కఠారివారిపాలెం నుంచి రామాపురంలో వారి ఇళ్లకు పంపించారు. ఈ నేపథ్యంలో కఠారివారిపాలెం నుంచి రామాపురం చేరుకున్న మహిళతో అసభ్యంగా మాట్లాడారని బుధవారం గొడవ మొదలైంది. ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఈ ఘర్షణలో 12 మందికిపైగా మత్స్యకారులకు గాయాలయ్యాయి. ఘర్షణను అడ్డుకున్న పోలీసులపై ఇరువర్గాలు దాడికి దిగాయి. రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఐదుగురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. వీరిలో ఒక మహిళా కానిస్టేబుల్ కూడా ఉన్నారు. గాయపడినవారిలో మత్స్యకారుల్లో కాటంగారి మోహన్‌రావు, సున్నపు కనకయ్య, కాటంగారి చందు, కాటంగారి చరితమ్మ, కాటంగారి పండుస్వామి, వాయల తిరుపతిరావు, కొండూరి నాగమణి, వాయల బాబు, కొండూరి లక్ష్మమ్మ, వాయల పార్వతమ్మ, సున్నపు భువనేశ్వరి, వాయల సాయి మరికొందరున్నారు. కొందరు గ్రామం విడిచి పారిపోయారు.

20 శాతం గ్రామాల్లో మార్కెట్ విలువ సవరణకు అనుమతి

నేటి నుంచి అమల్లోకి రానున్న కొత్త మార్కెట్ విలువలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని స్థిరాస్తుల మార్కెట్ విలువలు ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్వల్పంగా పెరగనున్నాయి. రాష్ట్రంలోని 12, 256 గ్రామాలు, అర్బన్‌ప్రాంతాలుండగా వాటిలో 20 శాతం గ్రామాలు, అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే మార్కెట్ విలువలను సవరించడానికి ప్రభుత్వం ఆమోదించింది. పెరిగిన విలువలు జూన్ ఒకటి (గురువారం) నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆయా ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం మేర మార్కెట్ విలువలు పెరిగే అవకాశం ఉన్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధికారులు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే ఏరియాలను గుర్తించి అక్కడ మాత్రమే సవరణకు అనుమతించారు. ఆ ప్రాంతాల్లో వాస్తవ మార్కెట్ విలువలకు, రిజిస్టర్ విలువలకు ఎక్కువ వ్యత్యాసం ఉండడంతో వాటిని సవరించేలా ఉన్నతాధికారులతో కూడిన రివిజన్ కమిటీలు ప్రతిపాదనలు చేశాయి. వాటి ప్రకారం తుది ప్రతిపాదనలు రూపొందించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం ఆమోదించడంతో కొత్త విలువలు అమల్లోకి రానున్నాయి. అర్బన్ ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం, రూరల్ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. కానీ మూడేళ్ల నుంచి ప్రభుత్వం పూర్తిస్థాయి సవరణకు అనుమతించలేదు. కొత్త జిల్లా కేంద్రాలు ఏర్పడిన చోట మాత్రమే గత సంవత్సరం సవరణకు అనుమతించారు. అక్కడ మార్కెట్ విలువలు ఒక్కసారిగా పెరగడంతో వాటిని సవరించారు. ఇప్పుడు గత రెండేళ్ల నుంచి జాతీయ, రాష్ట్ర రహదారులు వంటి మౌలిక వసతులు పెరిగిన చోట, వ్యవసాయం నుంచి వాణిజ్యానికి మారిన ప్రాంతాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిన ప్రాంతాల్లో సహజంగా మార్కెట్ విలువలు పెరిగాయి. వాటిని సరిచేసేలా మార్కెట్ విలువల్ని సవరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం గ్రామాలు, అర్బన్ ప్రాంతాల్లో ఇవి 20 శాతం మాత్రమే. మిగిలిన 80 శాతం గ్రామాలు, అర్బన్ ఏరియాల్లో మార్కెట్ విలువల సవరణ ఉండదని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధికారులు తెలిపారు.

ఎంపీ సీటు ఏ పిట్టల దొరకిచ్చినా అభ్యంతరం లేదు

విజయవాడ ఎంపీ కేశినేని నాని



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం : విజయవాడ ఎంపీ సీటు ఏ పిట్టల దొరకిచ్చినా తనకు అభ్యంతరం లేదని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో బుధవారం జరిగిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ ప్రారంభ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీ నాని పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. అభివృద్ధికి పార్టీలతో పనిలేదన్నారు. తాను అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తాను ఎవరికీ విరోధిని కాదని, వైఎస్ జగన్, చంద్రబాబుల మధ్యే విరోధమని వ్యాఖ్యానించారు. తన మైండ్‌సెట్‌తో కలిసే ఎవరితోనైనా పనిచేస్తానన్నారు. ఇటీవల నందిగామలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావుతో కలిసి పాల్గొన్న ఎంపీ కేశినేని.. మరోసారి మైలవరంలో సంచలన వ్యాఖ్యలు చేయడం విశేషం.

8న పూర్వ పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్మన్ ఎన్నిక

- విజయనగరం డిప్యూటీ మేయర్ ఎన్నిక సైతం అదే రోజు
- తెనాలి, నర్సీపట్నం, ధర్మవరం, నూజివీడు మునిసిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకూ అదే రోజు ఎన్నిక
- 4 మండలాల్లో ఎంపీపీ, 9 మండలాల్లో ఉపాధ్యక్ష పదవుల ఎన్నిక కూడా ఆ రోజే

సాక్షి, అమరావతి: రాజీనామా చేయడం లేదా చనిపోవడం వంటి కారణాలతో ఖాళీలు ఏర్పడిన వివిధ గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలోపరోక్ష పద్ధతిన జరిగే పలు పదవులకు జూన్ 8న ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని బుధవారం వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు. పట్టణ ప్రాంతాలైన విజయనగరం నగరపాలక సంస్థ, తెనాలి, నర్సీపట్నం, ధర్మవరం, నూజివీడు మునిసిపాలిటీలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రాజీనామా కారణంగా ఖాళీ ఏర్పడిన పూర్వ పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిపేలా నోటిఫికేషన్లు వెలువడ్డాయి. వీటితోపాటు వివిధ జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ఎంపీపీ, 9 మండలాల్లో మండల పరిషత్ ఉపాధ్యక్ష, రెండు మండలాల్లో కో–ఆప్షన్ సభ్యుల పదవులతోపాటు 18 మండలాల పరిధిలోని 53 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించేలా నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 8వ తేదీ 11 గంటలకు ఆయా చోట్ల ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, ఎన్నిక నిర్వహణకు సంబంధించి నోటీసులను ఆయా స్థానిక సంస్థల సభ్యులకు 4వ తేదీకల్లా అందజేయాలని నీలం సాహ్ని తన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఎన్నికలు జరిగే స్థానాలివీ..

పట్టణ ప్రాంతాలు

నగరపాలక సంస్థ/ మునిసిపాలిటీ	ఎన్నిక జరిగే పదవి
విజయనగరం	డిప్యూటీ మేయర్
తెనాలి	వైస్ చైర్‌పర్సన్
నర్సీపట్నం	చైర్మన్, వైస్ చైర్‌పర్సన్
ధర్మవరం	చైర్మన్
నూజివీడు	వైస్ చైర్‌పర్సన్

గ్రామీణ ప్రాంతాల్లో

జెడ్పీ చైర్మన్: పూర్వ పశ్చిమ గోదావరి
మండల పరిషత్ అధ్యక్షులు: రామకుప్పం(చిత్తూరు), బత్తలపల్లి (శ్రీసత్యసాయి), రాపూరు (నెల్లూరు), గాలివీడు (అన్నమయ్య)
మండల పరిషత్ ఉపాధ్యక్షులు: రామకుప్పం, విజయాపురం (చిత్తూరు), రాయదుర్గం, విడపనకల్లు (అనంతపురం), చెన్నే కొత్తపల్లి (శ్రీ సత్యసాయి), ఎల్.కోట (విజయనగరం), పెంటపాడు (పశ్చిమ గోదావరి), సంతమాగులూరు (బాపట్ల), పెదకడబూరు (కర్నూలు)
మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు: చిత్తూరు, తనకల్ (శ్రీ సత్యసాయి)
ఉప సర్పంచ్: 53 గ్రామ పంచాయతీలు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943